# సద్గురు **శ్రీశ్రీశ్రీరామశరణ్ దివ్యలీలా వైభవము**



# సద్గురు శ్రీశ్రీశ్రీరామశరణ్ దివ్యలీలా వైభవము

## ప్రార్థన

శ్రీ సద్గురు పరబ్రహ్మణే నమ:

శ్రీ రామ జయరామ జయ జయ రామ

అగజానన పద్మార్కం గజానన మహర్నిశం ।
అనేక దం తంభక్తానాం ఏకదన్త ముపాస్మహే ॥
క్షోణి తలంబునన్ నుదురు సోకగ మ్రొక్కి నుతింతు సైకత
శ్రోణికి చంచరీక చయ సుందర వేణికి రక్షి తామర
శ్రేణికి తోయజాత భవచిత్త వశీకరణైక వాణికిన్
వాణికి నక్షదామ శుకవారిజ పుస్తక రమ్య పాణికిన్.

శ్రీ కంఠ చాప ఖండన
పాకారి ప్రముఖ వినుత భండన విలసత్
కాకుత్థ్స వంశమండన
రాకేందు యశోవిశాల రామనృపాలా:॥
హృదంబుజే కర్ణిక మధ్య సంస్థే
సింహాసనే సంస్థిత దివ్య మూర్తిమ్ ।
ధ్యాయేద్గురుం చంద్రకళా ప్రకాశం
సచ్చి త్సు ఖాభీష్ట వరం దదానమ్ ॥

# గురుదేవుల సందేశము

***1965 ఏప్రియల్ 27,28,29 తేదీలలో అత్యంత ఘనంగా జరిగిన గునేదేవుల షష్ఠిపూర్తి జన్మదిన మహో త్స వములలో 29వ తేదీన గురుదేవుల జన్మదినోత్సవము రోజున వారి దివ్య సందేశము :***

శ్రీప్రభుదత్త బ్రహ్మచారిగారు వ్రజభాషలో 'భాగవతకథా' అను గ్రంథమును అరువది భాగములుగా రచించినారు. వారి ఆజ్ఞచేతనే నేనా అరువది భాగాలను తెలుగుభాషలో అనువదించినాను. అత్యధిక పరిశ్రమచేత నేత్రావరోధము కలిగినది. వాటిని ప్రకటించి ప్రచారము చేయుట అభిమానుల,శిష్యులయెక్క కర్తవ్యమైఉన్నది. నేనెన్నడు గురువు కావాలని తలచలేదు. ఇప్పుడూనాకా భావము హృదయము నందు లేదు. ఒకరికి గురువుగా ఉండటంకంటే నూరుగురికి శిష్యుడిగా ఉండటంక్షేమం. నేను పలువురికి శిష్యుడిగా ఉండటమే కోరతాను. కాని నేను తీవ్రముగ అనుష్ఠానం చేసేటప్పుడు మా గురుదేవులు స్వప్నంలో దర్శనమిచ్చి, 'నిన్ను అడిగేవారికి మంత్రమీయనని అంటున్నావుకదా నేనుకూడ నీవలెనే తిరస్కరించి మంత్రమివ్వకపోతే నీగతి ఏమయ్యేది.?'అన్నారు. వారి యాజ్ఞశిరోధార్యం కనుకనాయందు భక్తి గలవారికి మంత్రదీక్ష నిచ్చాను. **నేను శిష్యులకిచ్చింది అక్షయమైన మంత్రము.దానికై వారు కూడ గురుదక్షిణ అక్షయమైన వస్తువు (హృదయము) నే ఇవ్వవలసి ఉంటుంది! నేనిచ్చిన మంత్రమును శ్రద్ధా భక్తులతో జపించి సిద్ధిని పొందితే అదేనాకు పదివేలు.సాధనా సిద్ధిని పొందిన వారే నాకు అత్యంత ప్రియులు! వారి యందు నాకు యథార్థమైన వాత్సల్యం ఉంటుంది.**
**ఆ సందర్భంలో పలువురు శిష్యులు గురుదేవులకు సమర్పించిన పైకము,వాగ్దానము చేసిన విరాళములు - ఈ ద్రవ్యమేమీ తనకు అక్కరలేదనీ ఆద్రవ్యం మొత్తాన్ని నామప్రయాగ స్వామికి సమర్పిస్తున్నానని ప్రకటించినారు !!!.**

# గురుదేవుల అంతిమ సందేశము

“నేను దేహమును చాలించినను మీకు కనిపించుచునే ఉందును. దేహముతో ఉన్నప్పుడు కొంతవరకు మాత్రమే పరిమితి ఉంటుంది. దేహము చాలించిన తరువాత నాశిష్యులు ఎంతదూరమున ఉన్నను అన్ని ప్రదేశములను తిరుగుచు వారి మంచి చెడులను పైనుండి చూచుచుందును. దేహము చాలించిన పిమ్మట బుద్దాంలో నేను ప్రతిష్ఠించిన పవనకుమార్‌లో నా ఆత్మను ప్రవేశపెట్టెదను. విభూతిని పవనకుమారుని పాదముల చెంత యుంచి మీబాధలు చెప్పుకొని నన్ను ప్రార్థించిన యెడల మీబాధలు తొలగును. ఆవిభూతిని నుదుట ధరించండి. నేను లేనని బాధపడవలదు. నెను ఎక్కడికి వెళ్లను. మీరు ఎప్పుడు నన్నుపిలిచిన అప్పుడు మీవద్దకు వచ్చెదను. అవసరమైన

యెడల మరల మరల జన్మించెదను. నాశిష్యులందరికి ముక్తి లభించు వరకు వారిని నేను తీర్చిదిద్దెదను.సంసార మనే సముద్రములో కొట్టుకొని పోవువారికి నేను నావనై ఒడ్డుకు చేర్చెదను.”

**శ్రీ గురుభ్యో నమ:**
**శాంతి శ్శాంతి శ్శాంతి:**

# శ్రీశ్రీరామశరణ్ పరబ్రహ్మణేనమ:

## శ్రీగాయత్రీ పీఠాధిపతులగు శ్రీశ్రీశ్రీవిద్యాశంకర భరతీస్వామివారి ఆశీ:పూర్వక ప్రశంస:-

**1.పంచశీల ప్రణాళిక** :- 1.రామనామ లేఖనం 2.రామనామకీర్తనం 3.రామనామ ప్రవచనం 4.రామనామ భోజనం 5.రామనామ వస్త్రధారణం అను పంచవర్ష ప్రణాళికతో వారి మనస్సు రామనామమయమై,దేహము కూడ పవిత్రమై రామనామాన్ని ధ్వనింపచేయుచున్నదా అన్నట్లయినది.

**2.**వారి దర్శనంచేత,సాంగత్యంచేత,శిష్యత్వంచేత,సేవచేత అనేకమంది నాస్తికులు ఆస్తికులుగా మారిరి!

**3.**‘రామ’ అను పరబ్రహ్మమునందు చరించుటచేత బ్రహ్మచారులు,కాంతాకనకములందు వాంఛలేని గృహస్థులు, నిరంతరము రామ నామము మననము చేయు వానప్రస్థులు,అందరిని ఆత్మ స్వరూపులుగ చూచు సర్వాత్మ భావము కలిగి, జగత్కుటుంబులై కాషాయవస్త్రధారణం మాత్రం చేయని యతీశ్వరులు అయి విరాజిల్లుచున్నారు.

**4.**వారు రచించిన గ్రంథములను చేతనయినంతవరకు అచ్చువేయుట,వారిచ్చిన మంత్రములను జపించుచూ నామసంకీర్తనము చేసి తరించుట వారి శిష్యులు వారికిచ్చు గురుదక్షిణ అని వారు వాక్రుచ్చిరి!

**5.**రామనామ ప్రభావమును గురించి వారి కృషి అసదృశమగుటచేత,వారి ప్రవచనం కథాసంకీర్తనం నిరుపమానములై ,శ్రోతలను భక్తి తరంగములలో ఓలలాడించిన ఇట్టి భక్తి నిష్ఠకు తోడుగ,వారు సకాల సంధ్యావందనం, సహస్ర గామత్రీజపం,యితర అనుష్ఠానములు,వైశ్వదేవము మున్నగు సదాచార సంపత్తులతో కూడిన కర్మనిష్ఠను జగద్గురు శంకరుల అద్వైతభాష్యశ్రవణం,మననంల ద్వారా జ్ఞాననిష్ఠను సంపాదించుకొనిరి.

**6.మనోవాక్కాయముల మాలిన్యమును క్షాళనము చేసికొనుటకు గురుస్తుతికి మించిన జలము లేదు!**

## ‘సర్వతంత్ర విశారద’ శ్రీ కుప్పా శ్రీఆంజనేయశాస్త్రి గారి ప్రశంసాశీర్వచనము

1.భగవంతునికి అత్యంత సన్నిహితంగా నొనగూర్చునది పూజగాన నరసదాసుగారు అత్యంత ప్రీతితో శ్రీరామ పూజ చేయుచుండెడివారు.నరసయ్యగారు పవిత్రమైన భావము కలవారు.వారు భగవంతున కత్యంత సన్నిహితులు. ఒకరోజున వారు భగవంతునకు పూజచేసి ప్రసాదమునకు చేతుల ు పట్టగా శ్రీరాముని విగ్రహము నుండి ఒక పుష్పము వారి చేతిలో బడెను!ప్రత్యక్షముగా భగవదనుగ్రహము కలిగినదనుటలో నాశ్చర్యము లేదు.

2.ఆర్థికమగ సామాన్యకుటుమ్మై ఉపాధ్యాయపదవితో కాలంగడుపుచు ఈపూజా పురశ్చరణలు,ఈమహాత్ముల సందర్శన భాగ్యములు, యాత్రాసేవనములు సంప్రాప్తించుట వీరియొక్క పరాకాష్ఠను, వీరిమందలి భగవదనుగ్రహమును వేనోళ్లచాటుచున్నది.

3.తులసీరామాయణమును ప్రవచనము చేయునపుడు వారిట్లు చెప్పిరి. "ఒకసారి బాపట్లలో నన్ను తులసీ రామాయణమును చెప్పుడని కొందరు కోరిరి.నేను వారి మాటకదనలేక చెప్పుటకొప్పుకొంటిని.కాని నాకా భాష కొత్త బాగుగా పరిచయములేదు. నాఇష్టదైవమైన రామచంద్రమూర్తిని మనస్సులో ధ్యానించి చెప్పుటకు పూనుకొంటిని. రామచంద్రమూర్తి పలికించిన నాపలుకులు శ్రోతలకెంతయు నాశ్చర్యమును, ఆనందమును కలిగించినవి.ఆభగవంతుని అనుగ్రహంచేతనే నేనీరామాయణంను చెప్పుచున్నాను".

# గురు ప్రబోదలు

## గురుదేవులు వివిధ సందర్భాలలో ఇలా ప్రబోదించారు:-

" భగవంతుడు దయామయుడు.వ్యాధి రూపేణా మనపాపాలను తొలగిస్తాడు.ఈ సంసార సముద్రమును దాటించే నావను నేను.మీరంతా తరించడానికి యెన్ని జన్మలైనా యెత్తుతాను.మిమ్మల్ని తరింపజేస్తాను. శిష్యులైన ప్రతి ఒక్కరిని వదిలిపెట్టక వానిని తరింపజేస్తాను.వాని కొరకు ఎన్ని జన్మలైనా ఎత్తుతాను. సిద్ధి పొందిన తర్వాత నేను నా తేజస్సు రూపంలో వారివారి ఇండ్లలో ఉంటూ వారిని కాపాడతాను."

## సహస్రచంద్రదర్శనం సందర్భంలో:-

"నేను రామనామ ప్రచారానికై వచ్చాను.అదిచేసి పోతాను.నేను ఒకచోట ఉండే వాణ్ని కాదు.నా శిష్యులు ఎక్కడెక్కడ ఉంటారో నేను అక్కడక్కడ పర్యటిస్తాను.నిరంతరం రామనామం చేయండి.నామంలో పుడదాం నామంలో పెరుగుదాం నామంలో చద్దాం."

1946 వసం.నుండి రామనామ బియ్యంతో వండిన అన్నం మాత్రమే భోజనం చేసేవారు.అందుకు రెండు

కారణాలు : ముఖ్యంగా శిష్యులను,అభిమానులను తరింప జేయడానికి ప్రతి గింజను 'శ్రీరామ' అంటూ రామనామంతో ఏరాలి.గురువుగారి కోసం శిష్యులు,అభిమానులు రామనామం చేస్తూ ఏరిన బియ్యమును సమర్పించి తరించేవారు.

మరియొక కారణం గురుదేవులు ఇలా చెప్పేవారు."నేను కంటితో రాముని,రామభక్తులను చూస్తాను. చెవులతో రామచరిత్ర,రామనామం వింటాను.నోటితో రామనామాన్నే పలుకుతాను.ముక్కు ద్వారా రామనామ జపం (శ్వాసజపం) చేస్తాను.చేతులతో రామకథను,రామకోటిని వ్రాస్తాను.పాదాలతో రామాలయానికి,రామ

భక్తుల వద్దకు కెడతాను.మనస్సుతో రామరూప ధ్యానం చేస్తాను.ఇక మిగిలింది ఈ పాంచభౌతిక శరీరం అంటే అన్నమయకోశం.రామనామబియ్యంతో అన్నం తింటే అంత:శుద్ది కలుగుతుంది.కనుక అంతా రామమయ మౌతుంది."అని.

# శ్రీశ్రీ శ్రీరామశరణ్ ఉవాచ!

**రామనామా త్పరోమంత్ర: నభూతో న భవిష్యతి**

**నా రాముడు సత్యవాది నేను ఎప్పుడు అబద్దమాడను.**
**నా రాముడు జితక్రోధి నాకు ఎప్పుడు క్రోధము లేదు.**
**నా రాముడు మితభాషి నేను అవసరమైనప్పుడు దైవసంబంధమైన ప్రసంగము తప్ప మరియేమియు మాట్లాడను.**
**నా రాముడు ఎప్పుడు ఆడిన మాట తప్పలేదు.నేను ఆడిన మాట తప్పను.**

# మున్నుడి

సాధువులను రక్షించుట కొరకు, దుష్టులను శిక్షించి,ధర్మ సంస్థాపనము చేయుట కొరకు భగవానుడు అంశగానో పూర్ణముగానో అనెక మారులు అవతరించినాడు.వానిలో రామ,కృష్ణాది పలు అవతారములు ఉత్తర భారతదేశములో నే సంభవించినవి.

భగవద్భక్తిని ప్రజానీకములో ప్రచారము చేయుటకు తాత్వికులు,పరమభాగవతోత్తములు అనేకులు దక్షిణ భారతదేశములో జన్మించిరి.దక్షిణాదిన ఆళ్వారులు , నాయనార్లు, మహారాష్ట్రములో సక్కుబాయి, తుకారాం, గోరాకుంభార్, నామదేవుడు మొదలగువారు భక్తి తత్వమును విశేషముగా ప్రచారము చేసినారు.

మన రాష్ట్రములో కూడ దేవీఉపాసకులు, శ్రీకృష్ణ మంత్రోపాసకులు, రామభక్తులు భక్తి ప్రచారము గావించుచున్నారు. మన రాష్ట్రములో రామ మంత్రో పాసకులు పలువురు జన్మించిరి. వారందరిలో ప్రధమముగా గణింపదగిన వారు, 'శ్రీరామశరణ్' గా లబ్దప్రతిష్టులైన శ్రీకుందుర్తి వేంకట నరసయ్య పాకయాజి గారు. వీరు గుంటూరు జిల్లా లో జన్మించి ఉపాధ్యాయులు గా పనిచేసిరి.

బాల్యము నుండి దైవభక్తి కలిగి తాను యశోద గా భావించి కృష్ణ భక్తి కల్గియుండిరి.తదనంతరకాలములో వాసుదాస స్వామి వారివద్ద 'శ్రీరామ' మంత్రము ఉపదేశము పొంది,కోట్లాది జపము చేసి మంత్ర సిద్దిని పొందిరి . అనేక పుణ్యక్షేత్రములలో, తీర్ధములలో 'రామ' పురశ్చరణము చేసి రామ దర్శనమును పొందిరి . తాము రామ దర్శనమును చేయుటయే గాక తమ శిష్యులకు సహితము రామ దర్శనము చేయించగల సమర్దులు. శ్రీరామ మంత్రానుష్టానము వలన శ్రీరామశరణ్ గురుదేవులు పొందిన దివ్యానుభూతులు ఇన్ని అని చెప్పనలవికాదు. గళమెత్తి సంకీర్తనము చేయుచున్నప్పుడు సభయంతయు పులకించిపోయెడిది .

శ్రీరామశరణ్ గురుదేవులు నూట ఎనిమిది కంటె ఎక్కువ గ్రంధరచన చేసిరి. రాష్ట్రమంతటా నామప్రచారము చేసినారు.వీరికి వేల సంఖ్యలో శిష్యులు కలరు. ఒకసారి ఒక సభలో 'రాముడు లేడు' అను

వారెవరో వారిని నావద్దకు తీసికొని రండి . ఈవిగ్రహము నందే నేను రాముని చూపించగలను.లేనిచో నా తల కోసికొందును అని విస్పష్టమగా ప్రకటించినారు.అట్టి మహిమాన్వితులైన శ్రీరామశరణ్ గురుదేవులు ప్రాత: స్మరణీయులు.

మనందరికి ఆదర్శప్రాయమైన వీరి జీవితచరిత్ర, ఆధ్యాత్మికముగా వీరికి కల్గిన పలు దివ్యానుభూతులలో కొన్నిటిని, వీరి అనుగ్రహముచే విరి శిష్యులు , భక్తులు , అభిమానులు , ఇతరులు పొందిన దివ్యానుభూతులు ఇత్యాదులు ముందు పేజీలలో చదివి స్ఫూర్తిమంతమయ్యెదము గాక.

# శ్రీరామ శరణ్ గురుదేవుల జీవితచరిత్రము

## బాల్యము ----- విద్యాభ్యాసము:

భగవంతుడు ఈ లోకమున అవతరించునప్పుడు ,భగవానుని పార్షదులు భగవంతుని గుణములను , నామమును కీర్తించుటకును ఈలోకమున అవతరింతురు. అట్టి మహనీయులలో శ్రీశ్రీరామ శరణ్ గురుదేవులు అగ్రగణ్యులు. భక్తి ప్రచారము గావించుట కొరకు వీరు నామావతారముగా నవతరించిరి.

శ్రీరామ శరణ్ గురుదేవులు విశ్వావసు నామ సంవత్సర చైత్ర బహుళ త్రయోదశి బుధవారం రేవతి నక్షత్రమున, మకర లగ్నము నందు రాత్రి యించు మించుగా పదిగంటలకు జన్మించిరి. (ఆంగ్లతేది- 2-5-1905 ).వీరి జననీ జనకులు సీతమ్మ, లక్ష్మీనరసయ్య గార్లు. గురుదేవుల జన్మనామము వేంకట నరసయ్య. గురుదేవుల తండ్రి గారు వెంకటగిరి , విజయనగరము , పుష్పగిరి మొదలగు అనేక తావులందును , ప్రముఖుల వద్దను తన హాస్యమును అద్భుతముగా ప్రదర్శించి ' హాస్యకళాప్రపూర్ణ ' అను బిరుదు ను పొందిరి. గురుదేవులు తండ్రిగారి నుండి హాస్యమును , తల్లి గారి నుండి శాంతము , ఓర్పు గుణములను పుణికి పుచ్చుకొనిరి.

# భక్తి సంస్కారము

1919 సంవత్సరము నాటి సంఘటన! అప్పట్లో గురుదేవులకు కృష్ణభక్తి అధికముగా ఉండెడిది.పొన్నూరులో ఉన్నప్పుడు వీరు ప్రతిదినము సాయంవేళ లలో వారి బంధువుల యింటికి భజనకు వెళ్ళెడివారు.భాగవత ప్రవచనము కూడా జరుగుచుండెడిది. ఉపన్యాసములు,హరికథలు వినుటవలన వీరిలో భక్తి గాఢముగా నాటుకొనినది.

పొన్నూరు లో ఉన్నప్పుడు ఏకాంతముగా ధ్యానము చేసికొనుటకు పొలము లోనికి వెళ్ళెడి వారు. ఒకనాటి సాయంత్రము ప్రకృతి లోని చెట్లను చూచుచూ,వానిలో నుండి బాలకృష్ణుడు వస్తునట్లూ ,తలమీద పింఛమును చూచుచున్నట్లూ భావించిరి.ఇంతలో తెరలు, తెరలు గా పొగ అడ్డము వచ్చినట్లుగాను,దట్టమయిన మంచు కమ్మినట్లయి గోకులము యొక్క వీధి దృశ్యము కనబడెను. ఆవీధిలో బాలకృష్ణుడు, గోపబాలురు ఆడుకొనుచుండిరి.పిల్లలతల్లిదండ్రులు

వారి పిల్లలను ఇండ్లకు తీసుకొని పోవుచుండిరి.గురువుగారు తమను యశోదగా భావించుకొని బాలకృష్ణుని చూచి ఆశువుగా 'లాలకు రారా నాన్నా ' అను కీర్తనను పాడినారు.కృష్ణుడు రాలేదు.గురువు గారు 'రావా......రావా' అనుచు వెంట బడిరి.చేనుగట్టు తగిలి బొప్పి కట్టినది.ఇలా సాయంత్రము ఆరుగంటల నుండి రాత్రి పన్నెండు గంటల వరకు చిమ్మచీకటిగానున్న ఆ పొలములో బాలకృష్ణుని లీలలలో మైమరచి యుండిరి !

పిన్న వయస్సునందే గురుదేవులు ఆధ్యాత్మిక భావాలు అధికముగాకలిగి యుండెడివారు.వారి తల్లి నాలుగు రూపాయలు యిచ్చి శాంతిఆశ్రమము, విశాఖపట్టణము దగ్గరగల తోటపల్లి కొండలు చూచిరమ్మని పంపి నార గురుదేవులు పొన్నూరు నుండి వెర్రిపాలెం వెళ్ళితొంబది మైళ్ళు నడిచి భద్రాచలము వెళ్ళిరి. తల్లి ఇచ్చిన నాలుగు రూపాయలలో రెండు రూపాయలు ఖర్చు అయినవి. భద్రాచలములోనె జపము చేసి కొనిరి. ఒక రూపాయి ఖర్చుచేసి తల్లికొరకు పండ్లు,పటికబెల్లము, కుంకుమ కొనినారు. మిగిలిన, ఒక్కరూపాయితో యిల్లు చేరినారు !

# ఉపనయనము

బ్రాహ్మణులకు ఉపనయన సంస్కారము ముఖ్యము కావున గురువుగారికి ఒక శభముహూర్తమున ఉపనయ నము చేసి గాయత్రి మంత్రోపదేశము చేసి దాని మహిమను గూర్చి తెలిపిరి. పిమ్మట గురుదేవులు ప్రతిదినము ఉదయము ఒక సహస్రము, సాయంత్రము ఒక సహస్రము గాయత్రి మంత్రమును జపించుచుండిరి.ఒకదినమున సూర్యుని గమనించుచు గాయత్రిమంత్రమును జపించుచుండగా సూర్యబింబము దగ్గరకు వచ్చుచున్నట్లు తోచెను.దూరముగా
ఉన్నబింబము కాంతిపుంజముగా నుండి దగ్గరకు రాగానే అయిదు తలలతో పంచరంగులతో కాంతివంతముగా దర్శన మిచ్చి 'నీ ఉపాసనకు సంతసించితిని.నీవు చాల అభివృద్ధి లోనికి రాగలవు' అని పలికి అంతర్ధానమయ్యె !

# భారతస్వాతంత్రోద్యమమున పాల్గొనుట

అవి దేశమాత పరదేశ దాస్యమున మ్రగ్గుచున్నరోజులు.దాస్యశృంఖలాలను త్రెంచుటకై స్వాతంత్ర్య సమరయోధులు ముమ్మరముగా పోరాడుచుండిరి.

గురుదేవులు వినాయక సావర్కరు ఆంగ్లమున రచించిన 'స్వాతంత్ర్య పోరాటము 'అను గ్రంథమును చదివి ప్రభావితులైరి. 13-7-1920 తేదీన లోకమాన్య బాలగంగాధర తిలక్ స్వర్గస్థుడు కాగా ప్రపంచములోని రాజ్యములు వారి పతాకములను అవతనము చేసినవి. కాని గురువుగారు చదువుకొనుచున్న పాఠశాలకు మాత్రము సెలవీయలేదు. శ్రీ కొమాండూరు సంపత్కుమారాచార్యులు గారి నాయకత్వమున పాఠశాలకు వెళ్ళకుండా తరగతులు బహిష్కరించిరి.

1921 సహాయనిరాకరణోద్యమము కాంగ్రెసు తీర్మానము ప్రకారము పాఠశాలకు విద్యను బహిష్కరించి జాతీయ కళాశాల లోచేరిరి. శ్రీభోగరాజు పట్టాభి సీతారామయ్య గారు గురుదేవులను,మరి నలుగురైదుగురు విద్యార్థులను వారింటికి తీసికొని పోయి ఉపన్యసించుటను నేర్పినారు. తర్వాత అది ఆధాత్మిక ఉపన్యాసము లిచ్చుటకు ఉపకరించెను.

1921 లోనే జాతీయకళాశాలలో చదువుమానివేసి స్వచ్ఛంద దళములో చేరి స్వాతంత్ర్యోద్యమ ప్రచారములో తీవ్రముగా పాల్గొనినారు. పన్నుల నిరాకరణోద్యమము ఉధృతముగా సాగుచుండెను. దానినణచుటకై దొరతనమ వారు మరఫిరంగులను పంపిరి. వాటిప్రేలుళ్ళకు జనులందరు భయకంపితులై పారిపోయిరి. గురువుగారు, తూములూరిశివ రామయ్య మాత్రమే మిగిలిరి. వీరు రొమ్మును చూపించుచు నిలువబడిరి. రక్షకభటులు గాంధీ టోపీలను లాగుకొని వెడలిరి. ఊరి వారు వీరిద్దరికి పూలదండలు వేసి ఊరేగించిరి.

922 లో శాసనోల్లంఘన కమిటీలో చేరి 140 మందితో కలిసి శాసనోల్లంఘనము చేసినారు. మూడు రోజుల శిక్ష పడినది. కృష్ణాజిల్లా కలెక్టరు వీరిని మైనర్లుగా తలచి కోర్టువదిలేవరకు శిక్షవేసిరి. తరువాత ఈ ఉద్యమము ఆపివేయబడినది.

# వివాహము - ఉద్యోగము

శ్రీరామశరణ్ గురుదేవులకు పదునైదేండ్ల ప్రాయము వచ్చినది. తల్లిదండ్రులు వీరికి వివాహము చేయతలచిరి. వీరి తండ్రి నిర్లిప్తుడు గా నుండెడివారు. తల్లి గారికి తన అన్నగారి కుమార్తెను కోడలుగా చేసికొనవలెనని కోరిక. కాని ఆమె వదిన గారికి మాత్రము వీరి ఆర్థిక పరిస్థితిని చూచి తన కుమార్తె సుఖపడలేదని తలచి వీరికిచ్చుటకు ఇష్టపడలేదు. ఒకనాడొక గొప్పయోగి, పండితుడునగు పోతుకూచి చల్లయ్య శాస్త్రి గారు వచ్చిరి. వారు గురువుగారి చేతిని చూచి 'ఈతడు గొప్ప అదృష్టవంతుడు. చదువునకు కొదువలేదు. మంచి భక్తి బాల్యముననే అబ్బినది. సందేహింపక పిల్ల నీయవచ్చును.' అని హితవు చెప్పిరి. అప్పుడు అంగీకరించి తమరెండవ పుత్రికయగు శేషమాంబను గురుదేవులకిచ్చి దుర్మతి నామసంవత్సరము వైశాఖశుద్ధ ఏకాదశినాడు వివాహము జరిపించినారు.

చదువును మధ్యలోనే ఆపివేసి నందువలన వైద్యము చేసికొని యైనను బ్రతుకవచ్చునని ఆయుర్వేద గ్రంథములను అధ్యయనముచేసిరి.

మద్రాసు లో శ్రీమద్దుమల్లయ్య గారి కమీషన్ కొట్టులో సుమారు ఆరుమాసములు పనిచేసిరి. అచట అబద్ధములు,చెప్పవలసి రావడము వలన ఆఉద్యోగమును మానుకొనిరి.

గుంటూరు లో శ్రీఅక్కెన ప్రగడ సూర్యనారాయణ గారి వద్ద ప్లీడరు గుమాస్తాగా చేరిరి. అక్కడ కూడ అబద్ధములు చెప్ప లేకపోవుటచేత ఆఉద్యోగము కూడా ఆఱునెలల ముచ్చటే అయినది.

తెనాలి మారీసుపేట లో చతుర్భుజదాసు అనుజ్యోతిష్కుని వద్ద గుమాస్తాగా చేరిరి. ఆజ్యోతిష్కుని శక్తి అత్యద్భు తమయినది. మంచిఉపాసకుడు. దివ్యదృష్టి కలవాడు. గురువుగారికి అచట జ్యోతిషంలోను, ప్రశ్నాశాస్త్రములోను, కొద్దిగా హస్తసాముద్రికము లోను పరిచయము కల్గినది. ఇటుల సంవత్సరము ఆరుమాసాలు గడిచినవి. చతుర్భుజదాసు దురభ్యాసములకు లోనయినాడని తెలిసి ఆఉద్యోగమును కూడ మానుకొనిరి.

1925 లో బాపట్లకు నాలుగైదు మైళ్ళదూరమున గల జమ్ములపాలెం లో ఒక ప్రయివేటు పాఠశాలలో ఉపాధ్యాయ వృత్తిని చేపట్టిరి. ఉపాధ్యాయ వృత్తి అన్నిటి కంటె ఉన్నతమైనది.దీనికి లంచములురావు.పిల్లలకు మన విద్యను బోధించిన విద్య మరపునకు రాకుండా యింకను విజ్ఞానము వృద్ధి అగుచుండును.అబద్ధములాడ వలసిన పని లేదు. పిల్లలను రాముళ్లుగానో, కృష్ణుళ్లుగానో భావించుచు తమను సాందీపునిగానో, వశిష్టుని గానోభావించ వచ్చునని తలచిరి.

# లలిత కళల ప్రవేశము

గురుదేవులు బందరు జాతీయ కళాశాలలో చదువునప్పుడు చిత్రలేఖనము,పెయింటింగును నేర్చుకొనిరి. సంగీతమును,విలువిద్యనుకూడా అభ్యసించిరి. బాపట్ల హనుమంతరావు గారు కవులు, ఉపాధ్యాయులు. వీరి సహచర్యముతో గురువుగారు కవితలల్లడము నేర్చుకొనిరి. చంపకమాలా వృత్తములో 'భక్తవత్సలా!' అను శతకమును,

శార్దూల,మత్తేభవృత్తములతో 'కోదండరామప్రభూ' అను శతకమును,గీతములతో,'గోపాలకృష్ణా' శతకమును , రవి కులాంబుధిచంద్ర శ్రీరామ చంద్ర! మకుటముతో గీతపద్య శతకమును, 'శ్రీత్రివిక్రమా!' అను మకుటముతో ఒక శతకమును రచించి తరువాత ఎందులకో చించివేసిరట!

వీరు రచించిన శతకములలో ఒకదాని నుండి మచ్చునకు

గీ॥ శ్రీరమా రమణీమణీ చిత్తచోర
భక్తజన మానసోద్యాన పారిజాత
రాధికాకుచ సరసిజ రాజహంస
వందనం బిదె వేణు గోపాలకృష్ణ ॥

ము.గ్ర.॥ సరస తర వేష రత్నభూషా విశేష
శేష భూషణ హృత్సరసిజ నివాస
వాసవాది సురవినుత పాదపద్మ
పద్మ దళనేత్ర వేణు గోపాలకృష్ణ ॥

ఒక నాటకసమాజమును స్థాపించి నాటకము లాడెడివారు. గురువు గారు 'వీరాభిమన్యు' నాటకములో ద్రోణాచార్యులు , 'సతీఅనసూయ'లో బ్రహ్మ,'రుక్మాంగద' లో నారదుడు, 'వరవిక్రయం' లో సింగరాజు లింగరాజు పాత్రలను పోషించిరి.

# మంత్ర దీక్ష

శ్రీరామ శరణ్ గురుదేవుల పెత్తండ్రి కుమారుడు ఆంజనేయోపాసకులు.వారు ఆంజనేయస్వామితో మాటలాడెడువారు. ఒకనాడు గురుదేవులను చేరబిలిచి 'ఆంజనేయమంత్రము నిచ్చెదను.దీనిని జపించిన చాల పైకి రాగలవు.లోకములో చాలా కీర్తి సంపాదించగలవు.ఆంజనేయుడు చేయలేనిది, ఈయలేనిది యేదియును లేదు,' అని చెప్పి వారికి ఆంజనేయమంత్రము నుపదేశించెను.

గురుదేవులకు యిష్టదైవము 'కృష్ణుడు'. బాలకృష్ణుని దర్శనమయినది. కృష్ణ మంత్రోపదేశము పొందవలెనని పిపాసకల్గినది. 'ఆంధ్రవాల్మీకి' వావిలకొలను సుబ్బారావు గారు కృష్ణమంత్రము నుపదేశింతురేమోనని జాబు వ్రాసిరి. 'ప్రస్తుతము శ్రీమద్రామాయణము ను 108 సార్లు పారాయణము చేయిచుంటిని, తరువాత ఉపదేశింతును ' అని వారు బదులిచ్చినారు.వీరు 'వాసుదాస స్వామి' గా ప్రసిద్ధులు.

1925 లో ఒంటిమిట్ట కోదండ రామాలయము యొక్క ధ్వజస్థంబము పెద్దగాలివానకు విరిగి పోయినది. వాసుదాస స్వామివారు దీక్ష విరమించి మరల ధ్వజస్థంబము ను ప్రతిష్టించుట కొరకు భిక్షాటన చేయుచు బాపట్లలోని వారి శిష్యుని వద్ద ఏతెంచిరి. ఆ సందర్భము లోనే శ్రీస్వామి వారు రామతత్వమును గూర్చి ఉపన్యసించిరి. రామకోటి లేఖనము విశిష్టతను గూర్చి చెప్పిరి. ఆసభకు గురుదేవులు కూడా వెళ్ళిరి.ఉపన్యాసము అయిన తరువాత స్వామివారు 'రామకోటి వ్రాయువారెవరో చేతులెత్తండి' అని అడిగిరి.ఒక్క గురువుగారు తప్ప అందరు చేతులెత్తిరి .ప్రక్కన ఉన్న వీరి మిత్రుడు గురువు గారి చేతిని బలవంతముగా పైకి యెత్తించెను.

శ్రీవాసుదాస స్వామి వారు మరల నెల దినములకు వచ్చిరి.21-10-1926 తేదీన గురుదేవులకు 'శ్రీరామ ' మంత్రోపదేశము చేసిరి.గురుదేవులు రామ మంత్ర జపము చేయుచున్నను మనస్సంతయు బాలకృష్ణుని యందే ఉండెడిది. రామకోటి వ్రాయుచున్నను ధ్యాస కృష్ణుని మీదనేయుండెడిది.

ఒక దినమున జాగ్రదవస్థలోనే కూర్చుండి యున్నప్పుడు బాలకృష్ణుడు భుజముపై వ్రాలి 'నన్ను వదిలివేయుచున్నావా' అని దీన భావమును ప్రదర్శించుచు అనెను. 'నేను నిన్ను వదులుటలేదు.నీవు నాబిడ్డవు, రాముడు నాకు సోదరుడు, అతనిని సఖ్యభావముతో చూచువాడను.' అని గురుదేవులు పలికినారు.

# బాలకృష్ణ , రామ దర్శనం !

కడుశ్రద్ధగా మంత్ర సిద్ధిపొందవలెనని రోజుకు 21,600 జపము నాలుగు గంటల కాలములో చేస్తూ పది వేల రామనామము వ్రాస్తూ రాత్రింబగళ్లు రాముని రూపము మనస్సున నిడుకొని పూనికతో ధ్యానం చేసెను దాదాపు ఆరు మాసాలకు మైథిలీనాథుని హృదయమున బంధించి ఇంద్రియములను నిరోధించి దృఢసంకల్పంతో రామునికై నియమమున ధ్యానం చేస్తుండగా ఒకనాటి రాత్రి వన్నెలనీను చిన్నికృష్ణుడు కన్నులనీరు కార్చుచూ, "ఎన్నో రోజులుగా నీసున్నిత హృదయంలో ఎంతో గౌరవంతో ధరించిన నన్ను విడిచిపెడుతున్నావు. నమ్మకంతో అమ్ముడుహో పోయి నీసొమ్మునైన నన్ను పొమ్మనడం న్యాయమా?" అనగా గురువుగారు 'స్వామీ! మీరేగా ఆచార్యుని రూపంలో వచ్చి నాకు దీక్ష ఇచ్చారుగదా! శ్రీరామో బ్రహ్మతారకం అని తారకమంత్రమునుపదేశించి రాముని కంటె రమ్యమైన రూపం భవ్యమైన ధామం లేదని,రామమూర్తి అంటే ఆనందములరాశియే అని బోధించారు గదా!... ఏది ఏమైనా నాకు గురువే కల్పతరువు. ధరణిలో వారి చరణమే శరణము. వారి బోధయే పరమపదమునకు విధి...' ఈవిధముగా గురుభక్తి ప్రపూర్ణులైన శ్రీరామశరణుల పలుకులకు అలుకమాని,కిలకిల నవ్వుతూ బాలకృష్ణుడు,'నీసాధన వందనీయమైనది. నీజపం సఫలమైనది.' అంటూ తన శ్యామలకోమల మూర్తిని కోదండరామునిగా,సీతాలక్ష్మణయుక్త శ్రీరామచంద్రునిగా సాక్షాత్కరించగానే గురుదేవుల శరీరం పరవశమొందెను. మాటలకతీతమైన ఆమధురానందంతో తబ్బిబ్బై పెద్దగా కేక వేయగా మెలకువ వచ్చెను! కల కరిగిపోయెను!

# సీతాదర్శనము.

మరియొకనాటి రాత్రి సీతామాత మెఱపుతీగవలె మెరుస్తూ,అనేక ఆభరణములు ధరించి గురుదేవుల స్వప్నమున గోచరించెను. వారు ఆనందాశ్చర్యములతో తదేకదృష్టిగా ఆమెవైపు చూచిరి. వెంటనే ఆమెచిన్న పసిపాపై వారి ఒడిలో పారాడెను!వారు ఆపాప నెత్తుకొని ముద్దాడ బోగా కలతొలగి మెలకువ వచ్చెను.





# మంత్రానుష్ఠానము-యోగసాధన

వాసుదాస స్వామివారు ఉపదేశించిన రామమంత్రమును, తమ పెత్తండ్రికుమారుడు ఉపదేశించిన ఆంజనేయమంత్రమును గురుదేవులు తీవ్రముగా జపించుచుండిరి. శ్రీస్వామి వారు మంత్రోపదేశము చేయుచు కొన్ని నియమములు చెప్పిరి. ఆనియమములన్నిటిని పాటించుచు శ్రద్ధాభక్తులతో, మంత్రసిద్ధిని పొందుటకు, రోజుకు 21,600 జపము నాలుగుగంటల కాలములో చేయుచుండిరి. (మానవుని శ్వాసలు 21,600). రోజుకు పదివేలు రామనామమును వ్రాయుచుండిరి. ఇట్లు రాత్రింబవళ్ళు శ్రీరామ చంద్రమూర్తి రూపమునే మనస్సున నిల్పుచు, మంచినిష్ఠ తోను, ఏకాగ్రతతోను

ధ్యానము చేయుచుండిరి. ఇంద్రియములను నిగ్రహించి సంసారబంధనము లందు మనస్సు పోనీయక దృఢ సంకల్పముతో సాధన చేయుచుండిరి. ఒక్కనిమిషమయినను వ్యర్థముగా పోనీయక రామనామము నిరంతరము జపించుచుండిరి.

గురుదేవులకు యోగసాధన చేయవలెనని సంకల్పము కల్గినది.స్వయముగానే యోగాభ్యాసము చేయసా. చిత్త శుద్ధితో పాటు శరీరశుద్ధి కూడ అత్యంతావశ్యకము. ఆహారము నందు మార్పుచేసిరి. ఉప్పు కారములను మానివేసిరి.

పాడిఆవును కొని ఆవుపాలతోనే భుజించెడివారు.జిహ్వాచాపల్యమును విడనాడిరి.చప్పని కూరలు, గోక్షీర ములతో ఆహారమును స్వీకరించిరి.ఈరీతిగా రెండు సంవత్సరములు గడచునప్పటికి వారి శరీరము తేజస్సు వెలు గొందసాగెను. శుద్ధ సాత్విక గుణముల ముద్దయై యోగ సంప్రాప్త ఆధ్యాత్మిక యోగములచే తులతూగుచుండిరి.మనస్సును శ్రీరామచంద్రమూర్తి

దివ్యమంగళ స్వరూపము నందు విలీనము చేసిరి.దినమంతయు పద్మాసనస్థులై జప, తప, ధ్యానాదులందు లీ నమగుచుండిరి.

# రామ నిష్ఠ

'అంతా రామమయం ఈజగమంతా రామమయం' అని రామదాసు కీర్తించెను.శ్రీరామ శరణ్ గురుదేవులు

నిరంతరము రామనామ జపము,రామనామ ప్రచారము చేయుట,రామనామముతో యేరిన బియ్యముతో వండిన అన్నమునే స్వీకరించుట,రామనామము ముద్రించిన వస్త్రమునే ధరించుట, రామనామముతో చేసిన మాలనే స్వీక రించుట ...ఇంతేకాక శిష్యులెవరైనా నూతన వస్త్రములు సమర్పింపవలెననిన రామనామము చేసిన తర్వాత మాత్రమే ఆవస్త్రములను స్వీకరించెడివారు. గురుదేవుల రోమరోమము రామనామముతో నిండియున్నది. వారు తమ హృదయము నందు రాముని ప్రతిష్ఠించుకొనిరి.రామనామమును జపించి,ధ్యానించి తామే రామ స్వరూపులైరి.

# దివ్యాను భూతులు - 1

శ్రీరామశరణ్ గురుదేవులు జపధ్యానములను అత్యంతకఠోర నియమనిష్ఠలతో చేయుచున్న సమయములో ఒకనాడు సీతాదేవి మెరుపుతీగవలె మెరయుచు సకలాభరణ భాషితయై దర్శనమిచ్చెను.

మరియొకమారు ఒకనాటి రాత్రి గురువుగారు నిద్రించుచుండగా శ్రీరామచంద్రమూర్తి వారిప్రక్కనే శయనించినట్లు తోచినది.నిద్రలో గురువుగారి కాలు రామచంద్రమూర్తికి తగిలినది.వెంటనే రామచంద్రమూర్తి లేచి 'నీయందు కల్గిన వాత్సల్యముచే నీప్రక్కన శయనించితిని.నాపైకాలు వేయుట న్యాయమా'అనిరి. గురుదేవులు తెల్లబోయిరి. మరలాస్వామి 'మిత్రమా, నీపాదము యొక్క స్పర్శ నాకు సంతోషము కల్గించును.నన్నేనమ్మి భజించు భక్తుల పాదాలు నాకెంతో ముదము కల్గించును.నీవెనువెంటనే చరించుచుందును'అని చెప్పి అంతర్ధానమైరి. భగవంతుని అపార భక్త వత్సలకు గురుదేవులకు ఆనందమును,ఆశ్చర్యమును కలిగెను.

# రామచంద్రమూర్తి చపాతీలు తినిపించుట.

ఒకసారి గురువుగారి ధర్మపత్ని ఊరికి వెళ్లినారు.గురువుగారే బడికి వెళ్లి వచ్చి వంట చేసికొనవలయును. మధ్యాహ్నము పన్నెండుగంటలైనది. గురుదేవులు నీరసముతో వండుకొనలేక కుర్చీలో పడుకొనిరి. ఇంతలో వీపు మీద చేయివేసి తట్టిలేపి 'నీరసముగా ఉన్నావు బల్లమీద చపాతీలు ఉన్నవి తిను', అను మాటలు వినిపించినవి. కన్నులు తెరచి చూడగా ఎదురుగా వేడివేడి చపాతీలున్నవి! వాటిపై వెన్నపూస ఉన్నది.గురుదేవులు ఆశ్చర్యపడిరి.కొంతసేపు తన్మయత్వము చెంది తరువాత బాహ్యస్థితికి వచ్చి ఆప్రసాదమును ఆరగించిరి.సాక్షాత్తు రామచంద్రమూర్తి గురుదేవులకు ఆహారము నొసగిరనిన మన గురుదేవులు సామాన్యులు కారు!!

# ఆంజనేయస్వామి నగలను తెచ్చియిచ్చుట

ఒకసారి గురుదేవుల ధర్మపత్ని శేషమాంబగారు స్నానము చేసి నీళ్లు తెచ్చుకొనుటకు చెరువుకు వెళ్లినారు. అంతకుముందే పెద్దవర్షము కురిసి ఆప్రాంతమంతయు బురదగా ఉన్నది.అమ్మగారి కాళ్ళకు కడియాలు , గొళ్లెపు గొలుసులు ఉన్నవి.బురద అయినందున వాటిని తీసి బురదకడిగి గట్టున ఉంచి స్నానముచేసి నీరుతీసుకొని నగలమూట మరచి పోయి యింటికి వచ్చిరి.రాత్రి ఏడుగంటలు దాటిన తర్వాత జ్ఞాపకమురాగా ఈసంగతి గురువుగారికి చెప్పిరి. బాగా చీకటిగా ఉంది,వర్షము పడుచున్నది.గురువుగారు రామకోటి వ్రాసుకొనుచుండిరి.'ఇప్పుడేమి చేయగలము వర్షము తగ్గిన తర్వాత చూతము',అనిరి.ఆరాత్రి పన్నెండు గంటల వరకు కూడ వర్షము పడుచూనే ఉన్నది.అది మండువా యిల్లు. మండువాలోనుండి అమ్మగారు చెరువు గట్టున వదిలి వచ్చిన కడియాలు,గొళ్లెపుగొలుసులు విసురుగా వచ్చి గురువుగారి పాదములముందు పడినవి.ఆశబ్దమునకు గురుదేవులు తలయెత్తి చూడగా నగలు కనిపించినవి. 'ఆంజనేయులు నీ నగలు తెచ్చినాడు తీసుకొ' మ్మని అమ్మగార్ని పిలిచిరి.

# ఆంజనేయస్వామి లీల - అమ్మగారి అనుభూతి

ఆరోజులలో గురుదేవులు రామకోటి తీవ్రముగా వ్రాసెదువారు. రోజుకు 16,000 వ్రాసిన రోజులు కలవు. పెద్ద పెద్ద డ్రాయింగు చార్టులమీద బొమ్మలు గీచి శ్రీరామ నామము తో వివిధ రంగులతో వ్రాయుచుండెడివారు. దూరము నుండి చూచిన అచ్చు పటములవలెకనపడుచుండెను.

ఒకనాటి రాత్రి ఒకపెద్ద ఆంజనేయపటమును వ్రాయుచుండిరి. అమ్మగారు నిద్రలేచి గురుదేవుల చెంతకు వచ్చి కూర్చుండిరి.

అమ్మగారు :మాయింట్లో యెప్పుడు చూచినను 30 రూపాయలకు తక్కువ ఉండవు.

గురువుగారు:మాయింట్లో నయితె ముప్పాతిక. (రామకోటి).

అమ్మగారు :(హేళనగా) మా యింట డబ్బు ఏవస్తువు నైనను కొనుక్కొనుటకు పనికి వచ్చును. మీరామకోటి దేనికి పనికి వస్తుంది?

(అప్పటి అమ్మగారి వయస్సు 17 లేక 18 యేండ్లు మాత్రమే)

అని అంటూ గురుదేవులు ఆంజనేయుని బొమ్మపై రామకోటి వ్రాయుచుండగా 'ఈ కోతి ముఖంలో ఏమున్నది?' అని ఆంజనేయుని మూతి మీద వ్రేలితో పొడిచెను. ఉన్నదంతయు ఆయనలోనేఉన్నదని గురుదేవులు బదులిచ్చిరి.

కొద్దిసేపటికి అమ్మగారు వాకిట్లోకివెళ్లిరి. అది నిశీధి సమయము. 'ఎవరో వచ్చి నాతల పగలగొట్టుచున్నాడు.' అని పెద్ద కేకవైచిరి. గురువుగారు లాంతరు తీసికొని వెళ్లి చూచిరి. 'నా జుట్టు కోయుచున్నాడు' అని తల పట్టుకొనెను. అచ్చట ఎవ్వరునూ లేరు. ఆంజనేయుని కోతిమూతి వాడని పొడుచుటచే వానికి కోపము వచ్చినది. తలపోటు అని ఆమె బాధపడుచుండిరి. గురుదేవులు అమ్మగార్ని దేవుని దగ్గరకు తీసికొని వెళ్లి మొక్కుకొనుమనిరి. 'నా ఈతల పోటు తగ్గితే మెడలోఉన్న గొలుసు యిస్తా'నని మ్రొక్కుకొనిరి. వెంటనేతలపోటు తగ్గినది. జడవిప్పి చూడగా ఒక కుచ్చువెండ్రుకలు కత్తిరింప బడి యుండెను.

క్రిందటి రాత్రి ఆంజనేయ స్వామికి కోపము వచ్చుటచే గురుదేవులుతమ యింట భజన యేర్పాటు చేసిరి. ఉదయము తొమ్మిదిగంటలకు అమ్మగారు తలంటిపోసుకొనుటకు రోటిలో కుంకుడుకాయలు కొట్టుకొనుచుండగా హనుమంతుడు ఐదేండ్ల బాలుని రూపమున వచ్చి ,'నాకు రాత్రి గొలుసునిచ్చెదనంటివి గదే' 'ఇటు తే' అని మెడలోని గొలుసును లాగికొనిఅంతర్ధానమయ్యెను.

అమ్మగారు దు:ఖముతో మెడలో గొలుసు పోయినదని బడికివెళ్లి గురువుగారికి చెప్పిరి. 'గొలుసు పోయిన చోటనే భద్రంగా ఉంటుందిలే, దిగులుపడకు'అని ఆమెను ఆశ్వాసించిరి. భజనలు జరిగి సరిగ్గా హారతి నిచ్చు

సమయమునకు పైన పెంకు కప్పులో నుండి కొంచెము బూజుఅంటుకొని గొలుసు క్రింద పడెను. ఈఉదంతమును అచట నున్న భజన బృందము చూచి నివ్వెర పోయిరి!

# దేవతార్చన పేటిక – నిధి

బుద్దాం గ్రామస్థులయిన పాలపర్తి రాఘవయ్య దంపతులను గురువు గారు తమ గృహమునకు ఆహ్వానించిరి. గురువుగారు మడికట్టుకొని దేవతార్చన పేటిక తీసి చూడగా ఆపెట్టెనిండుగా రూ75. కలవు. అంతకుముందు గురు దేవులు అమ్మగారితో 'మాయింట ముప్పాతిక'అనినారు కదా! వారి మాటలను సత్యము చేయుటకా అనినటుల అందు డెబ్బదిఅయిదు రూపాయలున్నవి. గురుదేవులు సంభ్రమాశ్చర్యాలతో అవాక్కయిరి. ఆపేటికను మూసి కొద్దిసేపు తరువాత మూతతీసి ఆనాణెములను లెక్కించగా 70 రూపాయలు కలవు. ఆధనముతో బాలకాండ గాథ తో వ్రాసిన శ్రీరామనామ రేఖనాత్మక చిత్రాలకు ఫ్రేములు కట్టించి శ్రీరామనామ క్షేత్రానికి సమర్పించినారు.

# శ్రీరాముడే స్వయముగా నివేదన నారగించుట

గురువుగారి మందిరంలో రామచంద్రమూర్తి స్వయంగా కొలువయిఉన్నట్లు అనుభూతి కలిగేది. ఏవేవో దివ్యశబ్దాలు వినిపించేవి.

గురుదేవులు బడిపిల్లలకు విద్య గరపుచున్నప్పుడు ఆగ్రామస్థులు బియ్యము,నెయ్యి యిచ్చుచుండేవారు. బియ్యమును ఇంటనున్న కొయ్యపీపాలో పోసెడివారు. బయ్యము పీపాకు అడుగున ఉండేవి. ఎంతమంది అతిధులు వచ్చినా బియ్యము అక్షయంగా ఉండేవి. శ్రీరామానుగ్రహమువలన అందులో బయ్యము పోసినా పోయకున్నా అక్షయమే!

విద్యార్థులు డబ్బుకు బదులుగా ఇచ్చిన నేతితో మధుర పదార్థములను తయారుచేసి స్వామికి నివేదించేవారు. సీతారాములు తమ నివేదనలను విశ్రాంతిగా ఆరగించాలని గురువుగారు,అమ్మగారు కోరుకొనేవారు. చేసిన పదార్థములను మందిరములో పెట్టి తలుపులు వేసి ఒకఅరగంట వేచి వుండెడివారు. తమ నివేదనలను ఆరగించవలెనని

సీతారాములను ఆర్తితో వేడుకొనెడివారు.తలుపులు తీసి చూడగా అన్నము కొంత స్వీకరించినట్లు గుర్తులు కనిపిం చేవి.పిండివంటలు చేసినవాటికంటె తక్కువగా ఉండెడివి.

ఒకసారి గురుదేవులు సమర్పించిన తాంబూలమును రామచంద్రమూర్తి ఆరగించినాడు! రామకోటి తో వ్రాసిన కోదండరామమూర్తి పెదవులకు తాంబూలము నమిలిన చిన్నెలు,తాంబూలపు తునకలతో ఎఱ్ఱగా కనిపించినవి!! ఈ దంపతులకు ఏదయినా వస్తువు అత్యవసరముగా కావలసి వున్నయెడల ఏపాత్రలోనో,రామసన్నిధిలోనో ఆవస్తు వు తప్పక లభించెడిది.

1932 వ సంవత్సరము శ్రీరామనవమి పర్వదినమున ఒకపాత్రను పరిశీలించినప్పుడు అయోధ్యలో శ్రీరామచంద్ర ఎనికి నివేదించిన వానిలో రెండు పెద్దలడ్లు ఆపాత్రలో కనిపించినవి!ఆ లడ్లను ముఖ్యమైన భక్తులకు పంచిపెట్టినారు.

ఒక పర్యాయము శ్రీరామచంద్రునికి గారెల నివేదన చేయవలెననుకొనినారు గురుదేవులు, అమ్మగారు. గారెలు వండుతు లెక్కించినారు పదునెనిమిది ఉన్నవి.మరల కొద్దిసేపు గారెలు వండినారు.మరల లెక్కింగా పదునెనిమిది గారెలున్నవి. మరల గారెల పిండి పూర్తిగా వండిన తరువాత మరల లెక్కించిరి.అద్భుతం!మరల పదునెనిమిది మాత్రమేఉన్నవి.

భక్తవత్సలుడు శ్రీరామచంద్రుడు ప్రత్యక్షముగా గారెలను ఆరగించి నాడనుటకు యింతకుమించి ఏ నిదర్శన ము కావలెను?వంట అంతయు అయిన తరువాత పదార్థములన్నిటితోపాటు గారెలను కూడ నివేదించినారు. మ ందిరము తలుపులు మూసి కొద్దినిమిషముల తరువాత తలుపులు తెరచిచూడగా అన్నములో గుంటపడినది! పదునెని మిది గారెలకు బదులుగా పదునారు ఉన్నవి!

అమ్మగారిని శ్రీరామచంద్రుడు ఆవహించి అనేకదినములు ఉండెడివాడు! పలువురికి భవిష్యత్తు చెప్పెడివాడు స్వామి.సమీపములోనున్న వారి జేబులలో ఎంత ధనమున్నదీ చెప్పెడివాడు.ఇది అందరికీ ఆశ్చర్యము కలిగించెడిది. అతిథిగా వచ్చిన ఒకరికి పాయసమువండమని స్వామి ఆవహించి ఆదేశించినాడు! పాత్రలను పరి శీలించిచూడగా ఒక పాత్రలో సగ్గుబియ్యం,పంచదార,యాలకులు,జీడిపప్పు కనుపించినవి!స్వామి స్వయముగా అను గ్రహించిన పదార్థములవి! వండిన పాయసమును స్వామికి నివేదించినారు.ఆ పాయసము ఒక అంగుళంమేర తగ్గివు న్నట్లు గమనించినారు. అందరి ఆశ్చర్యానికి హద్దులేక పోయినది.ఈ మహిమలను విని ఒకరు వచ్చినారు.వారికి బజ్జీ లుచేయమని స్వామి అమ్మగారిపై ఆవహించి ఆదేశించినాడు.ఒక పాత్రలో శనగపిండి,బంగాళదుంపలు కనిపించి నవి!ఆబంగాళదుంపలు ఆగ్రామము లో లభించేవి కావు.బజ్జీలు వండి శ్రీరామునికి నివేదించినారు.నివేదన తరువాత బజ్జీలు తగ్గివున్నవి!అమ్మగారినిఆవహించిన స్వామి తమవద్దకు వచ్చిన వారి ఆంతర్యములను కూడ చెప్పెడివాడు.ఇ దిచూచి ఓర్వలేని వారు పంతులు గారు గారడీ చేస్తున్నారని ప్రచారము చేయసాగినారు.శ్రీకృష్ణ పరమాత్మ దివ్యలీలల నే గారడీ అనినారన్న దీనికి ఆశ్చర్యమేమున్నది!

గురుదేవులు తాంబూర,చిడతలు చేతబట్టి భక్తి పారవశ్యములో  అనేక రాగాలలో  ఎంతో  భక్తితో, ఆర్తిగా సంకీర్తన చేసినారు.ఒకనాడు శ్రీరామచంద్రమూర్తి ప్రత్యక్షమై  'నీకీర్తనలకు నేను లొంగను' అని నారు. 'మరి దేనికి వశుడవవుతావు' అని అడుగగా 'నిర్మల ప్రేమకు వశుడవుతాను ' అని చెప్పి అంతర్ధానమయ్యెను! నాటినుండి గురుదేవులు కీర్తనలకు స్వస్తి చెప్పిరి.

# శ్రీసీతారామనామ సంకీర్తన సంఘం-శ్రీరామనామ క్షేత్రము

1926 లో శ్రీవాసుదాస స్వామి వారిచే శ్రీసీతారామ నామ సంకీర్తన సంఘము గుంటూరులో స్థాపించ బడినది.దీనికి రాగం ఆంజనేయులు గారు ముఖ్యులు.వారికి ఒక పెంకు ముక్క దొరికినది.దానిలో వీరికి రామచంద్ర మూర్తి దర్శనమొసంగెను.అప్పటి నుండి వారు రామనామమును ఆర్తితో జపించనారంభించిరి.

శ్రీసీతారామనామ సంకీర్తన సంఘములో  మన  గురుదేవులు  కూడ  ఒక  సభ్యుడు.  సంఘమునకు సీతారామ నామము ప్రాణాధారము.సంఘసభ్యులందరు గ్రామగ్రామమునకు వెళ్లి సంకీర్తనము చేయుచు నామప్రచారము చేయు చుండెడివారు.

శ్రీరామశరణ్ గురుదేవుల వలెనే రాగం ఆంజనేయులు గారి తండ్రి పిచ్చయ్య గారునూ రామకోటి వ్రాసెడువారు. పిచ్చయ్యగారు  గురుదేవులను  పిలిచి  'మనము వ్రాయుచున్న రామకోటికి ఏదైనా సమిష్టిగా పూజలు చేసికొన్నచో బాగుంటుంది.' అన్నారట.

భగవద్గీతలో  'మాసానాం  మార్గశీర్షోస్మి'  అన్నారు  శ్రీకృష్ణ  పరమాత్మ. మార్గశిరమాసంలో  పునర్వసు నక్షత్రము నాడు పూజలు చేసికొనిన బాగుంటుంది.' అని చెప్పిరట.ఆవిధముగా రామకోటి పూజలు,ఉత్సవములు ప్రారంభిపబడినవి.

తర్వాత శ్రీసీతారామనామ సంఘమునకు శాశ్వతమైన తావు నల్లచెరువు ప్రక్కనే  ఏర్పరచిన స్థలములో మందిర నిర్మాణము జరిగి నేడు యింతటి శ్రీరామనామ క్షేత్రముగా రూపొందినది.

# సాధనశాఖ

శ్రీరామనామ క్షేత్రము ఏర్పడినప్పుడే ఆధ్యాత్మిక సాధన నిచ్చుటకు శ్రీరామశరణ్ గురుదేవుల అధ్యక్షతన సాధనశాఖ ఏర్పడినది.శిష్యులకు భక్తులకు సాధనా తరగతులు పెట్టి వారికి సాధనకు కావలసిన సామగ్రి నిచ్చుటయే గాక సాధన చేయు విధానమును చెప్పి సాధన చేయించెడివారు.రెండుమాసముల కొకమారు సాధనశాఖ సమావేశములు జరిగెడివి.ఒకసమావేశములో గురుదేవులు 'అనుష్ఠానమునకు సంబంధించిన సాధన సామగ్రి అంతయు నావద్దకలదు.

నేను తండ్రి ని.మీరు (సాధకులు) పిల్లలు.తండ్రి ఆస్థిలో బిడ్డలకు భాగమున్నట్లే  ఈసాధన  సామగ్రి అనెడి ఆస్థిలో మీ అందరికి భాగముకలదు.నేను దేహము చాలించిన తరువాత మీరు కావలెననుకొన్నను చెప్పేవారు

లేరు. కనుక సాధనపై దృష్టియుంచి సాధనాపద్ధతిని తెలిసికొని సాధన చేసి తరించండి...ఇప్పుడు మనమున్నది వైకుంఠము (శ్రీరామ నామ క్షేత్రము) మన మధ్య రామచంద్రమూర్తి ఉన్నాడు.మీరు సాధన చేసి దర్శింపవచ్చును. ఎవరైనా రాముడు లేదని అనినచో నా వద్దకు తీసుకొనిరండి.రామచంద్రమూర్తి ఉనికిని నేను నిరూపించెదను.లేనిచో నాతల కోసికొందును.' అని విస్పష్టము గా ప్రకటించినారు!

# ఉపాధ్యాయ శిక్షణ

బాపట్ల వద్ద గల జమ్ముల పాలెంలోని సొంతబడి వల్ల ఆర్థిక పుష్టి లేనందున ప్రభుత్వ పాఠశాలలో చేరటానికి శిక్షణ కావలసి ఉన్నందున ఒంగోలు వెళ్లి ఉపాధ్యాయ శిక్షణా సంస్థలో చేరినారు.శిక్షణపొందేకాలము లో కూడ గురుదేవులు ప్రతిదినము సహస్రగాయత్రి,సహస్ర రామజపము,పంచాయతన దేవతార్చన చేసెడువారు. ప్రతి శనివారము వసతి గృహములో భజన చేసెడు వారు.వినాయకచవితి,కృష్ణజయంతి,నవరాత్రులు,ముక్కోటి ఏకాదశి, శ్రీరామనవమి మొదలగు పండుగలందు ప్రత్యేకముగా సంకీర్తనలు,హరికథలు,ఉపన్యాసములు జరిపేవారు.

పాఠశాల వార్షికోత్సవములో గురువుగారు తెలుగు, ఆంగ్లభాషలలో పద్యములను రచించి చదివిరి. ఆంగ్ల పద్యమును విన్నవారందరు అమితముగా ఆశ్చర్యపడిరి. ఆ ఆంగ్ల పద్యము !

1. God save our learned audience
   Are the men under his guidence
2. God bless the association of ours
   To have a growth with great powers.
3. This was born in nineteen nought nine
   Had a growth with pleasant sunshine
4. Now having twenty one years
   Hath delivered here good teachers.
5. It's our luck to have as president
   Having he with a good talent.
6. Teachers,students do all him praise
   For his kind heart our thanks rise.
7. Though I know not the metre well
   My desire to write this was fall
8. Blunders in this will be my shame
   While correct its my 'teachers fame'

# మానవసేవయే మాధవసేవ

శ్రీరామశరణ్ గురుదేవులు ఒంగోలులో ఉపాధ్యాయశిక్షణ పొందుచున్న రోజులలో జరిగిన సంఘటన:

అది వేసవికాలము.వడగాలులు వీచుచుండెను . చీమకుర్తి రోడ్డున 90 ఏండ్ల ఒక హరిజన వృద్ధుడు ,70 ఏండ్ల అతని కుమార్తె ప్రయాణము చేయుచుండగా ఆవృద్ధునికి విరోచనాలు,నీరసముతో రోడ్డు మీద పడిపోయినాడు. ఇదివిని గురువుగారు ముగ్గురు స్నేహితులతో అచటికి వెళ్లి తన పై ఖద్దరు పంచెలో ఆవృద్ధుని కూర్చుండబెట్టుకొని అద్దంకి బస్టాండు వద్దనున్న సత్రమునకు మోసికొని వెళ్లిరి. ఆ శాలువా వారికే యిచ్చివేసిరి. వసతి గృహమునకు వచ్చి తనపేర ఖర్చు వ్రాయించి నలుగురు మనుష్యులకు సరిపడు అన్నమును పంపి ఆరాత్రికి మరునాటి ఉదయమునకు వాడుకొమ్మనిరి! మానవ సేవాధర్మమును ఈతీరున ఆచరణలో చేసిచూపిరి.

మరియెకసారి బాపట్ల నుండి పొన్నూరుకు వెళ్లుచున్న బస్సు రాత్రి ఎనిమిదిగంటలకు మధ్యలో ఆగిపోయినది. తెల్లవారిన గాని ఆబస్సు పొన్నూరుకు బయలుదేరదు.ఆబస్సులో ఇరువది మంది ప్రయాణీకులు ఉన్నారు. వారికి తినడానికి, త్రాగడానికి లేక బాధపడుచుండిరి. ఈవిషయము తెలిసి గురుదేవులు ఏబది గోధుమరొట్టెలు చేయించి వాటిని వెదురు గంపలో పెట్టుకొని కడవనిండా మంచినీరు తీసికొని ఆప్రయణీకుల వద్దకు వెళ్లి రొట్టెలను మంచినీటిని వారికి యిచ్చిరి.వాటినారగించి గురుదేవులనెంతగానో ప్రశంసించి ఆప్రయాణీకులు తమ ధన్యవాదములను తెలుపుకొనిరి.

(శ్రీ బెజవాడ రామనారాయణ్శరణ్ సౌజన్యముతో)

# బుద్దాం - పవనకుమారుని ప్రతిష్ఠ

ఉపాధ్యాయ శిక్షణానంతరము కొందరు గ్రామపెద్దల కోరిక మేరకు గురుదేవులు బుద్దాం వచ్చి ఉపాధ్యాయవృత్తిని చేపట్టిరి.బుద్దాం వారి నివాస స్థానమయ్యెను.అది నాస్తిక గ్రామము.

గురుదేవులు ఆధ్యాత్మిక ప్రవచనములు చేయుటకు గ్రామాంతరము వెళ్లి తిరిగి వచ్చేటప్పటికి బుద్దాంలో కలరా సోకగా గ్రామస్తులు అందరు ఊరిబయట పాకాలు వేసికొని ఉండిరి . గురువుగారు కలతచెంది ఒకరిద్దరిని వెంట బెట్టుకొని ఆంజనేయస్వామి పటము తీసికొని రామనామము చేసికొనుచు గ్రామమంతయు తిరిగిరి.కలరా వ్యాధి మాయమైనది!

# పవనకుమారుని ప్రతిష్ట -

గురుదేవులు బుద్దాంలో ఆంజనేయస్వామి వారి విగ్రహప్రతిష్టచేయ సంకల్పించిరి.తెనాలి లో విగ్రహమును తయారుచేయించి ఆవిగ్రహమును తీసికొని తిరుగుప్రయాణమైరి . అప్పికట్ల వద్ద బండి దిగి చేలకు అడ్డముగా వెళ్లినచో దగ్గరట. గురుదేవులు విగ్రహమును భుజముపై నుంచుకొని నడచి వచ్చుచున్న సమయములో తుంగభద్ర కాలువ దాటవలసి వచ్చినది. అది రాత్రి 11-12 గంటల సమయము. కాలువలోతు తెలియదు.భుజము నొప్పిగా ఉన్నందున విగ్రహమును ప్రక్కన నుంచి కాలువ గట్టున కూర్చుండిరి.ఇంతలో ఒక ఆసామి పంచె ఎగగట్టి తలపాగా ధరించియున్నాడు. గురువుగారిని చూచి 'ఎవరది?' అనినాడు.

గురువుగారు 'బుద్దాం నరసపంతులును ?' బదులు పలికిరి.

'ఇప్పుడు యిక్కడ ఉంటిరేమి?' అని అడుగగా గురుదేవులు విషయమంతయు చెప్పిరి.ఆ ఆసామి ,'కాలువ పంచె మడుపు లోతేలే.నేను దాటిస్తాను' అని విగ్రహమును తీసికొని గురుదేవులను కాలువ దాటించిరి.ఇరువురు అనేకవిషయములు మాట్లాడుకుంటూ బుద్దాం పరిసరముల వరకు వచ్చిరి.ఆ ఆసామి విగ్రహమును గురుదేవులకిచ్చి ఆంజనేయస్వామిగా మారెను! ఎగగట్టిన పంచె దట్టిగాను, తలపాగా కిరీటముగను మారెను! స్వామి 'భయపడుతున్నావా?' అని గురువుగారినడిగిరి . అంతకు మునుపు ఒక పర్యాయము చూచి యున్నందున 'భయములేదు' అనిరి.'ఈ విగ్రహమును వెంటనే ప్రతిష్టచేయవద్దు.నీవు మంత్రజపము చేసి దీనికి ధారపోయుము. ఇది మొదలుగా నీవు ఎప్పుడు పిలిచిన అప్పుడు పలుకుతాను. నీవు చేసే పనులన్నిటిని నెరవేరుస్తాను. నీపలుకునకు అసత్యదోషమంటనీయను.'అని పలికి విగ్రహప్రతిష్టకు ముహూర్తము కూడ చెప్పి అంతర్హితుడైనాడు. గురుదేవులు స్వామి చెప్పినట్లేచేసి విగ్రహమును ప్రతిష్ట చేసినారు!

బాపట్ల నుండి సిమెంటు బస్తాను గురువుగారే స్వయముగా మోసుకొని తెచ్చిరి.నిర్మాణమునకు కావలసిన రాయిని అమ్మగారు తెచ్చిరి. విగ్రహప్రతిష్ట జరుగవలసిన అర్ధరాత్రి సమయమున ఒక వృద్దుడు టాపీని తెచ్చి 'అరుగు నేను కట్టిపెడతాను' అని పలికి అరుగును నిర్మించెను. తెల్లవారు నప్పటికి ఆంజనేయవిగ్రహప్రతిష్ట జరిగినది!

ఊరి పెద్దలు కొందరు ఆగ్రహించి విగ్రహమును తొలగించమని బెదిరించిరి.గురుదేవులు చలింపక 'విగ్రహప్రతిష్ట చేసినది తొలగించుటకు కాదు, మీరే తీసివేయండి!' అని చెప్పిరి.కాని విగ్రహమును తొలగించుటకు ఎవ్వరికి ధైర్యము చాలలేదు.బుద్దాంలో ప్రతిష్టించిన ఆంజనేయస్వామికి 'పవనకుమార్' అని పేరు పెట్టిరి.

# పవనకుమారుని మహిమలు

బుద్దాంలో గురుదేవులు ప్రతిష్టించిన పవనకుమారుడు తాను వారికి బాసచేసిన ప్రకారము భక్తుల,ఆర్తుల కోరికలను తీర్చుచున్నాడు.పవనకుమారుని మహిమలు రెంటిని గురుదేవులే స్వయముగా చెప్పినారు.

ఒకసారి బుద్దాంలో ఇండ్లు తగలబడుచున్నవి.కొందరు పరుగు పరుగున వచ్చి గురుదేవులకు మొరపెట్టుకొనిరి. గురుదేవులు పవనకుమారునిపై నీటిని పోయమనిరి.వారట్లేచేసినారు.మంటలు ఆరిపోయినవి!

మరి ఒకసారి ఒకరింటిలో గొలుసు నెవరో దొంగిలించిరి.ఎంతవిచారించినను ఆచూకీతెలియలేదు.వారు గురుదేవుల వద్దకు వచ్చి విన్నవించుకొనిరి. పవనకుమారునికి చెప్పుకొమ్మనిరి. మరునాడు ఉదయము పోయిన నగ వారింటి ముందు పడి యున్నది!

పవనకుమారుని మహిమలు అసంఖ్యాకములు.ఎవరే కోరిక కోరుకొనిన ఆకోరిక తీరుచున్నది.

తొలుత ఒక అరుగు మీద ప్రతిష్టింపబడిన పవనకుమారునికి, ఆతర్వాత మందిరము నిర్మించిరి. స్వామివారికి వివిధ అర్చనలు,సేవలు,విశేష కార్యక్రమములు జరుగుచున్నవి.

'దేహము చాలించిన తరువాత నేను పవనకుమారుని ప్రక్కనే ఉందును.పవనకుమారునికి నాకు భేదము లేదు.నేను లేక పోయినప్పటికి పవనకుమారుని పాదాలచెంత విభూతి ని ఉంచి మీకోర్కెలు చెప్పుకొని ఆవిభూతిని ధరించిన వాని కోర్కెలు నెరవేరును.పిలిచిన వారికి పలుకుతూ, కావలసిన పనులన్నియు చేయుచుందును,' అని ఒక సందర్భములో గురువుగారు చెప్పినారు.

# తనిఖీ చేయుటకు వచ్చి శిష్యుడైన వైనము.

గురువు గారు సరిగా పాఠశాలకు హాజరగుట లేదని వారిపై అధికారులకు ఫిర్యాదు చేసిరి.అధికారులు ఎన్ని సార్లు తనిఖీకి వచ్చినను రికార్డు అంతయు సరిగ్గా ఉండేది.ఏలోపము కనబడేది కాదు.

ఒకసారి పాఠశాల తనిఖీ అధికారి గురుదేవుల యింటికి వచ్చిరి.తలుపులు వేసివున్నవి.గురుదేవులు సంకీర్తనము చేయుచుండిరి. బాహ్యస్థితిలో లేరు. ఆ అధికారి ఎలాగో లోపలికి వచ్చి చూడగా పచ్చని పట్టు వస్త్రము ధరించి, మెడలో తులసిమాల,చేతిలో తంబురా,కాళ్ళకు గజ్జెలు కట్టి రామచంద్రమూర్తి ఎదురుగా సంకీర్తన చేస్తూ,నృత్యము

చేస్తున్న గురువుగారు కనిపించిరి!వచ్చిన పని మరచిపోయి, గురువేవుల పాదములకు నమస్కరించిరి. తరువాత ఆ అధికారి గురుదేవుల శిష్యులైరి.

# మంత్ర పురశ్చరణలు - గురుస్థాన స్వీకారము

హౌశ్రీరామశరణ్ గురుదేవులు మంత్రసిద్ధిని పొందిన పిమ్మట భక్తులు కొందరు తమకు మంత్రోపదేశము గురుదేవులే చేయవలెనని కోరుకొనిరి.కాని గురుదేవులు తమకా అర్హత లేదని మంత్రోపదేశము చేయుటకు అంగీ కరించలేదు.గురుదేవుల పట్ల అపరిమిత భక్తి విశ్వాసములు కలవారు వారే ఉపదేశము చేయవలెనని పట్టుపట్టిరి. చివరకు గురుదేవులు వారి గురువుగారి అనుమతి పొంది మంత్రోపదేశము చేయుటకు అంగీకరించిరి.

గురుదేవులు అనేక పుణ్యక్షేత్రములను దర్శించిరి.వారణాసి,ప్రయాగ,బృందావణము,హరిద్వారము, ఋషీకేశము మొదలగు పుణ్యక్షేత్రములలో మంత్రపురశ్చరణలను చేసిరి. చాలామంది సిద్ధపురుషులు గురుదేవులకు దర్శనమిచ్చిరి.

ప్రయాగ త్రివేణీ సంగమము వద్ద గురుదేవులు పురశ్చరణము చేయుచుండగా 'అంతర్ధానమహర్షి' దర్శనమిచ్చి మంత్రసిద్ధి అయినదని పలికిరి.(అంతర్ధాన మహర్షి దర్శనమిచ్చి మాట్లాడుతూనే అంతర్ధాన మయ్యేదు వారట)

వారణాశిలో పురశ్చరణ చేయుచున్నపుడు కాశీవిశ్వనాధుడు మేడమెట్లపై నుండి దిగుచున్నట్లు దర్శనమిచ్చి 'నీవు చేయుచున్నది రామనామము నేను చేయునదీ రామనామమే. నీవు నామప్రచారము బాగుగా చేయుము' అని ఆశీర్వదించి అంతర్హితు డయ్యెనట!గురుదేవులు 26 సార్లు వారణాశిని దర్శించినారట!

ప్రయాగలో గురుదేవులు మాఘమాసములో పురశ్చరణ చేసిరి.చలిచాలా తీవ్రముగా ఉన్నది.గురువుగారు అచట నున్న ఒక చెట్టు చుట్టూవేగముగా పరుగెత్తి మరలా వచ్చి కూర్చుని జపము చేసెడు వారట! జపము చేసు కుంటూ సమాధి స్థితికి చేరినపుడు ఆహారము చేసికొనుటకు వీలు లేకుండెడిది. అప్పుడు ఆంజనేయస్వామి వారు 'స్టౌ' వెలిగించి రొట్టెలు తయారు చేసి గురుదేవులను సమాధి స్థితి నుండి లేపి ఆహారము పెట్టుచుండెడి వారు!!

బృందావనములో గురుదేవులకు శ్రీకృష్ణరాసలీలలను చూడవలెనని కుతూహలము కలిగినది .ఒకనాటి రాత్రి బృందావనములో రాసలీలలు జరిగే ప్రదేశమునకు వచ్చి గోడదూకి ఒకమూల నక్కి కూర్చుండినారు.అర్ధరాత్రి యందు రాధాకృష్ణులు,గోపికలు పైనుండి క్రిందికి దిగినారు! ఒక గోపిక 'నరవాసన వచ్చుచున్నది ' అనుట గురు

వుగారికి వినిపించినది. అంత కృష్ణభగవానుడు 'ఆయనమనవాడే. మన కార్యక్రమము నిర్విఘ్నముగా సాగింతము' అన్నారు. ఆ రాసక్రీడలను మన గురుదేవులు మైమరచి తిలకించుచున్నంతలోనే ఆలీల అంతర్ధానమైనదట! ఆహా! మన గురుదేవులు ఎంతటి మహోన్నతులో గదా! వారి మహత్త్వమును, శక్తి సామర్థ్యములను తెలిసికొనుటన్న ఆ కసము మొదలు, తుద తెలిసికొన ప్రయత్నించినట్లు. అట్టి మహనీయుని గురువుగా పొందుట గతజన్మల పుణ్యపరి పాక విశేషము తప్పవేరొకటి కాదు.

మంత్ర పురశ్చరణములు చేసిన తదుపరి గురుదేవులు బుద్ధాం తిరిగివచ్చి గురుస్థానము నదిష్ఠించిరి. అప్ప టి నుండి కోరినవారికి మంత్రోపదేశము చేయుచుండిరి. గురుదేవులకు సుమారు పదివేల మంది శిష్యులు కలరు. వీరు వర్గ, కుల, మత విచక్షణ చూపక కోరిన వారందరికి మంత్రమునుపదేశించి సర్వసమత్వమును చూపిరి.

# గురుదేవులు - సత్యసాయి బాబా సన్నిది.

తొలుతొల్త సత్యసాయి బాబా మహిమల పట్ల గురియున్నట్లు తోచదు. 1964 లో సత్యసాయిబాబా పిలుపు నందుకొని కొంత సంశయముతోనే పుట్టపర్తికి వెళ్లిరి. సత్యసాయిబాబా గారిలో గురుదేవులకు కోదండరాముడు దర్శనమిచ్చెను. అప్పటి నుండి బాబాగారిని అవతారపురుషునిగా భావించిరి. గురుదేవులు పుట్టపర్తిలో రెండు మాస ములు రామాయణముపై మహోపన్యాసము లిచ్చినారు. బ్రాహ్మణ వటువులకు గురుదేవులు గాయత్రి మంత్రోపదేశములు చేసిరి. బాబా గారు గురుదేవులకు ఒక లక్ష్మీరూపును సృష్టించియిచ్చిన నాటినుండి వారి ఆర్థిక యిబ్బందులు తొలగిపోయినవి. ఒక ఉంగరమును కూడ సృష్టించి యిచ్చినారు. ఆ ఉంగరము నందు వారికి బాబా గారు దర్శన మిచ్చేవారు!

గుంటూరులో 'శాంతిసుధ' ప్రారంభమునకు సత్యసాయిబాబా వచ్చినప్పుడు గురువుగారు కూడా వచ్చిరి. గురువుగారిని చూడగనే బాబాగారు వారిచేయి పట్టుకొని లోపలికి తీసికొని వెళ్లిరి. బాబాగారు గురువుగారిని నామప్రచారము బాగుగా చేయమనిరి . గురుదేవులు 'స్వామీ! నాకు చూపు తగ్గినది. మోకాళ్ల నొప్పులు. పిలచిన వారి వద్దకు వెళ్లి ఆయా ఊళ్లలో నామమహిమను గూర్చి ప్రచారము చేయుచునే ఉంటిని' అనిరి. బాబాగారు 'నీకు మూడవనేత్రమున్నది. నీకు మోకాళ్లు నొప్పులు ఏమిటి?.... పిలిచిన వానివద్దకేకాక పలవని వారి వద్దకు కూడ వెళ్లి నామ ప్రచారము, సేవాధర్మములు వారికి బోధింపుము...' అని విభూతి సృష్టించి గురుదేవుల గొంతుకు రాచి నొసట బెట్టిరి. అది మొదలుగా గురువుగారు నామప్రచారమును క్షణము తీరిక లేక చే యుచుండిరి.

# శిష్యవాత్సల్యము

సత్యసాయిబాబా వారు గురువుగారిని పుట్టపర్తిలోనే ఉండమనియు, ప్రశాంతినిలయములో అన్ని యేర్పాట్లు చేసి, సంసారభారమంతయు తానే చూచెదనని అన్నప్పుడు గురువుగారి జవాబు ఇలావుంది. 'నా శిష్యులు చాలా దూరములో ఉన్నారు. వారిలో పేదవారు కూడ ఉన్నారు. వారుయింత దూరముప్రమాణించి రాలేరు.నేను వారికి అందుబాటులో ఉండాలి.' అని.

మరియయెక సారి బాబాగారు గురుదేవులను ఏమికావాలో కోరుకొనుమని నప్పుడు, వారు 'నా శిష్యులను అందరిని అనుగ్రహించి వారికి మోక్షము ప్రసాదించండి' అని కోరిరి.గురుదేవుల శిష్యవాత్సల్యమునకు బాబాగారు అమితానందము పొందిరి.

శ్రీశ్రీ శ్రీగణపతి సచ్చిదానంద స్వామి వారి ఆహ్వానము మేరకు వారి ఆశ్రమములో ధార్మికోపన్యాసము లిచ్చుటకు గురుదేవులు మైసూరు వెళ్లిరి. అచట వారికి మూత్రకోశ సంబంధమైన వ్యాధి వచ్చినది.చిట్కావైద్యములెన్ని చేసినా వ్యాధి నయము కాలేదు.శస్త్రచికిత్స చేయవలెనని వైద్యులు చెప్పిరి. 'నేను నా ప్రాంతమునకు వెళ్లి చికిత్స చేయించుకొనెదను.నన్ను చూడాలని నాశిష్యులకు,అభిమానులకు ఉంటుంది. వారు ఇంతదూరము రాలేరు.' అని శస్త్రచికిత్సకు అంగీకరించక గుంటూరు వచ్చిన తర్వాత ప్రభుత్వ ఆసుపత్రిలో శస్త్రచికిత్స చేయించుకొనిరి. ఆ సందర్భములో వైద్యులు చేసిన రక్తపరీక్షలో 70 సంవత్సరములు వయస్సు పైబడి వయస్సు ఉన్న గురుదేవుల రక్తము 18 సంవత్సరముల వయస్సు గలవారి రక్తము మాదిరిగా ఉన్నట్లు చూచి వైద్యులు ఆశ్చర్యపడిరి. శస్త్రచికిత్స తరువాత గురుదేవులు శ్రీరామనామ క్షేత్రములో మూడునెలలు ఉండినారు. గురుదేవులకు స్వస్థత చేకూరుటకు వారి శిష్యులు జపములు, అర్చనలు, భజనలు చేసి భగవంతుని వేడుకొనిరి.గురుదేవులు కోలుకొనిరి.వారి దర్శనార్ధము చాలామంది శిష్యులు,భక్తులు వచ్చుచుండెడివారు.

ఒకనాడు కొందరు శిష్యులతో "నాకు పై నుండి పిలుపువచ్చినది. నేను వారికీవిధముగా చెప్పినాను. నావద్ద మంత్రము తీసికొనుటకు యింకను కొద్దిమంది మిగిలి ఉన్నారు. నామప్రచారము కూడ యింకా మిగిలి వున్నది. కావున కొద్దికాలము జీవించి యుండవలయును.వచ్చిన వారు 'తథాస్తు' అని మరలిపోయిరి. నాకు మరలా 80-90 సంవత్సరముల మధ్య పిలుపు రావచ్చును. అది తప్పించవలెనన్న గృహస్థాశ్రమములో ఉండకూడదు. సన్యాసాశ్రమము స్వీకరించవలెను.లేకపోతే 88-90 సంవత్సరముల మధ్య ఈ దేహమును విడిచి వెళ్లవలసి ఉంటుంది." అని చెప్పినారు.

# కోరిక రామకోటి - తీర్ధమహిమ

కోరిన కోర్కెలు తీర్చుకొనుటకు అనేకమంది గురువుగారికి విన్నవించుకొనగా వారిచేత గురుదేవులు మిక్కిలి నియమనిష్ఠలతో,శ్రద్ధాభక్తులతో 'కోరికరామకోటి' వ్రాయించెడివారు.విశ్వాసము,నిష్ఠలతో వ్రాసిన వారికి వారి కోరికలు – సంతానహీనులకు సంతానము,అవివాహితులకు వివాహము,వ్యాధిగ్రస్తులకు ఉపశమనము కలుగుచుండెడిది.

గురుదేవులు మన ఎదుటనే మనము తీసికొని వెళ్లిన నీటిలో కుడిచేతి మధ్యవేలు,అనామికలను రెండు మూడు క్షణముల కాలము ఉంచి మంత్రించేవారు .ఆ తీర్ధము సంవత్సర పర్యంతము చెడిపోక గంగా తీర్ధము వలె

ఉండెడిది! గురుదేవులు మంత్రించిన ఆ తీర్ధము తో చాలా మందికి కాన్సర్ వంటి మొండి వ్యాధులు,క్షుద్రశక్తులు ఆవహించిన వారికి తగ్గిపోయి స్వస్థత పొందినారు !.

# ఆదర్శ గృహస్థాశ్రమ ధర్మ నిర్వహణము

శ్రీరామశరణ్ గురుదేవులకు యిరువురు సంతానము.ఒక కుమారుడు,కుమార్తె.మొదటినుండియు గురువు గారికి సంసారతాపత్రయము లేదు. గృహస్థాశ్రమములో నున్నను తామరాకు మీదనీటి బొట్టుమాదిరి, చింతగుల్ల మాదిరి గృహవిషయములపట్ల అంటీ అంటనట్లు మెలిగేవారు. ఇంటి బాధ్యతలను అమ్మగారే నిర్వహించేవారు.

శిష్యులు. భక్తులు యిచ్చిన ద్రవ్యమును ఇంటి ఖర్చులకు వినియోగించేవారుకాదు. ఆ ధనమును దేవాలయముల, మందిరముల ని ర్మాణములకు గాని లేక యితర ఆధ్యాత్మిక సంబంధిత కార్యక్రమములకు గాని విరాళముల రూపమున యిచ్చెడివారు.గురుదేవులు తాము స్వయముగ ఆధ్యాత్మిక గ్రంధములను రచించి,వాటిని అచ్చువేయించి వాటిపైవచ్చు ఆదాయమును యింటిఖర్చులకు ఉపయోగించేవారు.భాగవత కథలను అచ్చువేయించుటకు తమకున్న పొలమునే అమ్ముకొనిరి!

ప్రతి దినము సుమారు పదిమంది భక్తులు,శిష్యులు,అభిమానులు వారి దర్శనార్ధము వచ్చెడివారు. వచ్చి వారందరిని గురుదేవులు ఆప్యాయతతో పలకరించి వారికష్టములనువిని వారివారి కోర్కెలు తీర్చుటకు తమయెక్క దివ్య ఆశీర్వనుగ్రహములను వర్షించుటయేగాక అతిధులకు తమప్రేమ వాత్సల్యములను రంగరించి భోజనమును గూడ పెట్టించేవారు.గురుదేవుల ఆతిథ్యమును ఎవ్వరును,ఎన్నటికి మరువజాలరు.

గురుదేవులు తాము నాలుగు కుటుంబముల భారమును వహించవలసి వచ్చినట్లు ఒకానొక సందర్భములో చెప్పినారు. వారు తమ సంతానమునేకాక, తమ మనుమలు, మనుమరాండ్రను సైతము ఎంతో

ప్రేమతో పెంచి, పెద్దచేసి వారి యోగక్షేమములను తామేచూచిరి. గురుదేవులు తులసీ రామాయణమును పలుమారులు ప్రవచనమును చేసిరి. నిరంతరము నామప్రచారము నిమిత్తము సంచారముచేయుచు, దివ్యోపన్యాసముల నిచ్చేవారు. వాటి మూలముగ లభ్యమైన ధనముతో సంసారపోషణ చేసేవారు. ఎంత కష్టమునైనను 'క్షమయాధరిత్రి' అనినట్లు అంతటి ఓర్పుతో భరించెడివారు.

# స్థిత ప్రజ్ఞత్వము

భగవద్గీతలో శ్రీకృష్ణ భగవానుడు నుడివిడినట్లు 'శీతోష్ణ,సుఖ,దు:ఖాదు లందు చలింపక ఎవరు సంయమనము పాటింతురోవారిని స్థితప్రజ్ఞులని అందురు.

సుఖము కల్గినపుడు ఆనందముతో పొంగిపోవుట కష్టములు కలిగినపుడు దు:ఖము తో కృంగిపోవుట, సంపద కల్గినపుడు తనప్రయోజకత్వము వలననే గర్వముతో మదించుట, దరిద్రబాధ కలిగినపుడు భగవంతుని నిందించుట యివి యన్నియు మానవనైజము. కానిమన గురుదేవులు ఎంత కష్టము కల్గినను నిర్లిప్తులుగను. విరాగులుగనుండెడివారు.

గురుదేవులు తమ కుమారుడు స్వర్గస్థుడయినపుడు ఊరియందులేరు. విగ్రహప్రతిష్ఠ కొరకు గ్రామాంతరము వెళ్లిరి. వార్త తెలియగనే తమకు సంబంధించిన విషయము కానట్లు ముభావముగా నుండి అమ్మగారితో 'వెంటనే బుద్దాం బయలుదేరు' మనిరి. అక్కడి భక్తులు 'టాక్సీలో పంపుతాము' అంటే 'ముందుగా వెళ్లి చేసేదేముంది' అని బస్సులోనే ప్రయాణము చేసి బుద్దాం చేరిరి. గురుదేవులు ఎంతటి సంయమన శక్తి కలవారో దీనివలన మనకు తెలియుచున్నది.

గురుదేవుల ధర్మపత్ని శేషమాంబ గారు హఠాత్తుగా దేహముచాలించినారు. అమ్మగారు తాను పసుపు కుంకుమలతో పోవలేనని గురుదేవులను కోరినారట. అట్లాగే ఆమెకోరిక తీర్చినారు. అమ్మగారు దేహము చాలించినపుడు కూడ గురుదేవులు ఊరియందులేరు. నామప్రచారము నిమిత్తము తణుకులో ఉండిరి. ఒక శిష్యురాలితో తమ సమీపస్థులను గూర్చిన దుర్వార్త వినవలసి వస్తుందని చెప్పినారట! ప్రయాణమును వాయిదా వేసికొమ్మని ఎంతబ్రతిమిలాడినను వినక నామ ప్రచారము నిమిత్తము వెళ్లిరి. అమ్మగారు కాలం చేసినారను వార్తనువిని బుద్దాం చేరిరి. అప్పటికే శిష్యులు చాలామంది వచ్చిఉండిరి. గురువుగారికి ఈవృద్ధాప్యములో ఎంతో కష్టము సంభవించినదని అందరు బాధపడిరి. గురుదేవులు వరండాలో కూర్చుని శిష్యులతో ఏవేవో కబుర్లు చెప్పుచుండిరి! కాని అమ్మగారి భౌతికదేహము చెంతకురాలేదు. 'ఏమి జబ్బు చేసినదని గాని ఎప్పుడు గతించిరని గాని అడుగలేదు. కొందరు శిష్యులు 'అమ్మగారి దేహము వద్దకురమ్మని పిలిచి, ఆమెఆత్మకు తృప్తిని శాంతిని కలుగజేయ'మని వేడిరి. గురుదేవులు ' తాము కూర్చున్న కుర్చీని చూపించుచు ఈచెక్కకు ఆకట్టెకు తేడా ఏమిటో చెప్పండి', అని నవ్విరి. గురుదేవుల నిబ్బరము అలాంటిది!

గురుదేవులకు శిష్యులు 'సహస్రచంద్ర దర్శనము' అను ఉత్సవమును జరిపి తులాభారము చేసిరి. ఆసందర్భమున వచ్చిన 16,000 రూపాయలను దోసిళ్లతో అప్పటికప్పుడే అందరికీ పంచిపెట్టిరి!

ఇంతటి స్థిత ప్రజ్ఞత్వము ఎందరికుండును?

# భక్తవత్సలత

రైలుగాని బస్సుగాని సౌకర్యములేని లాంచిలో ప్రయాణించిన తరువాత రెండు లేక మూడు మైళ్లునడచిన గాని చేరుకోలేని గ్రామమది.ఆగ్రామములోని కొందరు భక్తులు గురువుగారిని ఆధ్యాత్మికోపన్యాసము లివ్వవలసినదిగా కోరిరి. రోహిణి కార్తె మిట్టమధ్యాహ్నము పన్నెండు గంటలకు గురుదేవులు లాంచి దిగి తనకొరకు ఎవరైనా వచ్చినారేమోనని చూడగా ఎవ్వరు కనిపించలేదు.గురువుగారి పాదములకు చెప్పులు కూడలేవు.చూడగా ఒక తాటిఆకు కనిపించినది. దానిని తీసికొని దానిపై నిలబడి భుజమున ఉన్న కండువాను నేలపైపరచి, ఆకుపైనుండి కండువాపైకి, కండువాపై నుండి ఆకుమీదకు నడుస్తూ ఎలాగో గమ్యము చేరిరి.తీరా ఆయింట్లో ఎ వ్వరూలేరు అశుచిగాఉన్న ఆడమనిషి తప్ప. గురుదేవులను ఆమె 'స్నానముచేసి భోజనము వండుకొనుమని' వేడు కొనినది. బాగుగా అలసిఉన్న గురువుగారికి స్వయంపాకము చేసికొను ఓపికలేక కూర్చుండిరి.కాళ్లు బాగావాచి ఉన్నవి.అరికాళ్లు బొబ్బలెక్కి రక్తసిక్తమయినవి. గురుదేవుల ఈస్థితిని చూచి ఆయిల్లాలు కన్నీరు పెట్టుకొన్నది.కొంత సేపటికి మజ్జిగ స్వీకరించి బయలుదేరినారు. ఆమె గురువు గారిని పాదరక్షలు ధరించి వెళ్లమని కోరినది. 'అమ్మా! నేను చెప్పులు తొడగనని బాసచేసికొనినాను.ఇప్పుడు ధరిస్తేమాటతప్పినట్లు గదా'.అని ఆ ఉదంతమునిట్లు చెప్పినారు.

'ఒకసారి బస్సులో ప్రయాణించేటప్పుడు చూడక ఒకని కాలు త్రొక్కినాను.అతనికి బాధకలిగి, 'ఏమయ్యానీకు కళ్లు లేవా?' అని విసుగుకొనినాడు.అప్పటినుండి చెప్పులు ధరించడం మానివేశాను' అని.

ఆగృహిణి 'స్వామీ,ఇవి తోలు చెప్పులుకాదు రబ్బరుచెప్పులు,వీటిని తొడుక్కొండి.అని వేడుకొనగా ,ఆమె ఆవేదనను చూడలేక తనమనస్సును మార్చుకొని నాటినుండి రబ్బరు చెప్పులు(స్లిప్పర్స్) వాడేవారు.

# రిక్షావానిపై గురుదేవుల కృప

ఒకసారి ఆధ్యాత్మికోపన్యాసము లిచ్చుటకు మార్కాపురము వెళ్లిరి. అది అర్ధరాత్రి చుట్టూచీకటి. ఒకరిక్షాలో గమ్యస్థానమునకు బయలుదేరిరి.దారిలో ఒక పెద్దగోతిలో రిక్షాపడిపోయినది. రిక్షావాడు

భయముతో పారిపోయినాడు.  లోతైన గొయ్యి. వర్షము కురుస్తున్నది. మనుష్యసంచారములేదు. బయటివారికి లోపలి మనిషి కనపడరు. తెల్లవారు ఝామున సుమారు నాలుగు గంటలకు అటువైపునుంచి వెడుతోన్నవారికి గోతిలో నుండి 'శ్రీరాం జైరాం జైజైరాం' సంకీర్తనము వినిపించినది. ఆశ్చర్యముతో లోనికి చూడగా గురుదేవులు కనబడిరి. వెంటనేవారిని బయటకు తీసి చేరవలసినచోటుకు పంపించిరి. పెద్దదెబ్బే తగిలినది. లెక్కచేయక ఉపన్యాసములివ్వసాగిరి. 'ప్రారబ్ధము ముంచుకొచ్చినప్పుడు సంతోషముతో అనుభవింపవలసినదేగదా! ' అని చిరునవ్వుతో చెప్పిరి.

రిక్షావానిని వెదికి పట్టితెచ్చిరి. గురుదేవులు వానినేమి అనవలదని ఆపినారు. తప్పుచేసినా, ఒప్పుచేసినా తండ్రికి బిడ్డలందరు సమానులేకదా!ఎవరినీ భయపెట్టకూడదని వారిభావన.ఈరీతిగ అందరిలో భగవంతుని చూడమనియు, తనకు బాధకలిగినను ఎదుటివారిని బాధపెట్టకూడదని బోధించిరి.

చాలా చికిత్సలు చేసినా నడుము వంగియే నడిచేవారు. అంతటి దెబ్బలతో సంకీర్తనము చేయుట సామాన్యులకు సాధ్యపడదు.కారణ జన్ములు కనుక శారీరక బాధలు పట్టించుకోక తమకర్తవ్యమేమిటో దానిని చేయుచుండెడివారు.

# బంగారు పిల్లిని దానముగా గ్రహించుట

ఒక భక్తురాలికి ఆరోగ్యము బాగాలేదు. ఇంటి పరిస్థితులు అంతంత మాత్రముగాఉన్నవి. ఆమెకు 'నీకు పిల్లిని చంపిన పాపముచుట్టుకొన్నది. బంగారు పిల్లిని చేయించి బ్రాహ్మణునికి దానమిస్తే బాధతొలగుతుంది' అని ఎవరో చెప్పిరట.ఆమె బంగారు పిల్లిని చేయించి గురువుగారికైతేబాగుంటుందని వారికి దానమిచ్చినది.శిష్యులెవరైనా దక్షిణక్రింద ఏదైనా డబ్బులు ఇచ్చినప్పుడు అవి ఎంతో ఏమిటో చూడకయే జేబులో వేసికొనేవారు.అటులనే ఈపిల్లి బొమ్మను గూడ చూడకయే జేబులో వేసికొనిరి.

**ఎవరి పేరు తలచినంతనే దుష్టశక్తులన్నియు పారిపోవునో అట్టి గురుదేవులను పిల్లి బొమ్మ యేమి చేయగలదు?**

# సత్యసాయిబాబా,షిర్డీసాయి భక్తులకు మంత్రోపదేశము చేయుట

సత్యసాయి బాబావారివద్ద పూజారి పద్మనాభశాస్త్రిగారు వేదపండితులు, బాబాగారిని మంత్రోపదేశము చేయమని అడిగిరి. అప్పుడుబాబా'కొద్దిరోజులలో మాశ్రీరామశరణ్వచ్చి మీకు మంత్రోపదేశము చేయుదురు' అనిరి.శాస్త్రిగారు బాబా చెప్పిన వ్యక్తి యెవరో తెలియకున్నా,వారిరాక కొరకు ఎదురుచూచుచుండిరి. సుమారు నాలుగు సంవత్సరములు గడిచినవి. మహాశివరాత్రినాడు శాస్త్రిగారు బాబాగారిని మంత్రోపదేశము చేయమని మరలాకోరిరి. బాబాగారు మీ యింట్లో ఉన్నవారినడుగు'మనిరి.

గురువుగారు వైశ్వదేవము చేయుటవలన ఎచటను భోజనము చేయరు. స్వయంపాకము చేసికొనెడివారు. శాస్త్రి గారికి తమయింట్లో ఉన్నవారు శ్రీరామశరణులని తెలియదు. శాస్త్రి గారు గురుదేవులను కలసి విషయమంతయు తెలిపి మంత్రోపదేశము చేయమని వేడిరి. గురుదేవులు వారికి మంత్రోపదేశము చేసిరి. పుట్టపర్తి చుట్టుప్రక్కల గ్రామాల వారు కూడ గురుదేవుల శిష్యులైరి.

కార్తీక పూర్ణిమనాడు గురువుగారు పగలంతా ఉపవశించి రాత్రిభోజనము చేయబోతుండగా ఒక భక్తుడు వచ్చి గురుదేవుల పాదములకు నమస్కరించెను. 'ఎవరు మీరు? ఏపని మీద వచ్చితిరి?' అని ప్రశ్నింపగా ఆభక్తుడు 'మాది పశ్చిమగోదావరి జిల్లాలోని ఒక పల్లెటూరు. నేనే షర్డీసాయిబాబా భక్తుడను. వారినే నమ్ముకొని ఉన్నాను. మంత్రోపదేశము చేయమని బాబా గారిని ప్రార్థింపగా నిన్నటి రాత్రి కలలో కనిపించి శ్రీరామశరణ్ గారి వద్దకు వెళ్లి నీకోర్కె తీర్చుకొమ్మని చెప్పి బుద్దాం వెళ్లు మార్గము కూడ చెప్పిరి

గురుదేవులు 'నన్ను గాక మరెవరి నైనా చెప్పినారేమో' అనిరి. బాబా మిమ్మల్నే చెప్పినారు. బాబా చెప్పిన అడ్రసు ప్రకారము మీయిల్లు తెలిసి కొని వచ్చినాను. మంత్రమిచ్చు వరకు మీపాదములు విడువనని, గట్టిగా పాదములు పట్టుకొని దు:ఖించెను. గురువుగారు అతనికి మంత్రోపదేశము చేసినారు. షిర్డిసాయిబాబా భక్తులలో కొందరు గురుదేవుల వద్ద మంత్రోపదేశమును పొందిరి. అవతార పురుషులుగా పూజింపబడుచున్న సత్యసాయిబాబా, షిర్డిసాయిబాబా కూడ మనగురువుగారి వద్దకు మంత్రోపదేశము కొరకు పంపినారనిన గురుదేవులు సాక్షాత్ అవతారపురుషులే. ఇందుకు ఎంతమాత్రము సందేహము లేదు.

# వితరణ శీలత

శిష్యులు తమకు గురుదక్షిణగా యిచ్చిన పైకమును గురుదేవులు రామమందిర నిర్మాణమునకు, ధూప, దీప, నైవేద్యములకు అప్పటికప్పుడే యిచ్చెడివారు. ఎవరైనా తమకు గుర్తుగా ఏదైనా యిమ్మని అడిగేవారు. వెంటనే తనవద్ద నున్న ఏదోఒకటి యిచ్చెడివారు. అంతయు జలమయమైనను వారు కూర్చున్న స్థలము లోనికి వ ర్రాత్రము నీరు రాలేదు!ఆ గడ్డపై కొంతమంది తమప్రాణములను కాపాడుకొనిరి.

# దివ్య అనుభూతులు -2

## ఆంజనేయస్వామి రామాయణ ప్రవచన శ్రవణము చేయుట.

యత్రయత్ర రఘునాధకీర్తనం తత్ర తత్రకృతమస్త కాంజలిమ్।

బాష్పవారి పరిపూర్ణలోచనం మారుతిం నమతరాక్షసాంతకమ్॥

గురుదేవులు తణుకు లో తులసీరామాయణము ప్రవచనము చేయుచుండగా ఒక దినమున ప్రవచనము మొదలు కాకముందే ఆంజనేయస్వామి వానర రూపమున వచ్చి బల్లచివర కూర్చుండెను. గురుదేవుల రామాయణ ము ఆసాంతము ఆలకించి వెళ్లిపోయిరి.

తుని వద్ద పెనుగొల్లులో గురుదేవుల జన్మదినోత్సవము జరిగినది. ఒకరోజు ఉదయము సుమారు తొమ్మిది గంటలకు గురుదేవులు ప్రవచనము చేయుచుండగా ఒక వృద్ధవానరము వచ్చి చిన్నగోడపై కూర్చుని ప్రవచనము నాలకించుచున్నది. గురుదేవులు చూచి తాను స్వయముగా అరటిపండ్లు తెప్పించి 'స్వామీ రండి,' అని పిలిచి ఆ పండ్లనిచ్చి స్వీకరించమని ప్రార్థించిరి. ఆవృద్ధవానరము గురుదేవుల వద్దకువచ్చి ఆపండ్లను స్వీకరించి వెళ్లిపోయిన ది. తెలియని కొందరు కొట్టబోగా గురుదేవులు వారిని వారించి 'వారు ఆంజనేయస్వామి' అని చెప్పిరి.

# రామచంద్రమూర్తి టిక్కెట్టు కొనిఇచ్చి ఇంటికి చేర్చుట

శ్రీరాగం ఆంజనేయులు గారు, గురుదేవులు కలసి నామప్రచారము చేయుటకు ఒక ఊరు వేళ్లినారు. ఆ ఊరివారు వీరిని పిలచి కార్యక్రమమునేర్పాటు చేసిరి. కార్యక్రమము పూర్తయి తిరిగి రాబోవునపుడు వీరికి పైకము ఏమీయివ్వక ఊరకుండిరి. పిలిచిన వారు చార్జీలకైనా పైకమివ్వక పోరులెమ్మని డబ్బేమీ తీసికోకుండానే వెళ్లినారు. గురువుగారు ఎవ్వరినీ యేమీఅడగరు. రామనామ ప్రచారము చేయుటకు వెళ్లి డబ్బు అడగరాదను తలంపుతో వారిచ్చినంత తీసికొనుట నియమముగా పెట్టుకొనిరి.

పిలిపించిన వారు బండి కట్టించి స్టేషనువరకు పంపినారు. బండి బాడుగ కూడ యివ్వలేదు. సంచులు జేబులు వెదకగా గురువుగారు వద్ద రెండు రూపాయలు, ఆంజనేయులు గారివద్ద ఒక రూపాయి దొరికినవి. బండిబాడుగకు రెండు రూపాయలు ఇచ్చినారు. ఒకరూపాయితో ప్రయాణము చేయుటయెట్లు? ఆరూపాయితో అర టి పండ్లు కొని ఇద్దరు తీసికొనిరి. వీరు ఎక్కవలసిన రైలు సాయంత్రము నాలుగు గంటలకు. గురుదేవులు, 'నేను బ్రాహ్మణున్ని కదా. రేపు ఉదయము ఉపాదానము చేసి వచ్చిన బియ్యమును అమ్మితే వచ్చిన డబ్బుతో మనము ఊరుచేరవచ్చున'ని ఆంజనేయులు గారితో అనిరి. రామచంద్రమూర్తి ఉండగా మనకు ఆందోళన ఎందులకు? అనుకొనిరి. ఇంతలో బండి వచ్చు సమయము అయినది. మన ప్రయాణము ఇవాళ లేదు కదా మనము ఈరాత్రి స్టే షనులోనే గడుపవలెనని తలచిరి. రామచంద్రమూర్తి తన భక్తులకెన్నడు యిబ్బందికలుగనీయడు.

ఒక జమిందారు వీరి వద్దకువచ్చి తెలిసినవానివలె పలకరించినాడు. ప్రయాణమెక్కడికో తెలిసికొని రెండు మొదటి తరగతి టిక్కెట్లు తెప్పించి యిచ్చి 'నేనును ఈబండిలోనే వస్తున్నాను' అని ఒక బుట్టెడు 'బత్తాయిలు, చక్రకేళీలు' యిచ్చి ఇవి తీసికొనండి. మీరు ఆహారము తీసికొనినట్లు కనిపించుటలేదు'. అని వారిని రైలు ఎక్కించి

పండ్ల బుట్టను వారి వద్ద పెట్టించి 'నేను వస్తున్నాను' అని చెప్పి ప్లాటుఫారముమీద అటునిటు తిరుగుచు జనములో కలిసిపోయిరి. బండి బయలుదేరినది. ఆజమిందారు జాడలేదు.

ఆవచ్చిన వారు శ్రీరామచంద్రమూర్తియే యని గురుదేవులు,ఆంజనేయులు గారు తలచిరి.

# బ్రహ్మానంద తీర్థస్వామి విగ్రహప్రతిష్ఠ

శ్రీరామశరణ్ గురుదేవులకు బాపట్లలోని శ్రీశంకరవిద్యాలయం(వేదపాఠశాల) తో సన్నిహిత సంబంధము కలదు. ఈ పాఠశాల శ్రీబ్రహ్మానంద తీర్థస్వామి వారిచే 80 సం॥ల క్రిందట స్థాపించబడినది. స్వామివారి చలువరాతి విగ్రహం ప్రతిష్ఠించవలెనని గురుదేవులను సంప్రతించగా వారు ప్రతిష్ఠకు ముహూర్తము నిర్ణయించి, విగ్రహమును జయపూరులో తయారుచేయించి ప్యాకింగ్ చేయించి వారివెంటనే రైలులో తీసికొని వచ్చుచుండిరి. ఝాన్సీ జంక్షన్‌లో రైలు మారేటప్పుడు విగ్రహం ప్యాకింగు ఊడిపోయినది. గురుదేవులు ఈవిషయమును గూర్చి ఆలోచిస్తుండగా ఒకవ్యక్తి ఆచివరనుండి త్వరగా గురుదేవులను సమీపించి, ఆందోళనకు కారణమడిగి తెలిసికొని వెంటనే దగ్గరలోని కొట్టు నుంచి కావలసిన సామగ్రి తెప్పించి ఆవిగ్రహమును ప్యాక్ చేసినారు. బుకింగ్‌లో గూడ్సులో తప్ప విగ్రహమును అనుమతించలేదు. ఆ అగంతకుడు అప్పుడేవచ్చుచున్న రైల్వేఆఫీసరును చూపి'మీరు వారిని కలిసి చెప్పండి, అనుమతిస్తారు, ఆయనమంచివాడు'అనిచెప్పగా ఆరైల్వేఆఫీసరు విగ్రహమును తీసికొని వెళ్లుటకు అనుమతించినారు. పది నిమిషముల తరువాత రైలురాగా ఆవ్యక్తి విగ్రహము పేటికను రైలులో ఎక్కించి వెనుదిరిగినాడు! గురుదేవులు చూస్తుండగనే అంతర్ధానమైనారు. విగ్రహమును మరునాడు ప్రతిష్ఠ సమయమునకు బాపట్ల చేర్చి కృతకృత్యులయిరి.

రామచంద్రమూర్తి ఆరీతిగా వెన్నంటి క్లిష్ట సమస్యలలో తానై తోడు నిలచెడివాడు. (శ్రీ పంగులూరి శేషగిరిరావు గారి సౌజన్యంతో)

# శ్రీరామపాద క్షేత్రము

గురుదేవులు నాగాయలంక లాంచీరేవు గట్టున వచ్చేపోయేవారిలో భగవద్భక్తిని ఇనుమడింపచేయ సంకల్పించి ఒక ఆలయమును స్థాపించుటకు 1964 మే31న ప్రతిష్ఠకు ముహూర్తము నిర్ణయించినారు. అన్ని యేర్పాట్లుజరుగుచున్నవి.

ఇదిలాఉండగా కంచిపరమాచార్యులవారు శ్రీశ్రీచంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వామివారి షష్ఠిపూర్తి ఉత్సవము మే25 న కంచికి మూడుమైళ్ల దూరమున ఉన్న అంబి గ్రామములో జరుగునని తెలిసి చూచిరావలెనని

అచ్చటికి వెళ్లదలచిరి. 31వతేదీ విగ్రహప్రతిష్ఠ నాటికి తప్పక వచ్చెదననియు, సిద్ధముగా ఉండమని చెప్పి అంబికి బయలుదేరి వెళ్లిరి.

షష్ఠి పూర్తినాడు వీరికి స్వామివారి తీర్థము దొరకలేదు. మరునాడు 26వ తేదీ తీర్థము తీసికొని వెళ్లవచ్చుననుకొనిరి. అంతకు పూర్వము గురువుగారు స్వామివారిని దర్శించలేదు. తీర్థము కొరకు చేయిచాపిరి. స్వామివారు తీర్థమిచ్చి,చేతిలోనున్న పెద్ద ఉద్ధరిణె క్రిందపెట్టి 'ప్రతిష్ఠ ఎప్పుడు?' అని అడిగిరి. గురుదేవులు నిర్ఘాంతపడిరి.'మా యింట్లో మందిరంలో ఎప్పుడో అయింది.' అనిరి. స్వామివారు 'అదికాదు, నదిఒడ్డున ఏర్పాటు చేశావే,రామపాదక్షేత్రం అక్కడి ప్రతిష్ఠ ' అనిరి.

గురుదేవులు : మే 31న చేయవలెననుకున్నాము.

స్వామివారు : 31 న చేస్తారా!?

స్వామివారు ప్రశ్నార్థకముగాను, సంశయాత్మకముగాను అనిన మాటలో ఆరోజున ప్రతిష్ఠ జరగదని ధ్వనించినది. స్వామివారు అక్షతలు,కుంకుమ, కిస్మస్ పండ్లు ప్రసాదముగా యిచ్చి యంత్రమునకు ప్రత్యామ్నాయముగా వాటిని విగ్రహముల క్రింద ఉంచమని సెలవిచ్చిరి.

మరునాడు 27వ తేదీన జవహర్‌లాల్ నెహ్రూమృతితో రైళ్లు,బస్సులు నడవక గురుదేవులు 30వ తేదీ సాయంకాలము నకు ఊరుచేరిరి. వీరు ఊరిలో లేనందున 'గురువురు లేని ప్రతాష్ఠా' అనుకొని పనులేమియి ప్రారభించలేదు. జూన్ 11న విగ్రహ ప్రతిష్ఠ జరిగినది.

స్వామివారు ఆ స్థలమును రామపాదక్షేత్రమని ఏలఅనినారు?

ప్రతిష్ఠ జరిగిన రెండు మాసములకు నాగార్జున సాగరుడామువిరిగి కృష్ణా నదికి అంతులేని వరద వచ్చినది. ఆవరద నీరు గుడిలో శ్రీరామపాదములనంటి తగ్గిపోయినది. మరియొక అంగుళము వరద పెరిగి ఉంటే దివితాలూకాలో 70 గ్రామాలు కొట్టుకొని పోయి ఉండెడివట!

# గురుదేవుల పాదములను తాకి పునీతమయిన పాము

చెరుకుమిల్లిలో గురుదేవులు స్నానము చేసి వచ్చేటప్పుడు ఒక పెద్దపాము వారి కాళ్లకు చుట్టుకొనినది. గురుదేవులు కదలక మెదలక కొద్దిసేపు అట్లే నిలువబడిరి. అచటనే ఉన్నవారికి ఏమిచేయాలో పాలుపోలేదు. హనుమ మంత్రమును జపించుచుండిరి. కొంతసేపటికి ఆపాము గురుదేవుల పాదములను విడిచి తనదారిన తాను వెళ్లి పోయి నది. గురుదేవులు 'పాము నన్ను యేమిచేయలేదు. నాలో ఉన్నది రాముడే, దానిలో ఉన్నది రాముడే,' అనినారు. క్రూర స్వభావము కలిగిన పాము కూడ గురుదేవులను స్పృశించినంతనే దాని స్వభావమును విడిచిపెట్టినది! అంతియేగాక గురుదేవుల పాదములను తాకి తాను పునీతమయినది.

# గురుదేవుల రూపములో రామచంద్రమూర్తి కథా సంకీర్తనము చేయుట!

చెరుకూరులో ఆధాత్మికకార్యక్రమములు జరుగుచున్నవి.ఆరోజున కథాసంకీర్తనము చేయవలసిన వారు ఏలనో రాలేదు.నిర్వాహకులు 'ఇప్పుడు శ్రీరామశరణులయితే ఆద్భుతముగా కథాగానము చేసిఉండేవారు' అని అనుకొనిరి. అదే సమయమున శ్రీరామశరణు గురుదేవులు వచ్చి రామదాసు కథాసంకీర్తనమును అత్యద్భుత ముగా గానము చేసిరి. అందరూ ఆకథాసంకీర్తనమునకు మంత్ర ముగ్ధులైరి. చెరుకూరులోని బంధువులు గురువుగారిని కలిసి 'హరికథా సంకీర్తనము చాలాబాగుంది' అని ప్రశంసించిరి. గురుదేవులు నవ్వి 'నేను చెరుకూరు రాలేదు,హరికథాసంకీర్తనము చేయనూలేదు.నేను ఊరిలోనే ఉన్నాను' అన్నారు.

గురుదేవుల రూపములో శ్రీరామచంద్రమూర్తియే కథాసంకీర్తనము చేసినారన్నమాట!!
మన గురుదేవుల మహిమలను వినిన శ్రీరామనామ క్షేత్రస్థాపక సభ్యులు అందరు వీరిని చూచి వెళదామని వచ్చినారు.గొలుసు ఆదృశ్యం అయి మరల పైనుండి పడటం ఈసభ్యులు ప్రత్యక్షముగా చూచినారు! అప్పుడు గురువుగారు ఆంజనేయుని చిత్రమును వ్రాయుచున్నారు. ఆ పటము కావలెనని బొడ్డుపల్లి వేంకటప్పయ్యగారు గురువుగారిని అర్థించినారు.కాని ఆంజనేయస్వామి ఆచిత్రాన్ని చించివేసినాడు.మందిరములో ఎవరు లేకపోయినా పటము చిరిగిపోయి కన్పించినది. మనగురుదేవులు కోట్లకొలది జపించిన జపమాలను ఆయన అర్దించినాడు, దానిని స్పర్శించబోగా వేంకటప్పయ్యగారి చేయి చురుక్కుమనినది.!!

# వాసుదాస స్వామి సమక్షములో

మహిమలు సాధనకు అవరోధమని తలచి గురుదేవులు,అమ్మగారు వాటిని ఉపసంహరింపచేయ వలసినదిగా రాముడినే ప్రార్థించినారు.తమగురువుగారైన వాసుదాస స్వామి వారికి కూడ ఈవిషయమును నివేదిం చవలెననుకున్నారు సత్తెనపల్లిలో ఉన్న వాసుదాస స్వామివారికి తన వేదనను నివేదించినారు.అదే సమయములో అమ్మగారి గొలుసు మాయమైనది.స్వామివారు శిష్యులచేత అంతా వెదికించినారు.కనబడలేదు.

గురుదేవులు తమ గురువుల వద్ద సెలవు తీసికొని తల్లిదండ్రుల దర్శనార్ధము నల్లపాడు వచ్చినారు. గురువుగారు పాదప్రక్షాళనము చేసికొంటుండగా 'ఆంజనేయస్వామి మెడలో గొలుసు పెట్టి మాయమైనాడు'అని అమ్మగారు పెద్దగా అన్నారు.సత్తెనపల్లిలో తమ గురువుల సమక్షంలో మాయమైన ఆగొలుసు, నల్లపాడులో తమ మాతాపితల సమక్షంలో లభించినది! ఈఅద్భుతమును చూచిన గురుదేవుల మాతృమూర్తి మహదానందమును పొందినారు.

# మాతృదేవత సీతమ్మ గారు తిలకించి పులకించిన అనుభవములు

ఒకసారి సీతమ్మగారు తమకుమారుని గృహమునకు జమ్ములపాలెం వచ్చినారు. అది వేసవికాలము. ఒకనాడు సీతమ్మగారు తనకోడలికి జడవేయుచుండగా, అమ్మగారి(కోడలి) గాజు ఒకటి మాయమైనది.ఇంతలో ఈచేతి గాజు కూడ ఒకటి మాయమైనది.కొద్దిక్షణాల తరువాత మరొక గాజు ఇలా ఒకటి. ...ఒకటిగా ...అమ్మగారి చేతులకున్న మూడు జతల గాజులు మాయమైపోయినవి. వీటిని ఆంజనేయస్వామి తీసికొని వెళ్లినాడు!ఇలా మూడుజతల గాజులు అదృశ్యమై అమ్మగారి చేతులు మొండివైపోగా సీతమ్మగారు చింతించి 'ముత్తైదువలు ఈవిధముగా ఉండకూడదని'తన చేతికి ఉన్న బంగారు మురుగులను కోడలు చేతికి అలంకరించినారు.ఇంతలో సీతమ్మగారి గొలుసు కూడ మాయమైపోయినది. సీతమ్మగారు నివ్వెరపడి'ఇదేమి దేవుడమ్మా,నగలు మాయము చేయడమేమిటి?' అన్నారు. శ్రీరామచంద్రుడు అమ్మగారి శరీరముపై ఆవహించి 'సీతమ్మా వంట యింటి మడినీటి బిందెలో చూచుకో – ఆభరణాలన్నీ

భద్రంగానే ఉన్నవి' అన్నాడు.వెంటనే సీతమ్మగారు మడిగట్టుకొని వంట ఇంటిలోని నీటిబిందెలో చూడగా,ఆశ్చర్యం !, సువర్ణాభరణములన్నీ అందులోనే ఉన్నవి!బిందె మీద మూత అలాగేఉన్నది.కాని ఆభరణములు ఆబిందెలోనికి చేరినవి!

సీతమ్మ గారి ఆనందమునకు అవధులులేవు.

సీతమ్మగారు మరునాడే తనకుమార్తె వద్దకు వెళ్లవలెనని సిద్ధమగుచున్నారు.ఆరోజులలో బస్సులు,రిక్షాలు లేవు. తెల్లవారగానే బయలుదేరితే జమ్ములపాలెం నుండి బాపట్లకు నడిచి వెళ్లి రైలులో ప్రయాణించి నల్లపాడు చేరే సరికి సాయంత్రం నాలుగు గంటలు అవుతుంది.రాత్రి భోజనాలు అయినతరువాత ఇంటికి తాళం వేసి ఆరుబయట నిద్రించినారు. సూర్యోదయానికి మెలకువ వచ్చినది.అమ్మగారిని రామచంద్రమూర్తి ఆవహించి 'వంట అయినది, భోజనము చేసివెళ్లమ'ని సీతమ్మ గారిని ఆదేశించినాడు! గురువుగారు, సీతమ్మ గారు ఆశ్చర్యపోయినారు.తాళాలు తీసి చూడగా,దాలి పొయ్యిలో పిడకల దాలి మీద సన్నగా మండుతూ.....అన్నము సిద్ధముగా ఉన్నది.శ్రీరామచంద్రుని ప్రసాదాన్ని స్వీకరించి సీతమ్మ గారు బయలుదేరినారు.

# టంగుటూరు జన్మదినోత్సవ విశేషములు

1991 లో శ్రీరామశరణ్ గురుదేవుల జన్మదిన మహోత్సవములు టంగుటూరులో జరిగినవి.ఆఉత్సవములలో శిష్యులు గురుదేవులకు గండపెడేరము కిరీటము, కుండలములు,పట్టువస్త్రములు మొదలగు వానిని అత్యంత భక్తి ప్రపత్తులతో సమర్పించుకొనిరి.

ఆ సందర్భమున గురుదేవులు 'మీరు బహూకరించిన కిరీటము,పట్టువస్త్రములు ఇత్యాదులన్నియు మీసంతోషము కొరకు బహూకరించినవి.ఇవియేమియు నాకు అక్కరలేదు.మీకోరిక తీర్చుటకు వీటిని అంగీకరించినాను. నాకొరకు కిరీటము,పట్టువస్త్రములు తదితర ఆభరణములన్నియు వైకుంఠములో నున్నవి.నాతండ్రి, పినతండ్రులు, అన్నలు తీసివేసినవి నాకొరకు సిద్ధముగానున్నవి. నేనెవరినన్నది మీరు నేను ఈదేహముతో ఉన్నంతవరకు తెలిసికొనలేరు.నేను దేహము చాలించిన పిదప నావద్దనుండి ఏమియు తీసికొనలేదనియు, గురుసేవ చేయలేక పోయితిమనియు, గురుదేవుల శక్తి, సామర్థ్యములు తెలిసికొనలేక పోయితిమనియు తెలిసికొని బాధపడెదరు. భయపడక మీమీ సందేహములన్నింటిని తెలుసుకోండి. నేను వచ్చినది మీకొరకు.రామనామము చేయుటవలన కలుగు మహిమను మీఅందరికి తెలియజెప్పుట, ముక్తి మార్గము వైపు మిమ్ములను నడిపించుట,ముక్తిని కలుగజేయుట నాకర్తవ్యము. ఈ దేహము చాలించిన తరువాత ఇంతశ్రద్ధగా మీకు చెప్పెవారు లభింపరు' అని ప్రబోధించిరి.

గురుదేవులకు శిష్యులు గండపెండేరాదులతో సన్మానము చేసినప్పుడు వారు ఆశువుగా రెండు సీస పద్యములను చెప్పిరి.వారి హృదయము నిత్యానుభూతి ఈపద్యముల వలన గమనింపనగును.

ఆ పద్యములు యివి :

సీ॥ గండపెడేరము గాళ్లకు దొడిగిరి
కంకణంబును నాదు కరమునందు
పట్టు పుట్టంబులు కట్టబెట్టిరి నాకు
విలువైన శాల్వ పైవేసినారు
మస్తకంబున స్వర్ణమకుటంబు బెట్టిరి
విరుల దండలుమెడ వేసినారు
కుండలాల్ చెవులకు గుదురుపరిచిరి నాకు
నిలువు బొట్టును బెట్టినీటుగాను
తే॥ నాకుగావివి వారియానందమునకె
తోలుతిత్తి కలంకరణాలవేల ?
నేను దేహంబు గానను నిశ్చయమున
నేను నాలోనుంటిని నిజముగాను.

సీ॥ దివ్యవైకుంఠాన తేజరిల్లుచునుండు
నవ్యకిరీటంబు నాకుగలదు
స్వామి నిర్మాల్యంబు స్వర్ణచేలంబులు

కట్టుకొనుటకునై కలవు నాకు
హరి కర్ణ కుండలాల్ కరకంకణంబులు
ధరియింప గలవు శ్రీహరి కరుణను
కనక మంజీరముల్ కాలికి తొడగగ
అవ్వారిగా గల వచటనాకు.

గీ॥ సందియములేక వైకుంఠ మందిరమున
కానుకొనిన మందార వనాంతరమున
చంద్రకాంత శిలోపరి స్వస్థముగను
నేను నాలోన నుండుదు నిశ్చయముగ.

# తెనాలిలో గురుదేవుల జన్మదినోత్సవ వేడుకలు

1992వ సంవత్సరము ఏప్రియల్ 29,30 తేదీలలో గురుదేవుల 88వ జన్మదినోత్సవ వేడుకలు అత్యంత వైభవోపేతముగ తెనాలిలో జరిగినవి. ఆఉత్సవములలో ప్రత్యేకాకర్షణ గురుదేవుల ఊరేగింపు. గురుదేవుల యెక్క దర్శన భాగ్యమును అందరికి కలుగజేయవలెననియు, వారి మాహత్యము పదిమందికి తెలియజేయుటకు ఊరేగింపు జరుపవలెనని గురుదేవుల అనుమతి కోరగా, వారి కోరికను కాదనలేక గురుదేవులంగీకరించిరి.

ఒక ట్రాక్టరును బాగుగా అలంకరించి సింహాసనమునేర్పాటు చేసి దానిపై గురుదేవులను కూర్చుండజేసిరి. రంగురంగుల విద్యుద్దీపములతోను, బ్యాండు మేళములతోను రామనామము చేయుచు ఊరేగింపు బయలుదేరినది.

తెనాలి పురవీధులలో ఊరేగింపు జరుగుచున్నప్పుడు కొందర ు భక్తులు నీరు వారబోసి, టెంకాయలు కొట్టి హారతులిచ్చిరి. గురుదేవులు కొందరికి అమ్మవారిగను,మరికొందరికి దశరథమహారాజుగను ,ఇంకొందరికి శ్రీరామ చంద్రమూర్తి గను,పలువురికి రంగురంగుల కాంతులతో విరాజిల్లుతున్న గురుదేవులుగను కనిపించిరి!

ఏదేని ఒక సత్కార్యమును ప్రారంభించినపుడు కొన్ని ఆటంకములు కలుగుట సహజము.'స్థూణానిఖనన న్యాయము' అనునట్లు భక్తులలోని భక్తిని భగవంతుడు పరీక్షించును. (స్థూణానిఖనన న్యాయమనగా గుంజను గోతిలో పాతి గట్టిగ నున్నదో లేదోనని ఊపి చూచుట). భక్తుల యొక్కశ్రద్ధ, సహనములను పరీక్షించుటకు యిటువంటి అటంకములు కలుగును. శ్రీరామశరణ్ గురుదేవులు కూడ తమ శిష్యులకు ఒక చిన్న పరీక్షపెట్టిరి.

గురుదేవుల ఊరేగింపులో చివర ఒక సంఘటన జరిగినది.ఒకవీధిలో ఊరేగింపు జరుగుచుండగా మైకములో నున్న ఒక టాక్సీడ్రైవరు తన టాక్సీని ట్రాక్టరుకు గుద్దినాడు. టాక్సీకి ముందున్న చిన్నరేకు వంటిది వంకరపోయినది. దానితో ఆ టాక్సీడ్రైవరు పేచీకిదిగి(చాల డబ్బును) అధికమొత్తములో నష్టపరిహారమును అడిగినాడు. ఇరుపక్షములలో వాదోపవాదములు జరుగుచున్నవి. గురుదేవులు మాత్రము ఏమి పట్టనట్లు మిన్నకున్నారు.

# గురుదేవుల అవసానము – అవతార పరిసమాప్తి

ఒక పర్యాయము గురుదేవులు లక్ష్మణయతీంద్రుల వారితో అందరి సమక్షములో ఇట్లుపలికిరి. “వేంకటశాస్త్రి గారను సంస్కృత పండితులు మంత్రోపదేశము చేయమని నన్ను ప్రార్థించిరి. నాకంటె వయస్సున పెద్దవారగుటచే వారికి మంత్రోపదేశము చేయుటకు నామనస్సు అంగీకరించలేదు. ఆయన నావద్ద మంత్ర దీక్ష తీసికొనవలెనని పట్టు బట్టినను నేను అంగీకరించలేదు. ఆయన యితరులెవరి వద్ద ఉపదేశము పొందకుండా ఆ ఆవేదనతోనే దేహమును చాలించిరి.నాకు చాల బాధకలిగినది.ఆయన నావలన మానసిక వేదన ననుభవించి ఆవ్యథతోనే ప్రాణమువిడిచిరి గదా!అది తలచుకొనిన యిప్పటికి బాధగానే ఉంటుంది.నేను మరల జన్మయెత్తి వారికి మంత్రోపదేశము చేయవలసి యున్నది.’

1994 ‘గురుపూర్ణిమ’ గురుపూజామహోత్సవములు తెనాలిలో ఘనముగా జరుపబడినవి. బుద్దాంలోని వారి నివాసము రిపేరు చేయుచున్నందున తెనాలిలో జరిగినవి. శ్రావణమాసము లో గురుదేవులు తమ మనుమరాలింట కొన్నిదినములున్నప్పుడు ‘శ్రీరామతత్వము’ గూర్చి ‘నవవిధభక్తుల’ గూర్చియు చేసిన మహోపన్యాసములు క్యాసెట్లలో నిక్షిప్తము చేయబడినవి.

కొందరు శిష్యులు గురుదేవుల దర్శనార్థము వెళ్లినప్పుడు ‘ప్రభువు పిలుపు కొరకు ఎదురుచూస్తున్నాను .నాకు మాత్రము పిలుపు రావడంలేదు,’ అని వారి వద్దబాధపడినారు.

తపస్వినమ్మగారు,మరికొందరు శిష్యులు గురుదేవుల దర్శనార్థము బాపట్ల వెళ్లినప్పుడు వారు గురుదేవుల ముఖమునందేదో మార్పుగమనించినారు. గురుదేవుల అల్లుడు మరణించి అప్పటికి ఎనిమిది దినములైనది. అందువలన అలా ఉన్నారేమో అని అనుకొనిరి. గురుదేవులు రామాయణమును చదువుచున్నారు. వారు తపస్వినమ్మగారిని చూచిన వెంటనే ‘ఇక ఈ పాడుప్రపంచంలో ఉండదలచుకోలేదు. నాప్రభువు పిలుపు కోసం ఎదురు చూస్తున్నాను. ఈదేహం నాకు సహకరించడంలేదు. ఎవరికి ఏవేవి యివ్వవలెనో వారికవన్నీయిచ్చాను. ఈదేహంవచ్చిన పని పూర్తయింది.’ అని అన్నారు.అప్పుడు తపస్వినమ్మగారు,‘మరి నాకిచ్చిన మాటేమిటి?’ అని అడుగగా గురుదేవులు ముఖము త్రిప్పుకొనిరి. రెట్టించి అడుగగా ఆకసమువైపు చూపించుచు ‘అక్కడ కలుసుకుంటాము కదా! అక్కడే మాట్లాడుకోవచ్చును’ అనిరి.

కొంత సంభాషణ జరిగిన పిమ్మట తపస్వినమ్మగారు 'గురువుగారూ, మీరు దేహము చాలిస్తే మీ శిష్యులందరు ఏమైపోతారు? మీశిష్యుల కొరకైనా కొంతకాలము మీరు జీవించి ఉండాలి,'అనిరి. గురుదేవులు నవ్వి "మీకు నేను ఎంతకాలమైనా ఉండాలనే ఉంటుంది. దైవము యొక్క అవతారమునకు కూడా కాలపరిమితి ఉంటుంది. తాను వచ్చిన పని కాగానే అవతారమును చాలించుతారు. అలాగే జీవుడు కూడ. నాపని అయిపోయింది. ఏక్షణమైనను పిలుపురావచ్చును."
అనినారు.

తపస్వినమ్మగారు ఇతరశిష్యులు గురుదేవులను దర్శించి వచ్చిన నాలుగు దినములకు 1994 అక్టోబరు 20వ తేదీ ఉదయము గురుదేవులు స్నానము చేయుచు "రఘూ" అని మనుమనిబిడ్డను కేకవేయుచు పడిపోయిరి. కుటుంబ సభ్యులు, గ్రామపెద్దలు కొందరు వైద్యము చేయించుటకొరకు బాపట్లతీసికొని వెళ్లి ఒక ఆసుపత్రిలో చేర్చిరి.

జబ్బులో స్పృహలోలేని సమయములో కూడ ఒక అమ్మాయి కలము గురుదేవుల చేతికి యిచ్చి దీవించమని కోరిన వెంటనే తనబాధను కూడ లెక్కచేయక ఆమెను దీవించిరి!రామనామము చేయుచున్నప్పుడు ' గురువుగారూ, మీరు రామనామము చేయండి,' అనగానే రామనామము చేయుచుండిరి. ఆ స్థితిలోనే తపస్వినమ్మగారిని ఆశీర్వదించిరి! ఆమె చెవిలో యేదోచెప్పిరి. కాని వారికా విషయము జ్ఞాపకములేదు. గురుదేవులే మరపు తెచ్చిరేమో!

వైద్యులు వచ్చి 'మీకు ఎలా ఉంది?' అని అడిగితే 'నాకు బాధ ఏమీలేదు. బాగానే ఉన్నాను' అనినారు. రామనామము చేయమని శిష్యులకు చెప్పినారు. తాను కూడ రామనామము చేయుమని శిష్యులకు చెప్పినారు. తాను కూడ రామనామము చేసికొంటూ బాధలేనట్లే ఉన్నారు. శిష్యుల, భక్తుల బాధలను తాముగ్రహించి వాటిని తాము అనుభవించినారు. అంత్యకాలములో యితరులవలన వారికి ప్రాప్తించిన ప్రారబ్ధమును పూర్తిగా అనుభవించినారు. ఏదేహమునకు ప్రారబ్దము అంటుకొనినదో ఆదేహముతోనే పూర్తిగా అనుభవించి,ఆదేహమును వదిలి 26-10-94 బుధవారం మధ్యాహ్నం సుమారు ఒంటిగంట సమయమున రామ సాయుజ్యమును పొందిరి!

***1965 ఏప్రియల్ 27,28,29 తేదీలలో అత్యంత ఘనంగా జరిగిన గునేదేవుల షష్టిపూర్తి జన్మదిన మహోత్స వములలో 29వ తేదీన గురుదేవుల జన్మదినోత్సవము రోజున వారి దివ్య సందేశము :***

శ్రీప్రభుదత్త బ్రహ్మచారిగారు వ్రజభాషలో 'భాగవతకథా' అను గ్రంథమును అరువది భాగములుగా రచించినారు. వారి ఆజ్ఞచేతనే నేనా అరువది భాగాలను తెలుగుభాషలో అనువదించినాను. అత్యధిక పరిశ్రమచేత నేత్రావరోధము కలిగినది. వాటిని ప్రకటించి ప్రచారము చేయుట అభిమానుల,శిష్యులయెక్క కర్తవ్యమైఉన్నది. నేనెన్నడు గురువు కావాలని తలచలేదు. ఇప్పుడూనాకా భావము హృదయము నందు లేదు. ఒకరికి గురువుగా ఉండటంకంటే నూరుగురికి శిష్యుడిగా ఉండటంక్షేమం. నేను పలువురికి శిష్యుడిగా ఉండటమే కోరతాను. కాని నేను తీవ్రముగ అనుష్ఠానం చేసేటప్పుడు మా గురుదేవులు స్వప్నంలో దర్శనమిచ్చి,'నిన్ను అడిగేవారికి మంత్రమీయనని అంటున్నావుకదా నేనుకూ

ద నీవలెనే తిరస్కరించి మంత్రమివ్వకపోతే నీగతి ఏమయ్యేది.?'అన్నారు.వారి యాజ్ఞశిరోధార్యం కనుకనాయందు భక్తి గలవారికి మంత్రదీక్ష నిచ్చాను.**నేను శిష్యులకిచ్చింది అక్షయమైన మంత్రము.దానికై వారు కూడ గురు దక్షిణ అక్షయమైన వస్తువు (హృదయము) నే ఇవ్వవలసి ఉంటుంది! నేనిచ్చిన మంత్రమును శ్రద్ధా భక్తుల తో జపించి సిద్ధిని పొందితే అదేనాకు పదివేలు.సాధనా సిద్ధిని పొందిన వారే నాకు అత్యంత ప్రియులు! వారి యందు నాకు యథార్థమైన వాత్సల్యం ఉంటుంది.**
**ఆ సందర్భంలో పలువురు శిష్యులు గురుదేవులకు సమర్పించిన పైకము,వాగ్దానము చేసిన విరాళములు - ఈ ద్రవ్యమేమీ తనకు అక్కరలేదనీ ఆద్రవ్యం మొత్తాన్ని నామప్రయాగ స్వామికి సమర్పిస్తున్నానని ప్రకటించినారు!! !.**

# గురుదేవుల అంతిమ సందేశము

"నేను దేహమును చాలించినను మీకు కనిపించుచునే ఉందును.దేహముతో ఉన్నప్పుడు కొంతవరకు మాత్రమే పరిమితి ఉంటుంది. దేహము చాలించిన తరువాత నాశిష్యులు ఎంతదూరమున ఉన్నను అన్ని ప్రదేశములను తిరుగుచు వారి మంచి చెడులను పైనుండి చూచుచుందును.దేహము చాలించిన పిమ్మట బుద్ధాంలో నేను ప్రతిష్ఠించిన పవనకుమార్‌లో నా ఆత్మను ప్రవేశపెట్టెదను. విభూతిని పవనకుమారుని పాదముల చెంత యుంచి మీబాధలు చెప్పుకొని నన్ను ప్రార్థించిన యెడల మీబాధలు తొలగును.ఆవిభూతిని నుదుట ధరించండి.నేను లేనని బాధపడవలదు.నెను ఎక్కడికి వెళ్లను.మీరు ఎప్పుడు నన్నుపిలిచిన అప్పుడు మీవద్దకు వచ్చెదను.అవసరమైన యెడల మరల మరల జన్మించెదను. నాశిష్యులందరికి ముక్తి లభించు వరకు వారిని నేను తీర్చిదిద్దెదను. సంసారమనే సముద్రములో కొట్టుకొని పోవువారికి నేను నావనై ఒడ్డుకు చేర్చెదను."

**శ్రీ గురుభ్యో నమ:**
**శాంతి శ్శాంతి శ్శాంతి:**

# శ్రీరామశరణ్ గురుదేవుల దివ్య విభూతులు

## శ్రీ సద్గురు పరబ్రహ్మణేనమ:

శ్రీరామశరణ్ గురుదేవుల దివ్య చరితమును యింతవరకు మనము తెలిసికొంటిమి.శ్రీ గురుదేవుల దివ్యానుభూతులు వారి శిష్యుల,భక్తుల ఇతరుల దైనందిన,ఆధ్యాత్మిక జీవితములపై ఎట్లు ప్రభావితము చేసినవో, వారివారి అనుభవములు,అనుభూతులను యిప్పుడు తెలిసికొందుము.

శ్రీగురుదేవులు తమజీవిత కాలములో ఎంతో అనుష్ఠానముచేసి మంత్రసిద్ధిని పొంది ఎన్నోసిద్ధులను పొందిరి. కాని వాటిని ప్రదర్శింపక మరుగు పరచి సామాన్యవ్యక్తి గానేమెలగిరి.కాని వారి శిష్యులు,భక్తులు వారి యెక్క మహిమా ప్రభావముచే ఎన్నియో అనుభవములను పొందిరి.గురుదేవుల యెక్క దివ్య విభూతులను,అను భవములను తెలుసుకొందుము.

తొలదొల్త గురుదేవుల శిష్యులలో అగ్రగణ్యులు, గురుదేవులచేతనే జగన్మాతగా కీర్తింపబడిన తపస్వినమ్మ గారి అనుభూతులను,అనుభవములను తెలుసుకొందము.

# తపస్వినమ్మ గారికి కలిగిన దివ్యానుభూతులు

## 1.స్వప్నములో గురుదేవుల మంత్రోపదేశము

రామోపాసన చేసి మంత్రసిద్ధిని పొందినవారు, ధనసంపాదనకు ఎక్కువ విలువనివ్వనివారు, తాను పిలువకయే తనయింటికి వచ్చి అనుగ్రహించు మహనీయునివద్ద మంత్రోపదేశము పొందవలెనని తపస్వినమ్మ గారి కోరిక.

తపస్వినమ్మగారు టైఫాయిడ్ జ్వరముతో బాధపడుచుండిరి. వారము దాటినా జ్వరము తగ్గలేదు. జ్వరము తీవ్రముగా ఉండెడిది.ఏమీతెలియక మరో లోకములో ఉన్నట్లు తోచెడిది. మంత్రోపదేశము లేకుండానే దేహమును చాలింతునేమో అను బాధకలిగింది.

ఒకనాటి రాత్రి కలలో పండువంటి పచ్చటి శరీరము,ఆజానుబాహుడు అయిన ఒక బ్రాహ్మణుడు మెడలో తులసిమాల, నుదుట నిలువుబొట్టు ధరించి 'హరేరామ' నామము గల ఉత్తరీయమును ధరించి తపస్వినమ్మగారు పరుండిన మంచముపై కూర్చుండి ఆమెతలను తన ఒడిలో పెట్టుకొని,'నీకు మంత్రోపదేశము చేయడానికి వచ్చి నాను. నీవేమీ బాధపడవద్దు.నేనున్నాను' అని చెవిలో మంత్రోపదేశము చేసి,శరీరమును నిమిరి అంతర్ధానమయిరి. ఆమరునాటి నుండి జ్వర తీవ్రత తగ్గి నార్మల్‌కు వచ్చినది.కలలో కనిపించిన వారెవరో,ఎక్కడ ఉంటారో తెలియక మ ధనపడుతుడేవారు. స్వప్నములో పొందిన ఆ మంత్రమును చేస్తూనే సంవత్సరకాలము గడిపిరి.శ్రీరామనామక్షేత్రములోజ రుగుచున్న ఉత్సవములను చూడటానికి ఒక భక్తురాలితో కలసి గుంటూరు వెళ్లిరి. అచట శ్రీరామశరణ్ గురుదేవులను చూచి ఆశ్చర్యపడిరి. ఎందుకంటే స్వప్నములో మంత్రోపదేశము చేసినవారు, వీరు ఒక్కరే! గురుదేవులను దర్శించి నమస్కరించిరి.అప్పుడు వారు వెంటనే 'అమ్మా,నేను మీఊరు వచ్చి మీయింటి వద్దనే మంత్రోపదేశము చేస్తాను' అని నారు.

మాఘమాసము రథసప్తమినాడు గురుదేవులు తపస్వినమ్మగారి ఇంటికి వచ్చిరి. తరువాత కొద్దిరోజులకు రెండవసారి మరలవచ్చి మంత్రోపదేశము చేసినారు. నాలుగునెలలకు మరలవచ్చి తాముఠచించిన కొన్నిగ్రంథములనిచ్చి చదువమని చెప్పినారు.

మంత్రపురశ్చరణము చేయమని చెప్పి గురుదేవులు స్వయంగా మొదలు పెట్టించినారు. గురుదేవుల అనుగ్రహము వలన కొన్నిఅనుభూతులు కలిగినవి. వారుయిచ్చిన మంత్రములో ఎంతటి శక్తికలదో గురువు ఎందుకు అవసరమో అప్పుడు బాగుగా అర్థమయినది. అది మొదలుగా గురువుగారి యెడ వారికి భక్తి, విశ్వాసములు యినుమడించినవి.

# 2. స్వప్నములో గురుదేవులు తనరాకను తెలుపుట

తపస్వినమ్మ గారికి గురుదేవులు పరిచయమయిన తొలినాళ్లలో ఒకసారి సత్యసాయి భక్తుల ఆహ్వానము మేరకు గురుదేవులు తెనాలిలో ఉపన్యాసములకు వచ్చేముందు రోజు తపస్వినమ్మ గారికి కలలో కనిపించి 'రేపు సాయంకాలము శ్రీరామశరణ్ గారి ఉపన్యాసము మీఊరిలోనున్నది. దానినిమిత్తము వారు వచ్చుచున్నారు. వారికి

ఆచారము ఎక్కువ. ఎక్కడ భోజనము చేయరు. మీరు వంట సిద్ధము చేసి వారిని తీసికొని రండి.' అని ఎవరో చెప్పినారు.

తపస్వినమ్మగారు దానిని మామూలు కలగానే భావించినారు. మరునాడు సాయంత్రము కార్యకర్తలు వీరిల్లు వెదకుతు వచ్చి 'శ్రీరామశరణ్ గారు యిక్కడికి వస్తున్నారు' అని ఉత్తరము చూపించినారు. రాత్రి కలిగిన స్వప్నము, ఈఉత్తరము ఒకేరకముగా ఉండడము తపస్వినమ్మగారికి చాల ఆశ్చర్యము కలిగించినది.

తపస్వినమ్మగారు తండ్రిగారితో కలసి గురుదేవులను చూచుటకు ఉపన్యాసము జరుగుచున్న ప్రదేశానికి వెళ్లిరి. గురుదేవులు రేపల్లె నుండి నేరుగా అచటికి వచ్చిరి. ఉపన్యాసానంతరం వీరు గురుదేవులను తీసికొని యింటికి వచ్చిరి.

'మీరు వచ్చిన సంగతి మాకు కార్యకర్తల ద్వారా తెలిసినది. మీరు ఉత్తరము వ్రాయలేదు' అనగా 'మొదట మీ యింటికే వచ్చివెడదామని అనుకొన్నాను. బండి ఆలస్యమైనది. అయినా రాత్రి మీకు కబురు పంపినాను!' అని గురుదేవులు పలికిరి. గురుదేవుల మహిమ తెలియని తపస్వినమ్మగారు తలవంచుకొనిరి. అలా బేలగా అడిగినందుకు లజ్జించిరి. తాను పిలవకయే తన యింటికి రావలెనన్న తన కోరికను గురుదేవులు ఆవిధముగా తీర్చినారు!

# 3.‘గురుదేవులకు నమస్కరించాలని తెలియదు’

గురువుద్వారా మంత్రోపదేశము కానిదే పెద్దగా ఉపయోగము లేదు అని పెద్దలమాట. కనుక గురుముఖత: మంత్రోపదేశము కావాలి అని తపస్వినమ్మ గారు ఆరాటపడినారు. గురుదేవులవద్ద మంత్రోపదేశము పొంది మంత్రజపము చేయుచున్నారు. కాని గురువుగారి యెడ భక్తి,గౌరవము కల్గిఉండవలెనని వీరు పెద్దగా భావించలేదు. చిన్ననాటి నుండి కడుగారాబముగా పెరిగినారు. పెద్దలను గౌరవించటం తెలియదు. అటువంటి రోజులలో ఒక పర్యాయము అర్థరాత్రివేళ గురుదేవులు వీరింటికి వచ్చినారు. వచ్చిన గురుదేవులను వీరి తల్లిదండ్రులు ఆహ్వానించి వారికి కావలసిన యేర్పాట్లు చేసినారు. మెలకువగా ఉన్నా, గురువుగారికి నమస్కరించక పట్టనట్లు మిన్నకున్నారు. గురువుగారు తెల్లవారుఝామున వెళ్లేటప్పుడు తల్లితండ్రులు లేప లేదు! తరువాత గురుదేవులు వచ్చినారని చెప్పినారేగాని లేచి నమస్కరించలేదేమని మందలించలేదు. పెద్దల పెంపకములో యిట్టిలోపములు జరుగుచుండును. దయాసముద్రులుగాన గురుదేవులు ఈ అవినయమును పట్టించుకొనలేదు. మరల కొద్దిరోజులకు వీరింటికి వచ్చి తపస్వినమ్మగారిని ఆప్యాయతగా పలకరించి ‘జపము చేస్తున్నావా?’ అని అడిగి ‘రెండవపూట కూడ జపము చెయ్యమని’ చెప్పిరి.

గురుదేవులు చెప్పినట్లు సాయంకాలము కూడ జపము చేయుచున్నారు. వీరిలో క్రమముగా మార్పువచ్చి గురుదేవులనెప్పుడు చూద్దామా అనే ఆరాటం ఎక్కువయినది. గురువుగారి పట్ల భక్తి,గౌరవము కలిగినది. అది మొదలుగా గురువుగారిని చూడనిదే ఉండలేకపోయేవారు. గురుదేవులును తరచు వీరింటికి వచ్చి దర్శనము ఇచ్చేవారు.

“ నా జీవితములో వారి పట్ల నాఅపరాధము లెన్నటికి మరువలేను. ఆ మహానుభావుడు నాతప్పును క్షమించి నన్ను ప్రేమగా చూచినారంటే వారి హృదయౌన్నత్యము ఎంతటిదో కదా” అని అనుకుంటూ ఉంటారు తపస్వినమ్మ గారు.

# 4.నేను కాషామరంగు గుడ్డలు ధరించిన సాధువును గాను!

తెనాలి తాలూకా హైస్కూలు లో మూడురోజులు జరిగిన సాధుపరిషత్తు సభలకు గురుదేవులు కూడ వచ్చినారు. వారు వేదిక క్రింద కొందరు పెద్దలతో కలసి కూర్చున్నారు. ఆ సభలను చూడటానికి వెళ్లిన తపస్వినమ్మగారిని చూచిన గురువుగారి ముఖము దేదీప్యమానముగా వెలిగినది. గురువుగారి రాక వీరికి తెలిమదు. దగ్గరకు వెళ్లి నమస్కరించి పలకరిద్దామంటే అన్నివేలమందిలో సాధ్యపడలేదు. గురువుగారు ‘మనింటికి రాలేదే! ఎక్కడ దిగి ఉంటారు. మన అపచారము ఏమిటి?’ అని ఈవిధంగా మనస్సు పరిపరి విధాల మధనపడసాగెను. సభలో ప్రసంగించు వారి ఉపన్యాసములేవి వీరి చెవికెక్క లేదు. ధ్యాస అంతయూ గురుదేవుల గురించియే’. సభచాలించిన తరువాత అంత జన సమ్మర్దములో గురువుగారి వద్దకు వెళ్లలేక పోయిరి కాని ఆశ్చర్యము గురువుగారే వారి ముందు నిలిచిరి !

పలకరించి 'దగ్గరలోనే తెలిసినవారుంటే వారింట బసచేశాను. రేపు ఉదయం ఆరుగంటల బండికి తణుకు వెళ్లవలసి వున్నది. నీవు ఆరు గంటలలోపే భోజనము పెడితే మీయింటికి వస్తాను.' అని వారితో చెప్పినారు. 'అలాగే రమ్మ'ని గురుదేవులనాహ్వానించిరి.మరునాడు ఉదయము దుగంటలకే గురుదేవులు వీరింటికి వచ్చి భోజనము చేసి వీరికి ఆనందము కలిగించిరి . ' గురుదేవా, మీరు వేదిక నలంక రించలేదేమి?' అని ప్రశ్నించగా నవ్వి ' నేను కాషాయరంగు గుడ్డలు ధరించిన సాధువును కానుకదా! కాషాయరంగు వస్త్రములు ధరించినవారు,గృహస్థధర్మము విడిచినవారు ఆ వేదిక మీదకు రావలయును.నేను గృహస్థుడను.' అని చెప్పిరి.

# 5.గాయములో రామదర్శనము

గురుదేవులు తపస్వినమ్మగారింటికి వచ్చి చాలదినములు గడిచినవి.వారు ఎచటనున్నది తెలియలేదు .ప్రతిదినము గురుదేవుల రాకకొరకు ఎదురు చూచుచున్న వీరికి ఒకరోజున గురుదేవుల వద్దనుండి జాబువచ్చినది. తాము తణుకులో ఉన్నట్లును, నడవలేని స్థితిలో నున్నట్లును పెద్దబండ కాలిమీద పడి దెబ్బతగిలినదియు, కొద్దిరోజులలో రాగలనని ఆ ఉత్తరము సారాంశము. మరునాడు గురుదేవులను చూడటానికి వెళ్లవలెనని తలచిరి.కాని ఆరాత్రి తపస్వినమ్మగారికి స్వప్నమున గురుదేవులు సాక్షాత్కరించి, 'అమ్మాయీ! నీవు ఆందోళన చెందవద్దు.నాకుచాలవరకు బాధ తగ్గినది.నేను రాధాష్టమికి బుద్దాం వస్తున్నాను.నీవు రావలదు' అని చెప్పి వారి కాలికి తగిలిన దెబ్బను చూపించిరి.అచట రెండు అంగుళముల కోదండరాముని చూపించిరి.అదేసమయమందు వీరి తల్లిగారికిని గురుదేవులు దర్శనమిచ్చిరి. బుద్దాం వెళ్లినప్పుడు తపస్వినమ్మగారి మనస్సులోని ఆలోచనను గమనించి కట్టువిప్పి గురుదేవులు గాయమును చూపి , 'చాల భాగము నయమైనది' అనిరి. అప్పుడు కూడ ఆప్రదేశమున వీరికి రామదర్శనమైనది.గురుదేవులు చెప్పిన మాట వీరికి జ్ఞప్తికి వచ్చినది. " రామనామముతో ఏరిన బియ్యమును అన్నమురూపముగా భుజించినచో రోమరోమమున రాముడే ఉండును." తాము రామదర్శనము చేయుటయేగాక ఇతరులకు రామదర్శనము చేయించగల మహా మహితాత్ములు మన గురుదేవుల!

# 6.మోకాలి పై కురుపు లేచింది....రాలేను!

ఒక పర్యాయము కృష్ణా పుష్కరములు వచ్చినవి.తపస్వినమ్మగారు అమరావతి వెళ్లబోవుచుండగా 'నేనుకూడ వస్తాను. నీవు ముందుగా వెళ్లి, ఉండటానికి బసయేర్పాటు చేయ' మని గురుదేవులు ఆమెతో చెప్పిరి.వీరు అమరావతిలో గురువుగారికి బసయేర్పాటు చేసి వారి రాకకొరకు ఎదురుచూచుచుండిరి.గురుదుగారు రాలేదు. తపస్వినమ్మగారికి గాభరా వేసి తిరిగి వద్దామనుకొనిరి. ఆరోజు రాత్రి కలలో కనిపించి 'నాకు మోకాలుమీద కురుపులేచింది,రాలేక విజయవాడలో ఉన్నాను.నీవు వైకుంఠపురము వెళ్లి స్వామిని దర్శించి తిరిగిరమ్మ'ని చెప్పిరి.

తపస్వినమ్మగారికి నమ్మశక్యము గాక విజయవాడ వెళ్లి గురుదేవులను దర్శించిరి. కలలో చెప్పినట్లే ఉండటము చూచి ఆమె ఆశ్చర్యచకిత అయ్యెను!

# 7.విషజ్వర పీడితయైనపుడు గురుకృప!

ఒకమారు తపస్వినమ్మగారికి విషజ్వరము వచ్చి సుమారు నెలా పదునైదు దినములు బాధపడిరి. గురుదేవుల అనుగ్రహములో స్వస్థత కలుగునని నమ్మి,ఔషధములను వాడలేదు.హోమియో మందులు మాత్రం వాడుచుండిరి. ప్రతిదినము 104 డిగ్రీల జ్వరం, డొక్కలో పోటు. అప్పుడు గురుదేవులు శస్త్రచికిత్స తర్వాత రామనామక్షేత్రములో ఉన్నారు .

తపస్వినమ్మగారి జ్వరము గురించి తెలిసి వారి యోగక్షేమములను విచారించుచుండిరి.జ్వరము తగ్గుముఖము పట్టలేదు. నోట మాటకూడరాని ఉన్నతపస్వినమ్మగారిని చూడటానికి ఒకమధ్యాహ్నము ఒక శిష్యుని ఆసరాతో వారింటికి వచ్చినారు. నేలమీద ఒక వస్త్రము పరచుకొని పరుండిన వీరిని చూచి గురుదేవులు ప్రక్కనేకూర్చుండి వీరిశరీరముపై హస్తము నుంచిరి.కన్నులు తెరచి 'గురుదేవా,మీరు కష్టపడి నన్నుచూడటానికి వచ్చినారి?' అని బాధపడిరి.గురుదేవులు 'అమ్మా! నిన్ను చూడకపోయినచో నాబ్రతుకెందుకమ్మా! నీవు బాధపడకు. నాకు బాధలేదు.హాయిగా ప్రయాణము చేశాను' అని నారు. సాయంత్రము వరకు ఉండి గురుదేవులు గుంటూరు వెళ్లినారు.గురుదేవుల చల్లని కరస్పర్శకు జ్వర తీవ్రత తగ్గినది! కానీ నీరసముగా ఉన్నది.ఎదుట ఉన్నవారినిగూడ గర్తింపలేకపోయిరి. నడక బాగారాలేదు. గోడలు పట్టుకొని నడచుచున్నారు. గురువుగారిని చూడటానికి సోదరునితోపాటు తాను కూడ వెళ్లిరి. గురుదేవులకు నమస్కరించి కూర్చున్నారు. గురుదేవులు "అమ్మా!నిను చూడటానికి నేను రానా?నీవేల వచ్చినావు?" అని అడిగినారు.కొద్దిసేపయిన తర్వాత అమ్మగారు 'అమ్మాయీ!మడి గట్టుకొని గురువుగారికి వంటచేయు'మనిరి. తపస్వినమ్మగారికి ఏమీపాలుపోలేదు... తమ్ముడు 'తెనాలి వెళ్లాలి' అనెను. 'రేపుఉదయం వెళ్లవచ్చును. అమ్మా!నీకు మడి వస్త్రము లేదుకదా. నాపట్టు వస్త్రము ధరించి వంటచెయ్య'మనిరి. భారమంతా గురువుగారిపై ఉంచి ఆరాత్రి, మరునాటి ఉదయము వీరేవంట చేసిరి. తెనాలి బయలుదేరునప్పటికి బలహీనత తగ్గి నడకమామూలుగా వచ్చినది.మనుష్యులను గుర్తింపగలిగినారు. జ్ఞాపకశక్తి మెరుగైనది.ఇది అంతయు గురుదేవుల అనుగ్రహము తప్ప వేరేమికాదు అని వారిభావన!

# 8.మంత్రజపం - గ్రహపీడానివారణ

తపస్వినమ్మగారికి 38,39 సం॥ వయస్సులో ఒకసారి ఆరోగ్యము పాడైనది.ఒక జ్యోతిష్కుని సంప్రదించగా రాహువు, గురువు, శని గ్రహములకు జపము చేయించినచో ఉపశమనముగా ఉంటుందని చెప్పినారు. తపస్వినమ్ముగారి తండ్రిగారు జపము చేయించబోగా వారు ఒప్పుకోక గురువుగారిచ్చిన మంత్రమును

జపించసాగిరి. నాలుగునెలలు పూర్తి కావచ్చినది. ఒకరోజు రాత్రి వీరికి స్వప్నములో ఆ గ్రహములు వంటయింట్లో పీటలు వేసికొని కూర్చుండిరి. ఒకరు బాగా నల్లగా ఉన్నారు. ముఖము మీద బొట్టులేదు. పట్టువస్త్రములు ధరించినారు. భీకరముగా ఉన్నారు. తపస్వినమ్మగారిని కొరకొర చూచుచు వారివద్దకు రాబోతుండగా ఒక స్త్రీ వచ్చి ఆముగ్గురిని జుట్టు పట్టిలాగి నూతిలో పడవేసినది.

ఆ కలగనిన కొద్దిరోజులకు వారి ఆరోగ్యము కుదుటపడినది. తరువాత ఈవిషయము గురువుగారికి చెప్పగా 'మంత్రముపైన, గురువుపైన విశ్వాసము ఉండడం మంచిదే. కాని రామమంత్రము మోక్షము కొరకే ఉపయోగింపవలెను. వీటి నివారణకు మన ఆంజనేయులున్నాడుకదా!" అనినారు గురుదేవులు అప్పుడు తపస్వినమ్మగారు 'నాకు తెలియక ఆ జపము చేసినాను. ఇకముందు ఎప్పుడు చేయను.' అనినారు. 'తప్పుచేశావని కాదు. రాముడు చేయలెనిది ఏమీలేదు. వారిని మోక్షము ఒక్కటే అడుగవలెను" అని అన్నారు గురుదేవులు.

# 9.గురుదేవులు దంతములు లేకుండా దర్శనమిచ్చుట!

సత్యసాయిబాబా వారు రామాయణప్రవచనము చేయుటకు గురుదేవులను పుట్టపర్తికి ఆహ్వానించిరి. గురుదేవులతో పాటు తపస్వినమ్మగారు కూడ పుట్టపర్తి వెళ్లినారు.ప్రవచనములు పూర్తిఅయిన తరువాత గురువుగారు 'అమ్మాయీ, నేను దసరా పండుగకు వచ్చి నిన్ను తీసికొని వెళతాను. అంతవరకు నీవు ఇచటనే ఉండ'మని చెప్పి తిరుగు ప్రయాణమై వెళ్లినారు.

పండుగ నాలుగు రోజులున్నా యింకను గురువుగారు రాలేదు.ఎందుకు రాలేదోనని కనులుమూసుకొని పరుండిరి. సాయంత్రము అయిదు గంటలకు తపస్వినమ్మగారికి దర్శనమిచ్చి ' రేపు సాయంత్రము పుట్టపర్తిచేరతాను. నాతోపాటు కొందరు శిష్యులు కూడ వచ్చెదరు'అని చెప్పిరి.గురుదేవుల దంతములన్నియు ఊడి దూదిపెట్టినట్లు కనిపించినారు. గురుదేవులు వచ్చిన తరువాత అడుగగా 'పండ్లుపీకించినాను. రక్తము కట్టలేదు. రాత్రిఅంతయు రక్తము కారుచూనే యున్నది. దూది పెట్టినాను' అని చెప్పినారు. గురుదేవులీరీతిగా తమలీలలను చూపించుచుండెడివారు.!

# 10. పుస్తకముల సంచి – గోవర్ధన పర్వతము

గురుదేవులు ఆంధ్రప్రదేశ్‌లో పలు తావులు నామప్రచారమునకు పర్యటించేవారు. అప్పుడు రెండు అరల సంచి ఒకవైపు వంటకు కావలసినవి,రెండవవైపు పుస్తకములు పెట్టుకొని భుజములకు తగిలించుకొని వెళ్లుచుండేవారు. ఆ సంచి సామాన్యులకు ఎత్తలేనంత బరువు ఉండేది. ఒకసారి తపస్వినమ్మ గారింటికి వచ్చినప్పుడు తమసంచిని తీసికొని వచ్చిరి.ఆసంచి నవతల పెట్టుటకు వీరి తండ్రిగారు ఆసంచిని ఎత్తబోయిరి. కాని ఎత్తలేకపోయిరి. అంతబరువు గల ఆసంచిని గురుదేవులు అలవోకగా ఎత్తి మోసుకొని వచ్చెడివారు, బాలకృష్ణుడు గోవర్ధన పర్వతమెత్తిన మాదిరిగా!

# 11. "ఏకభక్తిర్విశిష్యతి"

శ్రీరామశరణ్ గురుదేవులు సర్వదేవతా స్వరూపులు. గురువును ప్రార్థిస్తే దేవతలందర్నీ ప్రార్థించినట్లే. గురువు తలచుకుంటే వారు ఇవ్వలేనిది ఏదీలేదు. అందులకు మన గురుదేవులే గొప్పనిదర్శనము. ఒకమారు తపస్వినమ్మగారు సత్యసాయిబాబా గారికి ఒకలేఖవ్రాసి యిచ్చి ఆవిషయాన్ని గురుదేవులకు చెప్పిరి. గురుదేవులు 'నేను ఉండగా నీవు బాబాగారికి ఉత్తరము వ్రాయవలసిన పని ఏమిటి? నీకు ఏమికావలెనన్నా నేనులేనా?' అనినారు. అది మొదలు మరల యెప్పుడు బాబాగారికి లేఖవ్రాసి అందజేయలేదు.

మరియెకమారు జిల్లెళ్లమూడి అమ్మగారి దర్శనమునకు వెళ్లివచ్చి, మరల జిల్లెళ్లమూడి వెళ్లబోవుచూ గురుదేవులకు తెలిపిరి. అప్పుడు వారు అమ్మగారితో 'మనస్సును ఒక్కదానిపై నిలుపుము. మనస్సును చంచలము కానీయకు. సాధన బాగుగాచేసి గమ్యము చేరటానికి ప్రయత్నము చేయవలె. ఎక్కడో ఏదో ఉన్నదని పరుగులుతీసి కాలమును వ్యర్థపరచకు' అని బోధించారు. అంతే మరల వీరు జిల్లెళ్లమూడి వెళ్లలేదు.

తెనాలి కన్యకా పరమేశ్వరి దేవస్థానములోఉదయము భష్యము సాయంకాలము గీతా ప్రవచనములకు రెండు పూటలా వెళ్లి తపస్వినమ్మగారు శ్రవణము చేసేవారు. ఒక సాయంకాలము వీరు ప్రవచనము శ్రవణము చేయు చుండగా ఒక వృద్ధురాలు గేటులోనుండి ఇసుకవేస్తే రాలని జనసమూహములోనుండి వీరు కూర్చుని ఉన్న చోటికి వచ్చి,వీరి వీపుపై ఛెళ్లుమని చరిచినది. వీరు వెనక్కి చూడగా ఆమె కోపముతో 'ముందు నీవు బయటకు నడు. ఇది నీవు వినరాదు.' అని చెయ్యి పట్టిలాగి వీరిని తనతోపాటు బయటికి తీసికొని వెళ్లినది. వీరికేమీ అర్థము కాలేదు. '....నీవు ఇంతకాలము వ్యర్థము చేసినావు. ఇది వినుట కంటే నీవు ఇంటివద్ద జపము ఎక్కువగా చేసికొనవచ్చును గదా!' అన్నది ఆ వృద్ధురాలు. అడిగినా తానెవరో చెప్పలేదు. 'మీ గురువుగారు శ్రీరామశరణ్ గారు నిన్ను ఇంటివద్ద జపము మానుకొని ఇక్కడకు వచ్చి పురాణములు వినమని చెప్పారా?' అని ప్రశ్నించినది. కొంత దూరము వెళ్లిన తరువాత ఆమె మామూలు మనిషి అయి శాంతముగా కనిపించినది. అప్పుడామె 'అమ్మా మిమ్మల్ని బాధపెట్టినానా? నేను ఏమయినా అని ఉంటే మనసులో పెట్టుకోకండి. నావలన పొరపాటు జరిగి ఉంటే నన్ను మన్నించండి. నేను గేటువరకు వచ్చిన తరువాత అమ్మవారి ప్రేరణతో ఆవిధంగా జరిగినది', అని ఆమె పల్కిన ది! తన ఇంటికి రమ్మని ఆహ్వానించినది. 'మరెప్పుడైనా వస్తాను' అన్నారు తపస్వినమ్మగారు. ఆమె మరల కనబడలేద!

తరువాత కొద్దిరోజులకు గురుదేవులు వీరింటికి వచ్చినప్పుడు ఈవిషయమంతయు వారికి చెప్పిరి. 'ఆమె ఎవరు?' అని అడిగిరి. గురుదేవులు 'ఆ రూపములో రామచంద్రమూర్తి వచ్చి చెప్పి ఉండవచ్చును.

నీకు లోగడ  కొన్ని విషయాలు చెప్పిఉన్నాను కదా! ఇప్పుడైనా మనసు నిల్పిసాధన చెయ్యి.దైవ సన్నిధానం చేరడానికి ప్రయత్నం చేయాలి,' అని బోధించిరి.

గురుదేవులే ఆవృద్ధురాలిని పంపి తనకు ఒక గొప్ప గుణపాఠము నేర్పినారు అని తలచి తరువాత ఎక్కడ ఏమి జరిగినా వెళ్లేవారు కాదు.వీరు ' గురుదేవులే అన్నీ చూచుకొంటారు అని తలచి మనస్సు నిలకడగా నిలుచునట్లు గా చేయమని గురుదేవులను ప్రార్థించినారు

## 12.సలసల మరుగు నూనెలో చెయ్యిపెట్టినా కాలకుండుట!

గురుదేవుల జన్మదినోత్సవములు నాగాయలంకలో జరిగిన సంఘటన.గురుదేవులు తపస్వినమ్మగారిని తైలము కాచమని చెప్పిరి. వీరు కిటికీ క్రిందనే స్టవ్ వెలిగించి తైలము కాచుచున్నారు. కిటికీలో ఉన్న కొన్ని కాగితములను తీయబోగా చెయ్యిజారి స లసలమరిగే నూనెలో పడినవి.వెంటనే వీరు గురుదేవులను స్మరించుచు మరుగుచున్న నూనెలో తన చేతిని పెట్టి కాగితములను పైకితీసిరి. ఆశ్చర్యమేమంటే కాగితములకు నూనె అంటలేదు!చేతికి నూనె అంటింది కాని చేయి కాలలేదు! 'చేయి బొబ్బలెక్కితే మీసేవాభాగ్యము కోల్పోయేదాన్ని. మీ అనుగ్రహము వల్లనే ప్రమాదం కలగలేదు.' అని వీరు గురుదేవులతో అనగా 'కొంచము జాగ్రత్తగా ఉండాలి.ఆ కాగితములు చాలా ముఖ్యమైనవి.' అని గురుదేవులు చెప్పిరి.

## 13 .అట్లకాడ దిగబడిన చేతిలో గాయములేదు!

గురుదేవుల జన్మదినోత్సవము జరిగిన రాత్రివేళ ఒక భక్తునకు కొబ్బరిబోండాం కొట్టి కొబ్బరినీరు ఇవ్వమని గురువుగారు తపస్వినమ్మగారితో చెప్పిరి. అట్లకాడ తో పీచు తీస్తుండగా పొరపాటున అది అరచేతిలో చాలా లోతుగా దిగబడి రక్తం కారసాగింది. ఆచేతిని వెనక్కి పెట్టుకొని మరియెక చేత్తో ఆ భక్తునికి కొబ్బరినీరు యిచ్చినారు. ఇది గమనించిన అమ్మగారు, సీతమ్మగారు భయపడి వైద్యుని వద్దకు తీసికొని వెళ్తామన్నారు. తపస్వినమ్మగారు మాత్రం సర్వాత్మ నా గురువు గారి పై భారము వేసి ఆసుపత్రికి వెళ్లడానికి యిష్టపడలేదు. అమ్మగారు ఆసుపత్రికి వెళ్లవలసినదేనని పట్టుబట్టిరి. అప్పుడు గురుదేవులు,' అమ్మాయి వైద్యుని వద్దకు రాదు. ఏమీకాదులే' అన్నారు.మరునాడు చేతిలో పుండుకాని,బెజ్జము కాని కనిపించలేదు!!అసలు గాయమైన చిన్నెలే లేవ!
గురుదేవుల అనుగ్రహమునకు అవధిలేదు కదా!

## 14.నంగిగడ్డ ప్రయాణము -  గురుదేవుల లీల!

గురుదేవుల జన్మదిన మహోత్సవములు నాగాయలంక సమీపంలోని నంగాగడ్డ అను ఒక పల్లెటూరులో జరిగినవి. ఆఊరికి బస్సు సౌకర్యము లేదు. నాగాయలంక నుండి నడిచి వెళ్లాలి. తపస్వినమ్మగారు రేపల్లెవద్ద పెనుమూడి అక్కడి నుండి నాగాయలంక చేరడానికి లాంచిలో మొదటిసారి ఒంటరిగా ప్రయాణము చేయుచున్నారు. లాంచి కృష్ణా నది మధ్యలోకి వచ్చేసరికి హఠాత్తుగా పెద్దగాలివాన వచ్చి లాంచి నిండా నీరు చేరినది. ప్రయాణికులందరు భయపడినారు. తపస్వినమ్మగారు మాత్రము గురువుగారినే నమ్మి ధైర్యముగా ఉన్నారు. రాత్రి సుమారు పదకొండు గంటలకు నాగాయలంకకు లాంచి సురక్షితముగా చేరింది. అర్ధరాత్రి. చీకటి గాఢాంధకారము. కరెంటులేదు. ఎటువెళ్లాలో దారితెలియదు. ప్రయాణికులంతా ఎవరిదారిన వారు వెళ్లిపోయారు. తపస్వినమ్మగారు ఒక్కరే మిగిలినారు. 'ఎటువెళ్లాలి?'అని అనుకుంటున్న సమయంలో ఇద్దరు వృద్ధదంపతులు దగ్గరకు వచ్చి 'ఎక్కడకి వెళ్లాలి?' అని అడిగిరి. 'నంగిగడ్డ' అను జవాబు చెప్పిరి.

'మాతోరండి ఈఊళ్లో మాబంధువులున్నారు. ఇప్పుడు ఆ ఊరుచేరలేము. మేము కూడ ఆఊరే వెళ్లాలి. ఏమీ భయము వద్దు. మిమ్మల్ని మీగురువువుగారి వద్దకు చేర్చి మేము వెడతాము',అని చెప్పినారు. మనస్సులో భయము ఉన్నా, అంతకుమించి గత్యంతరము లేక వారు ననుసరించిరి. దారి అంతయు మోకాలిలోతు బురద. నడక సాగక కాలు కూరుకొని పోతున్నది. సుమారు మైలు దూరము నడిచిరి. అది ఒక చిన్న గూడెము. మనుష్యులెవరు కనిపించలేదు. ఒక చిన్నపూరిగుడిసె లోపలికి తీసికొని పోయిచిరిగిపోయిన చిన్నపట్టా ఇచ్చి పడుకొమ్మనిరి. తపస్వినమ్మగారి వద్ద పైకము ఉన్నందున నిద్రపట్టలేదు. తెల్లవారేవరకు గురుదేవులను ధ్యానించుచుండిరి. గురుదేవుల దర్శనమయినది. మంచము మీద కాషాయరంగు ఉత్తరీయము కప్పుకొని ఎదురుగా కూర్చుండినట్లు దర్శనమిచ్చినారు. ఆచీకటిలో పెద్దవెలుగు కనిపించినది. ఆయింటి వారివద్ద సెలవు తీసికొని ఆవెలుగు వెంట ధైర్యముగా బయలుదేరిరి. ఊరి పొలిమేరవరకు వచ్చిన ఆ వెలుగు ఆతర్వాత కనిపించలేదు. తేజోరూపముతో గురుదేవులే తపస్వినమ్మగారిని ఊరి పొలిమేరవరకు చేర్చిరన్నమాట! తెలతెల వారుచున్నది. ఇద్దరు ముగ్గురిని అడిగి నంగిగడ్డకు త్రోవకనుక్కొని గురుదేవులకృపతో ఆ ఊరు చేరిరి! గురువుగారిని చూడటానికి వెళ్లినప్పుడు వారే స్వయముగా ఎదురువచ్చి'అమ్మా,రాత్రి అంతయిబ్బంది పడినావు.....నేనుండగా భయమెందుకు?'హరేరామ' మేడలో పడుకొని ఉదయాన రాకపోతివా?'అనిరి. అప్పుడు ఆమె 'ఆమేడ ఎక్కడ ఉన్నదో తెలియదు. అయినా మీరుండగా నాకు భయమెందుకు?' అని బదులిచ్చినారు.

తపస్వినమ్మగారు ఊరు చేరులోపునే గురుదేవులు అచటి శిష్యులతోను,అమ్మగారితో 'అమ్మాయి చాలా ప్రయాసపడి వస్తున్నది. ఉదయానికి ఇక్కడికి చేరుకుంటుంది' అని చెప్పినారట! గురుదేవుల దివ్యదృష్టి ఎంతటిదో , శిష్యులనేవిధంగా వెన్నంటి కాచి రక్షింతురో తెలపటానికి యింతకంటే నిదర్శనమేమి కావలెను?!

# 15. బుద్ధాంలో పురశ్చరణ - దివ్యానుభూతి

తపస్వినమ్మగారు బుద్ధాం గురుదేవుల గృహములో పురశ్చరణ చేయడానికి వెళ్లారు. గురువుగారు ముహూర్తము నిర్ణయించి పుట్టపర్తి వెళ్లినారు. పురశ్చరణ మెదలు పెట్టేరోజుకు రమ్మని గురుదేవులను ప్రార్థించారు.

'సరే' నన్నారు గురుదేవులు.తాను పుర్చరణ ప్రారభించేనాడు గురుదేవులు నిజముగా అంతదూరము నుండి వస్తారనే అనుకున్నారు. తెల్లవారు ఝామున మెలకువ రాలేదు.నాలుగు గంటలకు గురుదేవులు వచ్చి నిద్రలేపి స్నానము చేసి జపము ప్రారంభింపమని చెప్పిరి.కళ్లుతెరచి చూడగా గురుదేవులు కనబడలేదు.అప్పుడు వారు పుట్టపర్తిలో ఉన్నారు.

పురశ్చరణము ప్రారంభించినారు కాని సాగటములేదు. మాలతిరగటంలేదు. ఎంత పయత్నించినా జపము చేయలేకపోయిరి. గురుదేవులను ప్రార్థించగా, ఎదురుగా వచ్చి శిరస్సుపై చేతి నుంచి ఆశీర్వదించినారు.అప్పటి నుండి జపము బాగా సాగినది.

జపము పూర్తి అయిన తరువాత ఆరాత్రి వీరికి స్వప్నము కలిగినది.అందులో పసుపుపచ్చని చీర, ఒంటినిండా ఖరీదైన నగలు ధరించిన పదునాఱు సం॥లు వయస్సు గల అమ్మాయితో గురువుగారు గదిలోపలికి ప్రవేశించిరి. ఈ దృశ్యము చూడగానే తపస్వినమ్మగారికి అజ్ఞానపు పొర గప్పి అపోహపడిరి.వీరిని గది లోపలికి రమ్మని పిలిచినారు. గురుదేవులు మంచముపై పరుండగా తలచెంత ఒక ముసలిబ్రాహ్మణుడు, గురువుగారి వద్ద ఆ అందాలరాశి గదిలో వీరికి కనిపించారు. గురుదేవులు నిలబడి ఎదుగుట ప్రారంభించిరి. మెడలో తులసిమాల,' శ్రీరామ జయ రామ జయ జయ రామ' పసుపు పచ్చని ఉత్తరీయము కప్పుకొని ఉన్నారు. అంతులేకుండా అలా ఎదుగుతూనే ఉన్నారు. పెద్దపెద్ద పాదములు కన్పించినవి. ఆదృశ్యమును చూడలేక తపస్వినమ్మగారు 'నా అపరిధమును క్షమించండి గురుదేవా, మరల ఏనాడు అటువంటి అలోచనలు నాలో కదలకుండునట్లు అనుగ్రహించండి,' అని పరిపరి విధాల ప్రార్థింపగా, యధారూపులై గురుదేవులు ఈమె ఎవరను కుంటివి?మీఅమ్మగారికి లభించిన ఐశ్వర్యము అంతయు ఈమెవల్లనే?' అని వారి సంపత్తి అంతయు చూపిరి! ఆ అమ్మాయి తపస్వినమ్మగారి చేయిపట్టుకొని 'నీకు యివి ఏమీవద్దులే. నీకు కావలసినవి అన్నీ నేను యిస్తాను. నీవు ఆధ్యాత్మిక విషయాలపై దృష్టి నిలుపమ'నిపల్కినది.తపస్వినమ్మగారు కనులు తెరవగా ఎవ్వరూ కనపడలేదు. ఈకలను గూర్చి గురుదేవులు 'ఆ అమ్మాయి సీతాదేవి.తలవైపున కూర్చుండినది ఆంజనేయస్వామి' అని చెప్పిరి. రామచంద్రమూర్తి తానై యుండవలయును కదా!రకూడని ఆలోచన వచ్చినందులకు వీరు పరిపరి విధముల విచారించిరి.అప్పుడు గురుదేవులు 'నీకు ఏపాపము అంటదు.మనస్సు పరిపరి విధములగా పోతుంటుంది.భక్తిని పెంచుకో.భగవన్నామము చేయగా చేయగా మనస్సుదైవముపై నిలచి మంచిఆలోచనలు కలుగుతాయి',అని చెప్పి తమరెండు పాదములను వీరి శిరస్సున ఉంచి ఏపాపము లేకుండునట్లు దీవించిరి!

# 16.గురువాజ్ఞ లేనిదే ఏమియు జరగదు!

శ్రీరామ నవమినాడు లక్షజపము చేయవలెనని సంకల్పించి తపస్వినమ్మగారు జపమును ప్రారంభించినారు. కానీ జపము సాగలేదు.మధాహ్నము శరీరమున నొప్పులు,మాడుపోటు మొదలైనది.అయినా పట్టువీడకుండా ప్రయత్నించినా జపము సాగలేదు. 'ఆపు,ఆపు ' అని శబ్దములు వినిపించినవి. లక్ష్య పెట్టక జపమునాపలేదు.

జ్వరము వచ్చినది.జపమాల తిరుగుటలేదు.అతి కష్టముమీద డెబ్బదివేల జపము సాగింది.'చేయలేవు,ఆపు' మని మరలా మాటలు వినిపించినవి.చేసేదిలేక జపమునాపిరి.

వీరింటికి వచ్చినప్పుడు గురుదేవులకు ఈవిషయమును చెప్పుకొనిరి.'మరి యెప్పుడైనను చేయవచ్చునులే' అని పలికిరి.గురుదేవుల ఆజ్ఞ తీసికొని మరియెకమారు తపస్వినమ్మగారు లక్ష జపము చేసిరి.ఎటువంటి ఇబ్బందులు లేకుండా జపము నిర్విఘ్నముగా పూర్తిచేసిరి. గురువాజ్ఞ లేనిదే ఏమియు చేయలేమని గ్రహించిరి.'ఆపు మనిన పలుకులు బహుశ: గురుదేవులవే అయి ఉండవచ్చును!

# 17.పితృపాదులకు ముక్తిని ప్రసాదించుట!

తపస్వినమ్మగారి తండ్రిగారు అవసానదశలో తొమ్మిది రోజులు ఆసుపత్రిలో ఉన్నారు.తపస్వినమ్మగారు ఆసుపత్రిలోనే 'హరేరామ' నామము పెద్దగా చేస్తుండేవారు.చివరి రోజుఉదయమున 'ఈనామమునాపి ఓంనమో నారాయణమ:' అని చేయండి లని వెనకనుండి ఎవరో వీపున చరిచిమరీ చెప్పినట్లుగా వీరికి తోచింది. రెండవమారు కూడ అవేమాటలు వినిపించినవి. అది గురుదేవుల కంఠస్వరము! గురుదేవులేఇలా చేయమనినారని వెనక్కి తిరిగి చూస్తే ఎవ్వరూ లేరు. 'నారాయణ' మంత్రమును చేసిరి. గురుదేవుల అనుగ్రహము వలన తపస్వినమ్మగారి తండ్రిగారికి వైకుంఠప్రాప్తి కలిగినది!

# 18.కైలాసపర్వతము,పార్వతీపరమేశ్వరుల దర్శనభాగ్యము కలిగించుట.

తపస్వినమ్మగారు మహాశివరాత్రినాడు లక్షజపము చేసిరి.తరువాత మూడవరోజున గురుదేవులు వీరింటికి వచ్చిరి.గురుదేవులతో 'లక్ష,జపము చేసినాను కాని అనుభూతి యేమియు కలుగలేదు,'అని చెప్పినారు. గురుదేవులు విని మిన్నకున్నారు.ఆనాటి రాత్రి పదిగంటలకు గురుదేవుల పాదములకు కొబ్బరినూనె రాచి,కళ్లుమూసుకొని మర్దన చేయుచుండిరి. అంతలో కైలాసపర్వతము,పార్వతీపరమేశ్వరులు,వారిపరివారము ,ప్రమథగణములు,మేళతాళములు, రంగురంగుల దీపకాంతులు....'ఓహ్..'వర్ణింపనలవి కానంతటి వెలుతురుతో ఆపర్వతము వచ్చి గురుదేవుల పాదములవైపు నిలచినది!కన్నులు తెరచినంతనే ఏమీ కనబడలేదు.కూర్చుని ఉన్నప్పుడే ఈదృశ్యము కనిపించినది! 'రాత్రి ఈ విధముగా కనిపించినది. మీరు సర్వజ్ఞులు గురువుగారూ,

వివరించి చెప్పండి', అని కోరగా 'నీకు అనుభూతి ఏదీరాలేదు అనుకుంటివిగదా, అందుచేత దైవము ఆవిధముగా దర్శనము యిచ్చిఉండవచ్చును' అన్నారు గురుదేవులు.

గురుదేవులు తలచుకొనినచో చేయలేనిదేమియులేదు. వారు అఘటన ఘటనా సమర్థులు!

# 19. మకరజ్యోతి వాంఛను తీర్చుట!

శబరిమలై వెళ్లి అయ్యప్పస్వామి మకరజ్యోతి దర్శనము చేయవలెనని తపస్వినమ్మగారికి గాఢమైన వాంఛ! శ్రీరామనామక్షేత్రములో ఉత్సవములలో ఉన్న గురుదేవులను వీరు అనుజ్ఞవేడిరి. గురుదేవులు 'అలాగే వెళ్లిరమ్మ'నిరి. 'గురుదేవా!నేను బలహీనముగా ఉన్నాను. ఎక్కువ దూరము నడవాలిట, మీరు శక్తినిచ్చేయెడల వెళ్లివస్తాను' అన్నారు. 'నీవు అందరికంటే బాగానే నడవగలవు,' అని నవ్విరి.

వీరి స్నేహితురాలు 'మణెమ్మ'గారు అప్పటికే దీక్షలో ఉన్నారు. మర్నాడు తపస్వినమ్మగారు దీక్షతీసికొని, బస్సుకు టిక్కెట్ రిజర్వేషను చేయించుకొని వీరిద్దరు కలసి వెళ్లవలసి ఉన్నది. ఆరాత్రి చాల విచిత్రము జరిగినది. ఆరాత్రి నుండి తెల్లవారు నంతవరకు గురుదేవుల హృదయము మొదలుకొని వారి శిరస్సువరకు గిరగిర తిరుగుచు కొంతసేపు గురుదేవుల రూపము,మరి కొంతసేపు జ్యోతిగను తిరుగుచునే కనిపించుచుండిరి!కన్నులు మూసిన,తెరచిన,కూర్చున్న అదే దృశ్యము!ఆరాత్రి అంతా క్షణము కూడ తెరపిలేక ఇదే దృశ్యము కనబడుచున్నది. క్షణకాలమైనా తపస్వినమ్మగారికి కంటిమీర కునుకులేదు. తలపోటు వచ్చినది. శరీరమంతా వేడిగాఉన్నది.ఏమీతోచలేదు. ఉదయాన దీక్షతీసికొనడానికి దీక్షనిచ్చేవారివద్దకు వెళ్లినారు. ఆదీక్షనిచ్చే గురువు అచటలేరు. గురువుగారి వద్దకు వచ్చి విషయమంతా చెప్పి "మీరు మనస్ఫూర్తిగా వెళ్లమంటే వెళతాను. లేకపోతే మానేస్తాను" అని అడిగిరి. గురువుగారు మౌనము వహించారు. భక్తులు, శిష్యులు గురువుగారి దర్శనముకొరకు వచ్చినారు. తపస్వినమ్మగారు బయటకు వెళ్లిరి. రాత్రి పదిగంటలకు కబురురాగా ఆమె గురుదేవుల వద్దకు వెళ్లిరి. గురుదేవులు మాత్రమే ఉన్నారు.'నీకు అనుజ్ఞ యివ్వలేదని బాధగాఉందా?ఆమెముందు ఏమి చెప్పినా ఆమె బాధపడి నీప్రయాణము నేను ఆపినట్లు బాధపడుతుంది.నేను ఉండగా నీకు ఆశ్రమ ఎందుకు? నిన్ను కొద్దిరోజులలో అవతారమూర్తి,సాక్షాత్తు శ్రీరామచంద్రమూర్తి యే అయిన సత్యసాయిబాబా దర్శనము చేయిస్తాను' అని తపస్వినమ్మగారితో గురుదేవులు చెప్పినారు.

సర్వదేవతలు గురువులోనే ఉంటారను భావనను తెలియజేయుటకు గురుదేవులు తుము జ్యోతి రూపమున కనిపించిరి.'మనస్సు నిలకడలేక గొప్పదేవతలుంటారని ఎక్కడెక్కడో తిరుగుచు ఒక్కదానిపై మనస్సు నిలపలేని తన లాంటివారికి గురుదేవులు చక్కని పాఠము నేర్పినారని,తనను నమ్మినవారికి ముక్తినిచ్చు భారము తానే వహింతునని నిరూపించి జ్యోతి రూపమున సాక్షాత్కరించినార'ని తపస్వినమ్మగారు తలచిరి.

# 20.తలచిన తోడనే ప్రత్యక్షమగుట!

తపస్వినమ్మగారు ఒకమారు గురుదేవులను వారింటికి రమ్మని ప్రార్థించిరి.గురుదేవులు వీలును బట్టి వస్తాననిరి. నాలుగైదు రోజుల తర్వాత ఒకనాటి రాత్రి ఒంటిగంటకు విజయవాడనుండి గురుదేవులు వీరింటికి వచ్చిరి. గురుదేవులు ఎఱ్ఱని పండితశాలువా కప్పుకొనిరి.వారి దేహచ్ఛాయ బంగారు కాంతితో మెరిసిపోతున్నది. నవ్వుకొనుచు గురుదేవులు లోనికి వచ్చిరి. ఆరాత్రిచూచినట్లు గురువుగారిని మరియెన్నడును చూడలేదు. వచ్చినవారు గురుదేవులా లేక రామ చంద్రమూర్తియా అనిపించినది! తపస్వినమ్మగారు గురుదేవులతో 'ఇంత రాత్రి వరకు ఉండకుండా వెలుతురు ఉండగానే రావచ్చుగదా,గురువుగారూ,మీకు చూపుకూడ బాగా కనిపించదుగదా', అనినారు.

'ఫలహారము చేసి పడుకున్నాను. నిద్రపట్టలేదు. రేపు తణుకు వెళ్లాలి.నీవద్దకు రాకుండా వెడితే నీకు బాధ కలుగుతుంది.తెల్లవారి వెళ్లవచ్చని ఎంత ప్రయత్నించినా మనస్సు ఆగలేదు,' అని గురుదేవులు చెప్పిరి. **గురుదేవుల హృదయము శిష్యవాత్సల్యముతో నిండివుంటుంది అనడానికిదియే నిదర్శనము.**

# 21.పుట్టపర్తి ప్రయాణము - గురుదేవుల లీల!

గురుదేవులు,అమ్మగారు,తపస్వినమ్మగారు,మరికొందరు కలసి పుట్టపర్తికి బయలుదేరినారు.గుంతకల్లులో బండిదిగి అనంతపురం వెళ్లడానికి బస్సుదొరకక లారీలో ప్రయాణించవలసి వచ్చింది.ముందే డబ్బు వసూలు చేసుకొని లారీ ఎక్కించుకొనిరి.ముందు భాగము పైన తడిక వేసి ఉన్నది.దానిపై వీరంతా కూర్చున్నారు.క్రింద సారా సీసాలు ఉన్నవేమో! సారావాసన భరింపరానిదై ఉన్నది.అది సారా తోలు లారీ అట!అచ్చటచ్చట లారీని ఆపి గొఱ్ఱెలు,మేకలు, గడ్డిమోపులు, బస్తాలు వేశారు. కాలు కదపటానికి కూడ జాగాలేదు.లారీలో ఎక్కిన వారిలో కొందరు తప్పత్రాగి మాట్లాడు చున్నారు.

'అయ్యోతెలియక ఈలారీ ఎక్కినామే! దిగిపోదా'మను కొన్నను లారీ ఆపడంలేదు. మధ్యలో 'దొంగలున్నారు జాగ్రత్త' అని హెచ్చరిక చేస్తున్నారు. అమ్మగారి ఒంటిమీద విలువైన నగలున్నవి.తపస్వినమ్మగారు భయపడి గురుదేవులతో 'మనమిపుడు ఏమి చేద్దాము?' అన్నారు.గురుదేవులు నవ్వి 'నేను ఆడదానినే కదాష' అని చమత్కరించిరి. మిగిలినవారు 'గురుదేవులుండగా మనకు భయమెందుకు?' అని తలచినారు.సారావాసనకు

బదులు జామపండ్ల వాసన వస్తున్నది. లారీలో ఉన్నవారికి గురుదేవులు ఎలాకనిపించారో ఏమో తెలియదు గాని అది మొదలుకొని గురుదేవులకు నమస్కరించుచున్నారు. గురుదేవులు, 'మీరంతా భయపడ్డారెందుకు? అండగా మనరాముడుండగా భయపడవలసిన పని లేదు.' అన్నారు. అనంతపురంలో లారీ ఆగింది. గురుదేవులను ఎత్తుకొని క్రిందికి దింపి నమస్కరించి వెళ్లిపోయారు. గురుమహిమ తెలియక భయపడినారు. గురుదేవులు వీరి భ యమును ఆవిధముగా పోగొట్టినారు!

# 22. బస్టాండు - సత్సంగ గోష్ఠికి వేదిక

సత్యసాయిబాబా వారి దర్శనమునకు పుట్టపర్తి వెళ్లడానికి టిక్కెట్టు రిజర్వేషన్ అయినది. గురుదేవులు శ్రీరామ నామ క్షేత్రము నుండి, తపస్వినమ్మగారు, బృందం తెనాలి నుండి బస్టాండుకు చేరునట్లు అనుకొనిరి. తెనాలి నుండి తపస్వినమ్మగారు, బృందం బస్టాండు చేరుకున్నారు . బస్సుబయలుదేరు సమయము అయినది . గురువుగారు రాలేదు. బస్సు బయలుదేరుటకు కొద్దినిమిషముల ముందు ఒకమనిషి ద్వారా కబురు వచ్చిన. 'ప్రస్తుతము పుట్టపర్తి ప్రయాణం లేదు. మరెప్పుడయినా వెళ్లవచ్చు. టిక్కెట్లు అమ్మేసి తిరిగివచ్చేయండి' అని. టిక్కెట్టు అమ్మితే డబ్బు దండగ అవుతుందేమో అని తపస్వినమ్మగారి ఆలోచనకు భిన్నంగా ఒకామె వచ్చి వీరి టిక్కెట్టు కొనుకున్నారు. మిగిలిన మూడు టిక్కెట్లకు డబ్బు కొంత కోల్పోవలసి వచ్చింది. బస్టాండుకు గంట ముందుగానే చేరుకున్నందున తపస్వినమ్మగారు ఆమె బృందం వారికి నడుమ జరిగిన ఆధ్యాత్మిక సారాంశము.

' రాముడు గొప్పవాడా, రామనామము గొప్పదా' అని.

' రాముని కంటే రామనామము గొప్పది. ఎందుచేతనంటే రాముని ఆయన దగ్గర ఉన్నవారే చూడగలర. రామ నామమును అన్నిలోకాలవారు జపించి తరింతురు. మన హృదయమున నిరంతరము రామనామమును స్మరించిన ముక్తి కలుగును. అట్లే మన గురుదేవులు ఎంతదూరమునున్నను గురునామమును స్మరించిన వారు మనకు దగ్గర అవుతారు. గురుదర్శనము చేయలేదని కాని, మనకు దగ్గరలేరని కాని బాధపడక గురునామమును స్మరించిన గురుదేవుల అనుగ్రహము కలుగును. ' ఇది తపస్వినమ్మగారి ప్రసంగ సారాంశము. ఇంకను అనేక ఆధ్యాత్మిక విషయాలు చర్చించుకొనిరి. గురుదేవుల కబురందుకొని శ్రీరామనామక్షేత్రమునకు వెళ్లి గురుదేవులను దర్శించిరి.

గురుదేవులు తపస్వినమ్మగారిని చూచి, 'అమ్మా, ప్రయాణము ఆగి పోయినదని బాధగాఉన్నదా? యింకెప్పుడైనా వెళ్లవచ్చు. నీకు డబ్బు నష్టము లేకుండా వచ్చింది కదా!' అన్నారు. తపస్వినమ్మగారు సిగ్గుపడి తలది ంచుకొని 'క్షమించండి' అని ప్రాధేయపడినారు.

గురువుగారు 'దానికేముంది, ఎవరైనా ఆలోచించేదే. మన ప్రయాణంమంతా స్వామి దయపై ఆధారపడి ఉంటుంది.' అన్నారు.

తణుకు శాస్త్రిగారు పెద్దగా ఏడ్చి గురువుగారి పాదములపై బడి 'నేను పుట్టపర్తి వెళ్లలేదని బాధపడలేదు. ప్రయాణానికి ముందే రావడంవలన నాకు మంచి అవకాశం వచ్చింది.నేను, తపస్వినిగారు చాలా లోతైన విషయాలు మాట్లాడినాము,' అనగా గురుదేవులు నవ్వి 'ఏదిచేసినా దైవము మన మంచికే అను నమ్మకము కలుగవలెను. ప్రయాణము ఆగిపోవుట, ముందేవచ్చి సత్సంగం చేయడం ముఖ్యమైన విషయాలు కొన్నిటిని తెలుసుకొనడానికి వీలయింది,' 'మీరు ఎప్పుడూ సత్సంగం చేస్తూ ఉండండి.తెలియని విషయాలను తెలిసికొనటానికి వీలవుతుంది. భక్తి, విశ్వాసము, జ్ఞానము పెరుగుతుంది. సత్సంగము ముక్తిని పొందటానికి తోడ్పడుతుంది.నా సంకల్పము లేనిదే అంతసేపు బస్టాండులో కూర్చుని ఆధ్యాత్మిక విషయాలు మాట్లాడలేరు,' అని అనినారు.

# 23. హనుమంతుడు గమ్యస్థానమునకు చేర్చుట!

గురుదేవులు, తపస్వినమ్మ గారు పుట్టపర్తిలో ఉన్నరోజులలో ఒకరాత్రి కలలో ఇద్దరు చోరులు తపస్వినమ్మగారిని బలవంతముగా తీసికొని వెళ్లడానికి ప్రయత్నించినారు. వీరికి చాల భయము కల్గినది. ఇంతలో గురుదేవులు వచ్చి వీరి చేతిని పట్టుకొని లాగి తనవెంట తీసికొని వెడుతున్నారు.అది ఒక పెద్దఅడవి. మానవ సంచారము లేదు. కటిక చీకటి. ఎవరో పిలిచినట్లు వినిపించి వెనుకకు చూడగా ఒక చిన్నగుడిసెలో పొడవాటి గడ్డముగల ఒక వృద్ధుడు ముఖమున నామాలతో కనిపించి, 'సిద్ధులు ఇస్తాను,రా,' అని పిలిచెను. తపస్వినమ్మగారు వెళ్లబోగా,గురుదేవులు'ఈ అడవిలో ఎక్కడికి వెళ్లడం?....అయినా మనము వెళ్లవలసిన చోటు అదిగాదు!అని చెప్పి మరొకవైపు నడక సాగించారు. కొంతదూరము వెళ్లగా ఆకాశము నుండి ఒక పెద్ద రాతి రథము క్రిందికిదిగింది.దాని చక్రములు నేలను తాకడంలేదు.గుఱ్ఱములు రాతివే! అందులో కూర్చుండటానికి రాతి కుర్చీలు ఉన్నవి. ఆంజనేయస్వామి కిరీటము, మెడలో ఆభరనములు, తెల్లని పట్టువస్త్రములు ధరించి ఆజానుబాహువుగా ఉన్నారు. చేతిలో గద ఉంది. రథముపైనుండి దిగి గురుదేవులను రథము ఎక్కవలసినదిగా కోరారు. 'మీరు వెళ్లవలసిన చోటుకు నేను చేర్చెదను' అని స్వామి పలికిరి. ముందు గురుదేవులు, తర్వాత తపస్వినమ్మగారు ఇద్దరు రథము నెక్కిరి. భూమ్యాకాశముల మధ్య రథము వేగముగా సాగుచున్నది.పలురకాల అడవులు, కొండలు దాటి ఒక పెద్దకొంబపై రథము ఆగినది. వీరిద్దరు కొండపై దిగిరి. రథము స్వామి మాయమయ్యెను! కొండపై చాల విశ్రాంతిగా ఉన్నది. చిన్నగుడి మాత్రం ఉంది.అందు ఒక స్త్రీ కనిపించినది. గురుదేవుల చేతిలో 'శ్రీరామ జయరామ జయజయరామ' వ్రాసిన నీలపు సంచి ఉంది.

తెల్లని వస్త్రాలు ధరించిన ఒక బ్రాహ్మణుడు వచ్చి 'మీరు దిగవలసిన చోటుయిది' అని గురువుగారికి నమస్కరించినాడు .'ఇక్కడ వస్తువులేమీ లేవు. మనుష్యులు ఉన్నట్లు లేదు. మాగురువుగారికి వంట ఎలాచేయను. రామ నామముతో ఏరిన బియ్యముతో వండిన అన్నము కాని తినరు,' అన్నారామె. ఆబ్రాహ్మణుడు చిన్నభరిణెలో ఉన్న బియ్యమును మంత్రించి వీరు నిలబడిన చోటు అంతటా చల్లి'మీకు

బియ్యము తో పనిలేదు' అని చెప్పి అంతర్థానమైరి! తర్వాత గురువుగారు, 'సాధనచేసేటప్పుడు అనేక ఆటంకములు కలుగుతుంటవి. వాటికి మనము లోను కాకూడదు. ధ్యేయమునకు వెళ్లేంతవరకు సాధన చేయాలి. అడవి మధ్యలో మనల్ని పిలవడం ఆటంకములకొరకే!వారిని కాదని మనము ముందుకు సాగితే హనుమంతుడు వచ్చి మనలను చేరవలసిన గమ్యమునకు చేర్చును!ఆరీతిగా ధ్యేయమును వదలక సాధన చేస్తున్నయెడల దైవము కడకు చేర్చెదరు!ఈనమ్మకముతో సాధన చేయాలి' అని బోధించారు.

'గురుదేవా,ఇది కల.నిజముగా మీరు ఎక్కడికి వెళ్లినా నన్నుకూడ తీసికొని వెడతారా?' అని ఆమె అడిగారు. "కొన్నికలలు చాల విచిత్రముగా నుండును.కొన్నికలలు నిజము కావచ్చు.నిన్ను తప్పక నాతో తీసికొని వెళతాను' అని గురుదేవులు తపస్వినమ్మగారితో చెప్పిరి.

ఇచ్చిన మాట ప్రకారం గురుదేవులు దేహము చాలించిన పన్నెండవ దినము రాత్రి ఎనిమిది గంటలకు తపస్నిమ్మ గారికి కనిపించి 'నేను వెళ్లిపోతున్నాను. నీవు వస్తావా?' అని అడిగినారు.వారి వెనుక సీతారామలక్ష్మణులు ఉన్నారు. గురుదేవులకు, రామచంద్రమూర్తికి మధ్యనుండి ఒక పెద్దముత్తైదువ వచ్చి వీరి తల్లిగారిని చూడవలెనని ఆమెవద్దకు వెళ్లినది.గురుదేవులు దేహము చాలించారను వార్తవిని తపస్వినమ్మగారి తల్లిగారు చాలబాధపడిరి.ఆమెకు మాట పోయినది.ధారకము పోవుటలేదు. గురుదేవులకు మంచములో ఉన్న తల్లిని చూపించి 'అమ్మ పరిస్థితి ఇలా ఉన్నది . ఎలా రాగలను?' అన్నారు ఆమె...తరువాత కొద్దిరోజులకే తపస్వినమ్మగారి తల్లిగారు దేహఎము చాలించినారు.

## 24.నాటకములో హనుమంతుని వేషమును జ్ఞాపకము చేసుకొన్నప్పటి లీల!

గురుదేవుల కుమారుడు స్వర్గస్థులయిన పదకొండవ రోజున గురుదేవులు అక్కడ ఉన్న శిష్యులతో తాము ఒంగోలులో నాటకము వేసినప్పటి సంగతులను గూర్చి చెప్పిరి. సీతాదేవికి హనుమంతుడు ముద్రిక నిచ్చేఘట్టము. హనుమంతుడు వేషము వేసే నటుడు రాలేదు.ఆపాత్రను గురుదేవులు వేసినారు. గురుదేవులు ఆంజనేయస్వామి వేషం వేసికొని ఒక చెట్టుకొమ్మనెక్కి అక్కడి నుండి క్రిందికి దూకిరి. నాటకమును చూస్తున్నవారంతా ఒక్కసారిగా గాభరా పడినారు.కాని ఇంతలోనే గదాధారి యై సీతమ్మవద్దకు వచ్చి రామనామము చేయసాగిరి!అందరికి ఆశ్చర్యము కలిగి ఎక్కడి వారక్కడే కూర్చుని నాటకమును ఆసాంతము చూచి ప్రశంసించిరి. గురుదేవులను కొద్దిమంది మాత్రమే గుర్తించారు. హనుమంతుని ఉపాసించిన వారికి ఆయన ఎప్పుడు పిలిచిన అప్పుడు వచ్చి వారికి సాయపడును. అని ఈరీతి గురుదేవులు చెప్పుచు మంచముమీదినుండి ఒక్కసారి లేచి హనుమంతుని మాదిరి గంతులు వేయసాగారు. వారికాళ్ల గజ్జెలు ఘల్లుఘల్లు మన్నవి.ఒకమెరుపు మెరిసినట్లయింది,రెండునిమిషములు ఈలీలను అచట ఉన్నవారికి చూపించినారు. గురుదేవులు చూపిన ఈలీలను చూసిన ధన్యులలో తపస్వినమ్మగారు కూడ ఒకరు!

# 25.జ్యోతిరూప గమనము - గురుదేవుల లీల!

గురుదేవులు యోగము నందు నిష్ణాతులు. ఒకమారు తపస్వినమ్మగారు గురుదేవుల పాదములను వత్తుచున్నారు. రాత్రిపన్నెండు దాటినది. ఎంతసేపటికి గురుదేవులు 'చాలు' అనలేదు. వారికి కొంచము అలసటగా ఉన్నది. కాని గురుదేవులు చెప్పలేదు గదా యని రాత్రి రెండుగంటలవరకు అట్లాగే కూర్చున్నారు. గురుదేవులను చూచినారు. శ్వాస లేదు,కదలిక లేదు. ఏమియుతోచక రామనామము చేస్తూ అలాగే కూర్చున్నారు. కొంతసేపటికి వారి ఇంటివాకిటనుండి చిన్నజ్యోతి(వెలుగు) వచ్చి గురుదేవులలో ప్రవేశించినది. వెంటనే చేతనావస్థకు వచ్చి గురుదేవులు ,'అమ్మా,చాల ప్రొద్దు పోయినది. ఇంకచాలు' నన్నారు.

తెల్లవారిన తరువాత ఆజ్యోతిని గూర్చి తపస్వినమ్మగారు గురుదేవుల నడిగారు. వారు మాట్లాడలేదు. మరల ప్రశ్నించారు. 'నీవు భ్రమపడి ఉండవచ్చు. ఏవేవో జరుగుతుంటవి' అని మౌనము వహించారు.

గురుదేవులు అప్పుడప్పుడు సూక్ష్మ శరీరముతో యోగమార్గమున ఎక్కడెక్కడికో వెళ్లి వచ్చేవారు. ఈ విషయము ముందు ముందు అనుభూతులలో గమనించవచ్చును.

# 26. గురుదేవులు స్వాధీన దేహులు

గురుదేవులు తపస్వినమ్మగారింట్లో ఉండగా ఒకరోజున ఒక భక్తుడు వచ్చెను. గురుదేవులు ఆ వచ్చిన వారికి ఆసనములు,సూర్యనమస్కారములు చేసి చూపిస్తున్నారు. పదకొండు గంటలకు భోజనానికి పిలవడానికి వచ్చిన తపస్వినమ్మగారు ఇది చూచి చాల ఆశ్చర్యపడినారు. తర్వాత గురుదేవులతో వీరు 'మీరు నేల మీద కూర్చోలేరు, కాళ్లు, నడుము నొప్పి. మీరు వంగి నేలపై పడుకొని, కూర్చొని వారికి ఆసనములు వేసి చూపించినారు. మీకు బాధగా ఉంటుంది గదా,గురువుగారు'అన్నారు. గురుదేవులు 'లేదమ్మా,ఆయన చాలా దూరమునుండి నావద్ద తెలిసికొనవలెనని ఎంతో భక్తితో,ఆసక్తితో వచ్చినాడు. అటువంటి వారికి చెప్పక పోతేఎలా? నాకు బాధ ఏమీలేదు' అన్నారు.

గురుదేవులు స్వాధీన దేహులు - దేహము వారి స్వాధీనము లోనే ఉంటుందని తపస్వినమ్మగారు తలచినారు.

# 27. అయోధ్యలో పురశ్చరణము - అనుభూతులు

తపస్వినమ్మగారు మంత్రపురశ్చరణ చేయుటకొరకు అయోధ్య వెళ్లేటప్పుడు,గురువుగారు చిల్లర డబ్బులు రెండువందలరూపాయలు మూటగట్టి తపస్వినమ్మగారికి ఇచ్చిరి.'గురుదేవా,ఇవి నాకెందుకు?' అనగా 'నీకు అవసరము వస్తుంది, అప్పుడు వాడుకొమ్మ'నిరి. కాదనలేక తీసికొని సంచిలోపల తనపైకమును,దానిమీద ఈమూటను ఉంచిరి. తిరిగి వచ్చేటప్పుడు వీరి సంచిలోపల ఉంచిన వీరి పైకము పోయినది. గురుదేవులు ఇచ్చిన పైకముతో తిరిగి రాగల్గిరి. ఆశ్చర్యమేమంటే లోపల దాచిన సొమ్ము పోయినది. గురువుగారిచ్చిన మూటమాత్రము ఉన్నది.ఈవిధముగా గురుదేవులు తపస్వినమ్మగారిని ఆదుకొనిరి.

అయోధ్యకు తపస్వినమ్మగారితో పాటు వెళ్లిన కామేశ్వరరావు గారు లక్ష్మీదేవళమునకు వెళ్లినప్పుడు ఆయన కళ్లజోడు ఒక కోతి ఎత్తుకొని పోయి గాలిగోపురముపై కూర్చున్నది.చీకటి పడితే వీరికి చూపు కనపడదు. వీరు గురుదేవులను ప్రార్థించిరి. కొద్దిసేపటిలోనే కోతి జోడును క్రింద పడేసింది. ఆశ్చర్యము! అంత ఎత్తునుండి క్రిందపడిన కళ్లజోడు చెక్కుచెదరలేదు!

పురశ్చరణ కొరకు వెళ్లిన తపస్వినమ్మగారికి, కామేశ్వరరావుగారికి మంత్రపురశ్చరణ పూర్తి అయినది. సుబ్రహ్మణ్యంగారి జపము కాలేదు. తిరుగు ప్రయాణమునకు టిక్కెట్లు రిజర్వు చేయించినారు. సుబ్రహ్మణ్యంగారికి ఏమీ తోచలేదు. జపము మధ్యలో ఆపకూడదు.తపస్వినమ్మగారి సూచనమేరకు గురుదేవులను ప్రార్థించిరి.సుబ్రహ్మణ్యంగారికి గురువుగారు తన ఎదురుగా ఉన్నట్లు తోచినది.తన పరశ్చరణ పూర్తి అయ్యేవరకు గురువుగారు తన ఎదుట ఉన్నట్లు అనుభూతిని పొందిరి.

# 28. చందనాభిషేకము

గురుదేవులకు గంధముతో అభిషేకము జరుగు చున్నట్లు తపస్వినమ్మగారికి కలలో కన్పించినది. గురుదేవలకు చందనముతో అభిషేకము జరపవలెనన్న తన మనస్సులోని కోరికను గురుదేవులకు విన్నవించిరి. అప్పుడు వారు ఈ దేహమునకు 80వ యేట అభిషేకము జరగవలెనని' గంధపు చెక్కలను గూడ తెప్పించిరి. మరునాడు ఉదయమే అభిషేకం. పండ్ల రసములు,పంచామృతములు,విభూతి,గంధము,కాశీగంగ అన్నీ సమకూరినవి. 'చెఱుకు రసము తెప్పించండి, అప్పుడు లెక్కకు పదకొండు రసములు పూర్తిఅయిన అభిషేకము

నిర్విఘ్నముగా జరుగును' అనే మాటలు తపస్వినమ్మగారికి వినబడినవి. అట్లేరసములన్నీ సొద్దమైనవి. అభిషేకము జరుగు సమయమున సాక్షాత్తు పరమశివునివలె దర్శన భాగ్యము కల్గించిరి.

తపస్వినమ్మగారు గురుదేవులతో 'మా యింట్లో అభిషేకము కొందరు మాత్రమే తిలకించారు. మీశిష్యులందరు తిలకించు భాగ్యము ప్రసాదింపుడు' అని ప్రార్థించారు. గురుదేవులంగీకరించారు. శిష్యులందరికీ ఈవిషయము తెలియ జేయబడింది. నాగాయలంకలో జరిగే జన్మదినోత్సవములలో అభిషేకము చేయడానికి నిర్ణయించినారు. నాగాయలంకలోని గురుదేవుల శిష్యులు పరమానందముతో అంగీకరించినారు. ఆయా ప్రాంతములనుండి శిష్యులు తీర్థజలములు,తేనె, ఆవునెయ్యి,మొదలుగున్నవి అన్నింటిని తెచ్చిరి.

గురుదేవుల అభిషేకమునకు కొందరు శిష్యులు అంగీకరించలేదు.విగ్రహానికి అభిషేకము గాని గురువుగారికి అభిషేకము ఏమిటని అధిక్షేపించిరి. కాదు,కూడదు అంటే పాదములకు అభిషేకము చేయవచ్చుననిరి. మరి కొందరు 'సర్వదేవతలు గురువుగారిలే ఉంటారు, వారు మన తరింపు కొరకు మానవదేహము ధరించి వచ్చిన మహానుభావులు, భగవత్స్వరూపులు' కావున వారికి అభిషేకము జరిగితేనే బాగుంటుంది అన్నారు.

ఇదే విషయమును గురుదేవులను అడిగినప్పుడు వారు 'నేను సమాధిస్థితి లో ఉంటాను. తప్పేమిలేదు.మీరు ఏవిధంగా చేసినా నాకు సంతోషమే' నన్నారు.వారి ఆజ్ఞ అయిన వెంటనే అభిషేకమునకు సర్వము సిద్ధము చేయబడినది. అభిషేకం చాలా వైభవముగా జరిగినది.అభిషేకము జరిగినంతసేపు సాక్షాత్ శ్రీరామచంద్రమూర్తి వలె దర్శనమిచ్చినారు.గురుదేవులకు అభిషేకము నాగాయలంకలోని శ్రీరామపాదక్షేత్రములో జరిగింది.

ఈదృశ్యము చూచిన కన్నులేకన్నులు. గురుదేవులను అభిషేకించిన చేతులేచేతులు. అందరు ఎంతో ధన్యులు. వారివారి అభీష్టములను నెరవేర్చుచు, కష్టములను తీర్చుచు కంటికి రెప్పలాగ కాచుచున్న గురుదేవుని పొందిన శిష్యుల భాగ్యము వర్ణింతరమా!పొగడతరమా!అట్టి అదృష్టమును పొగడుటకు నాల్గుముఖములు కల్గిన బ్రహ్మకు గాని, వేయి శిరస్సులు కల్గిన ఆదిశేషునకు శక్యము గాదు!

# 29.గురుదేవులకు సత్యసాయిబాబాకు భేదము లేదు!

గురుదేవులు పుట్టపర్తిలో బాబాగారి ప్రశాంతనిలయంలో ప్రవచనములకు వెళ్లినప్పుడు తపస్వినమ్మగారు కూడ వెళ్లిరి. ఒకసాయంకాలము ఐదుగంటలకు గురుదేవులు,బాబాగారు ఒకరి భుజముపై

మరియొకరు చేతులు వేసుకొని తపస్వినమ్మగారు ఉన్న ఇంటి కటకటాల వాకిలి తలుపు నెట్టినారు. బాబాగారు, గురువుగారు ఉండటంచూచి తలుపులు తీయుటకు వెళ్లినారు. బయట ఎవ్వరు కనబడలేదు.

గురుదేవులు వచ్చిన తరువాత 'గురుదేవా, ఇంతకు పూర్వము మీరు, బాబాగారు వచ్చినారు కదా!నేను తలుపులు తీసినప్పుడు నాకు కనిపించలేదేమిటి' అని ప్రశ్నించినారు. గురుదేవులు 'నాకు బాబాకు భేదము లేదు. నేను ఆత్మ,బాబా పరమాత్మ,మేము నరనారాయణులం. బాబా సత్య,ధర్మ,శాంతా,ప్రేమలను చాచుటకు,నేను నామ ప్రచారము చేయుటకు అవతరించినవారం' అని చెప్పినారు.

# 30. యోగమార్గమున లండను వెళ్లివచ్చుట!

ఒకసారి గురుదేవులు స్నానము చేయుచు 'నేను త్వరగా ఒకచేటికి వెళ్లాలి. త్వరగా భోజనము పెట్ట'మన్నారు. తపస్వినమ్మగారికి ఏమీ అర్థము కాలెదు. 'త్వరగా ఊరికి వెళ్లాలి' అన్నారు గురుదేవులు. భోజనము చేసి ఊరికి వెళ్లక పడుకున్నారు. కొద్దిసేపయిన తర్వాత తపస్వినమ్మగారు 'గురువుగారూ,ఊరికి వెళ్లాలని పడుకున్నారేమి?' అని అడిగినారు.

'ఒక శిష్యురాలి మనమడు లండన్‌లో పరీక్షవ్రాస్తునాడు. నిన్నటి పేపరు బాగా వ్రాయలేదు. అందుకని ఈవేళ పేపరుని బాగా వ్రాయించాలి. నేను అక్కడికి వెళ్లివచ్చాను' అన్నారు.

వారంరోజులకు అతని వద్దనుండి జాబు వచ్చింది. దాని సారాంశము,'గురుదేవుల పాదపద్మములకు నమస్కరించి వ్రాయునది. నేను ఒక పేపరు వ్రాయలేక పోయినాను. అప్పుడు మీరు నావద్ద నుం డి వ్రాయించినట్లు అనుభూతి కలిగింది. అంతా తమ అనుగ్రహము,' అని వ్రాసినాడు.

దేశము కాని దేశములో ఉన్నవారికి కూడ వారు తలచుకొన్నంతనే వారివారి కోర్కెలు తీర్చెదువారి. మనస్సు తోనే తెలుసుకొని మనోవేగముతో వెళ్లి వారిపనులు పూర్తి చేయించెడివారు. ఆవిధంగా గురుదేవులు శిష్యులను, భక్తులను భక్తి మార్గములోకి మరల్చడానికి ప్రయత్నము చేసేవారు.

# 31. సహస్రచంద్ర దర్శనము - తులాభారము

## సందర్భమున గురుదేవులలీల!

బాపట్లలో పంగులూరి శేషగిరిరావుగారు,వారి కుటుంబసభ్యులు,తపస్వినమ్మగారు కలసి గురుదేవులతో 'గురువుగారు,మీకు సహస్ర చంద్రదర్శనోత్సవమును,తులాభారమును జరుపవలెనని ఉన్నది. కాని మేము, అధికముగా ధనమును ఖర్చుపెట్టలేము. కనుక శాస్త్రప్రకారం హెూమములు,పూర్ణాహుతి మొ॥నవి చేయవలెనని ఉన్నది.సుమారు ఒక వందమంది వరకు భరింపగలము.అందుకొరకు మీఅనుమతిని వేడుచున్నాము' అని ప్రార్థనా పూర్వకముగా మనవి చేసుకొనిరి. గురుదేవులు కూడ 'మీకు ఓపిక ఉన్నంతవరకు చెయ్యండి. నేను ఎవరికితెలియపరచును'అన్నారు.కాని గురువుగారు వీరికి పరీక్ష పెట్టిరి.

ఉత్సవము ప్రారంభమైనది. శిష్యులరాక మొదలైనది. తండోపతండములుగా వస్తున్నారు. శేషగిరిరావు గారు తెచ్చుకున్న సరుకులు మొ॥నవి అన్నీ మొదటిరోజుకే సరిపోయినవి. అది మూడురోజుల ఉత్సవము. రెండవరోజు సాయంకాలము నండి భక్తులరాక రెట్టింపయినది. గురుదేవుల అనుగ్రహము వారికి పరిపూర్ణముగా ఉండుట వలన ఎట్టి అవాంతరములులేక మృష్టాన్నములను ఏర్పాటు చేసినారు.

మూడవరోజు పూర్ణాహుతినాడు సుమారు పదునైదు వందలమంది ఉత్సవమును తిలకించుటకు వచ్చిరి. ఆ ప్రదేశము చాలదని కొందరు తెనాలి భక్తులు శేషగిరిరావుగారింటి ప్రక్కనేఉన్న ముళ్లపొదలు,చెత్తాచెదారములతో నిండియున్న ఆస్థలమును బాగుచేయదలచి,గురుదేవులకు నమస్కరించి,వారి ఆశీస్సులుపొంది, ఆస్థలములో ప్రవేశించి, బాగుచేసి, వేదికనేర్పాటుచేసి రంగురంగుల కాగితములతో అంతా అలంకరించినారు. పదిమంది కూలీలు బాగుచేసిన గాని బాగుపడని ఆస్థలము కేవలము అయిదుగురు భక్తులు ఆస్థలమును ఉత్సవమునకు అనువుగా ఉండునట్లు తీర్చిదిద్దిరి. గురుదేవుల ఆశీస్సులు అమోఘముకదా! గురుదేవులు ఆతర్వాత ఆస్థలమును చూచి చాలాబాగా చేశారని ప్రశంసించిరి.ఆశిష్యులు 'మీఅనుగ్రహము ఉంటే సాధ్యము కాని పని ఉండదు' అన్నారు.

గురుదేవులు తులాభారము తూగునప్పుడు మరొకలీలను చూపిరి. త్రాసులో గురుదేవులు ఒకవైపు,రెండవవైపు శిష్యులు ధనమును దోసిళ్లతో బస్తాలో పోయవలెను.తపస్వినమ్మగారు చివరగా నాణెములను వేయవలెను.గురుదేవులు 'రెండు దోసిళ్లరూపాయలు వేయగానే నేను తూగుతాను' అన్నారు. మొదట తపస్విమ్మగారు రెండవ పళ్లెములో నాణెములు రెండు దోసిళ్లు పోసిరి. గురుదేవులు ఉన్నవైపు అమాంతము పైకిలేచినది.

గురుదేవుల శక్తి తెలిసిన ఒకభక్తుడు 'గురుదేవా, మీరు అప్పుడే పైకిలేవకండి. డబ్బునంతా త్రాసులో ఉంచనీయండి. మీశక్తి చాలా గొప్పది.మిమ్మల్ని ధనంతో తూచగలమి?మాయొక్కభక్తికే మీరు తూగుతారు' అని నమస్కరించినంతనే గురుదేవులు కూర్చొనినవైపు క్రిందికి వచ్చినది.

రెండవ పళ్లెములో నాణెములున్న గోనెసంచిని ఉంచిరి. కాని గురుదేవులున్నవైపు పైకిలేవలేదు. వెంటనే భక్తులందరు కొబ్బరికాయలుకొట్టి, హారతులిచ్చి అనుగ్రహింపవలసినదిగా గురుదేవులను

ప్రార్థించిరి. తపస్వినమ్మగారు గురుదేవులను ప్రార్థించి ఒకదోసిలి నాణెములను పళ్లెములో వేసినారు. వెంటనే గురుదేవులున్న పళ్లెము పైకిలేచినది. సుమారు పదిహేడువేల రూపాయలుగల ఆడబ్బునంతయు గురుదేవులు అప్పటికప్పుడే దోసిళ్లతో పంచిపెట్టిరి. వస్త్రదానము చేసిరి.

ఆటంకములేమీలేకుండా ఉత్సవము గురుదేవుల అనుగ్రహముతో నిర్విఘ్నముగా ముగిసినది.

# 32.గురుదేవులు సర్వజ్ఞులు

గురుదేవులకు పసికర్లవ్యాధి సోకినది.అప్పుడు గురుదేవులు తపస్వినమ్మగారింట్లో ఉంటున్నారు. వారి శిష్యులలో చాలామంది అన్నిరకముల వైద్యము తెలిసినవారున్నారు.అలోపతి,హోమియోపతి, ఆయుర్వేదము,చిట్కావైద్యము, మంత్రము ఎవరు ఏదిచెబితే గురువుగారు ఆవైద్యము చేస్తున్నారు.ఎవరు ఏమందు పంపిన ఆమందు వాడేవారు. అప్పుడు తపస్వి నమ్మగారు 'గురువుగారూ, అన్నిరకముల వైద్యము మందులు వాడకండి. ఒకమందు మరియొకమందు సరిపడక వికటిస్తుందేమో.ఏదోఒకవైద్యము చేయండి'అని చనువుగా సలహాయిచ్చినారు.

గురుదేవులు'నాశిష్యులు నామీదున్న భక్తికొద్దీ మందులు పంపుతున్నారు. కొందరు స్వయముగా ఛార్జీలు పెట్టు కొనివచ్చి మందులు యిచ్చిపోతున్నారు.వారు యిచ్చిన మందులు వాడకపోతే వారందరికి బాధకలుగుతుంది.నాకు ఏమీ చేయదు.నాకడుపులో 'మెడికల్‌షాప్',ఉన్నది అని అన్నిరకాల మందులు వాడుతుండేవారు. పాపమో,పుణ్యమో ఏమైనా గాని అని తలచి కొందరు పంపిన మందులను గురుదేవులకు తెలియకుండా తపస్వినమ్మగారు దాచిరి.

గురుదేవులకు బాగా తగ్గిన తర్వాత 'అమ్మా!నీవు దాచిన మందులు ఇవ్వు.ఎవరికైనా అవి ఉపయేగపడతవి.' అన్నారు.గురుదేవుల వద్ద ఏదియుదాచలేము.వారు సర్వజ్ఞులు.అయినను ఏమీతెలియని సామాన్యుని వలె కనిపించేవారు!

# 33."అంజయ్యగారి కుమారుడు సామాగ్రి కొరకు లిష్టుయిచ్చినాడు"

# తెనాలి జన్మదినోత్సవ సందర్భమున గురులీల!!

గురుదేవుల జన్మదినోత్సవము తెనాలిలో జరుపుటకు వారి అనుమతిని కోరనప్పుడు గురుదేవులు తపస్వినమ్మగారితో 'నీవు కార్యక్రమమును భారీగా చెయ్యగలవా?' అని అడిగారు. అమ్మగారు 'మీఅనుగ్రహముతో ఏపని అయినా సాధ్యమ వుతుంది. చేయించేవారు మీరు. నేను నిమిత్తమాత్రురాలను. తెనాలిలో జరగాలని నాకోరిక'. అని అన్నారు.' అంతా బాగానే జరుగాతుంది' అని గురువుగారు ఆశీర్వదించినారు.

'లగ్గసరి రోజులు. సామగ్రి అద్దెకు తేవాలి. షాపువారికి ముందుగా చెప్పకపోతే యిబ్బంది పడాలి' అని అనుకొని తపస్వినమ్మగారు కావలసిన సామగ్రి జాబితాను తెలిసినవారికిచ్చి, షాపువారికి చెప్పమనిరి. వారు ఊరిలో లేనందున వెంటనే చెప్పలేకపోయారు. తపస్వినమ్మగారికి మరల కనబడలేదు. షాపులో చెప్పారోలేదో తెలియదు. ఉత్సవము పది రోజులు మాత్రమే ఉన్నది.'ఎవరికైనా పని చెబితే చేస్తామంటారు కాని వెంటనే చెయ్యరు' అని అనుకొని పడుకున్నారు.

ఆరాత్రి ఒకముసలి కోతివచ్చి వీరిప్రక్కనే కూర్చున్నది. ముఖాన నామాలున్నవి. శరీరమంతా వెంట్రుకలున్నవి. అప్పుడు వీరు 'నీవు ఎవరోనాకు తెలుసు. నీవు ఆంజనేయస్వామివి' అన్నారు. వెంలనే రూపమును మార్చి స్వామిగా దర్శనమిచ్చి నీకు ఏమికావాలో కోరుకొమ్మనినారు. 'స్వామీ,నాకేమీవద్దు, మీఅనుగ్రహము కావాలి,' అన్నారు. స్వామివారు తపస్వినమ్మగారి శిరస్సుపైచేయి ఉంచి దీవించి వెంటనే అదృశ్యమైరి.

ఇది జరిగిన మూడవరోజున సామాగ్రికొరకు షాపులో చెప్పడానికి ఇంతకుమునుపు వీరు చెప్పిన వారు వెళ్లారు. జాబితాను చూచి ఈజాబితా మొన్ననే ఇచ్చారని చెప్పారు. 'అంజయ్యగారి కుమారుడి'నని చెప్పి కావలసిన సామానుల జాబితాను ఇచ్చినట్లు చెప్పినందున, ఆషాపువారి అబ్బాయిని తీసికొని తపస్వినమ్మగారి వద్దకు వచ్చి 'మీరింకెవరితోనైనా చెప్పి జాబితా పంపినారా? నాతో చెప్పారు కదా? రెండు రోజులు ఆలస్యమైనది?' అని ఆయన అన్నారు. తపస్వినమ్మగారికి ఆశ్చర్యము కలిగినది.

"ఈ విషయము ఎవరితోను అనకండి", అని నమస్కరించి వెళ్లిపోయిరి. గురుదేవులే ఆంజనేయస్వామివారిని పంపి ఆ పని పూర్తిచేయించి ఉంటారని తపస్వినమ్మగారి దృఢ విశ్వాసము.

**జన్మజన్మలకైనా యిటువంటి గురుదేవులు లభింపరు!**

# 34. తపస్వినమ్మగారికొట్టు స్వాధీనము – గురులీల!

తపస్వినమ్మగారికొట్టును అద్దెకు తీసికొన్నఅతడు కొట్టుకు తాళంవేసి,పరారైనాడు.

సంవత్సరం అయింది. న్యాయ స్థానాన్ని ఆశ్రయిద్దామని గురుదేవులకు చెప్పి వకీలు వద్దకు బయలుదేరినారు.కొంతదూరము వెళ్లిన తర్వాత ఒకడు తప్పత్రాగి తూలుకుంటూ వీరి వద్దకు వచ్చి ‘పెద్దమ్మా,కోర్టుకు వెడతావా?ఇంటికి వెళ్లు.నమ్మినవారి అండ నీకుటుందిలే’ అన్నాడు.వీరి వద్దకాగితాలు ఏమీలేవు.కోర్టుకు వెళ్లబోవుచున్నట్లు అతనికెట్లా తెలిసింది.!!వెనుతిరిగి చూస్తే అతడు మరి కనిపించలేదు! కోర్టుకు వెళ్లకూడదని నిర్ణయించుకుని, జరిగినదంతా గురుదేవులకు తెలిపినారు.

అప్పుడు గురుదేవులు ‘దైవముపై నమ్మకముంచాలి. ఆవచ్చినవాడు రాముడై వుండవచ్చు. నీపనులన్నీ సక్రమంగా జరుగుతవి ’ అని ఆశీర్వదించిరి. వారంరోజులకు కొట్టుతాళాలు చేతికి వచ్చినవి. కొట్టుస్వాధీనమైనది. గురుదేవుల అనుగ్రహముతో నష్టమేమీ కలక్కుండా తపస్వినమ్మగారి పని సులభంగా పూర్తయింది!

# 35.తపస్వినమ్మగారి సోదరునిపై గురుకృప

తపస్వినమ్మగారి సోదరుడు,మరదలు ఇద్దరు గురుదేవులవద్ద మంత్రోపదేశము పొందారు. గురుదేవులు నిరంతరము రక్షగాఉండి వెన్నంటి కాపాడుచున్నారు. వీరికి ఒక యంత్రమునిచ్చి ‘ఇంటివాకిలికి తగిలించుకొండి బాధలు కలగకుండా కాపాడుతుంది’,అని గురుదేవులు చెప్పినారు.

ఒకనాడు ఇంట్లో ఎవరూలేని సమయంలో గిట్టనివారెవరో మండే కిరసనాయల్ గుడ్డలను ఇంట్లో పడేసినారు. ఇంటితలుపు తీయగానే గుప్పున పొగ, మంటలు కనిపించినవి. రెండు దిండ్లు మాత్రం కాలిపోయానవి! తలుపులు చెక్కు చెదరక అలిగేఉన్నాయి. ఇది గురుదేవుల కృపాకటాక్షము తప్ప మరొకటికాదు.

మూడు సంవత్సరముల వీరి కుమార్తె రెండవ అంతస్తునుండి జారిపడి స్పృహకోల్పోయింది. ఆదుర్దాగా పిల్లను ఆసుపత్రికి తీసుకొని వెళ్లటానికి బయటికి వచ్చినారు.ఎదురుగా ఒక ఆటోవచ్చి వీరినెక్కించుకొని ఆసుపత్రికి చేర్చింది. సాధారణంగా ఆసమయంలో ఆటోలుండవు!డబ్బు ఇవ్వబోగా ‘ బేబీని డాక్టరుగారికి చూపించండి. డబ్బుసంగతి తర్వాత చూసుకొనవచ్చును’ అన్నాడట ఆటోడ్రైవరు! వైద్యులు రాత్రి గడచిన గాని చెప్పలేము అన్నారు. పిల్లకు వాంతి అయితే కష్టము అన్నారు. వాంతి అయింది. ఏమిజరుగుతుందోనని గురుదేవులను ప్రార్థిస్తూ క్షణమొక యుగముగా గడుపుతున్నారు పిల్లతల్లిదండ్రులు.

పిల్లకు తెలివి వచ్చి ఆడుకుంటున్నది.అయినా వైద్యులు నమ్మకము చెప్పలేదు. వీరు మాత్రము పూర్తిభారము గురుదేవులపై వేసి వేడుకుంటున్నారు.పాపకు పూర్తిగా తగ్గింది.మూడవరోజున ఇంటికి పంపివేశారు. కంటివద్ద కమిలి పోయి రక్తము గడ్డకట్టింది.వేడినీటితో కాపుకాయగా అదికూడ పూర్తిగా తగ్గింది. తరువాత పాపను 'ఎలా పడిపోయావు?' అని అడిగితే గోడమీదినుండి దూకాను. గురువుగారు ఎత్తుకున్నారు' మరలా దూకి చూపిస్తానని వచ్చిరాని మాటలతో అన్నది. 'గురువుగారెవరు?' అని అడుగగా గురుదేవుల పటము వద్దకు తీసికొని వెళ్లి చూపించింది.ఆంజనేయస్వామి వారి పటము కూడ చూపించి 'వారు కూడ నన్ను ఎత్తుకొన్నారు' అని చేతులు చాపి చూపింది.గురుదేవులు వీరికి ధైర్యము చెబుతూ ఒకజాబు వ్రాసిరి. 'ఎల్లప్పుడు మీకు అండగా ఉంటాను.పిల్లను గూర్చి భయపడవద్దు',అని.

ఈరీతిగా గురుదేవులు వారి వెన్నంటి నిలిచి కాచి రక్షించుచుండిరి.

# 36.తపస్వినమ్మగారి వదినను భద్రముగా ఇల్లుచేర్చుట!

ఒకమారు తపస్వినమ్మగారి వదిన దుర్గమ్మగారు తెనాలి వెడదామని బస్టాండుకు వచ్చినారు. అది సాయంత్రం ఆరుగంటలు. చీకటి పడింది. బస్సురాలేదు. భయపడి తిరిగి ఇంటికి వెళదామనుకుంటుండగా తెనాలి బస్సువచ్చింది. గురుదేవులు బస్సుఎక్కుతున్నారు. గురువుగారున్నారనే ధైర్యముతో ఆమెకూడ బస్సుఎక్కినది.బస్సులో గురువుగారిని పలకరించడానికి వీలుకుదరలేదు.తెనాలిలో బస్సు ఆగగానే గురుదేవులు ముందుగాదిగినారు.వెనుకనే దుర్గమ్మగారు బస్సుదిగిరి.గురుదేవులు ముందు వెనుకవీరు నడచి వచ్చుచుండిరి. గురుదేవులు తపస్వినమ్మగారింట్లోకి ప్రవేశించిరి. దుర్గమ్మగారు లోపలికి వచ్చిరి. పంపుదగ్గర కాళ్లుకడుక్కొని వచ్చిరి.గురువుగారికి పాదప్రక్షాళన చేయవలెనన్న దుర్గమ్మ గారితో తపస్వినమ్మగారు 'గురువుగారు నిన్ననే బందరు వెళ్లారు.వారి జన్మదినోత్సవాలు అక్కడే జరుగుతవి' అన్నారు. దుర్గమ్మగారు విషయ మంతయు అమ్మగార్కి తెలిపి ఎంతో ఆశ్చర్యమును పొందిరి. దుర్గమ్మగారి భయముతీర్చి చేర్చవలసిన చోటవీరిన చేర్చి గురుదేవులు తమ లీలా విభూతిని ఈరీతిగా చూపినారు!

# 37. "అమ్మాయీ! నాకు ఆకలిగా ఉంది"

18-10-1994 మంగళవారం నాడు గురుదేవులవద్ద రేపల్లెలో మధ్యాహ్నము రెండుగంటలవరకు ఉండి తపస్వినమ్మగారు ఇల్లుచేరినారు. అదేరోజు రాత్రి 11-12 గంటలకు గురుదేవులు వీరి వద్దకు వచ్చి,ప్రక్కనే కూర్చుని, 'అమ్మాయీ,నాకు ఆకలిగాఉంది.తినటానికి ఏదైనా పెట్ట'మన్నార. గురువుగారూ, ఈసమయంలో ఏదైనాతింటారా? ఇప్పుడేమి పెట్టగలను. అని ఆలోచిస్తుండగా ఒక ముత్తైదువ వచ్చి,'నావద్ద తినటానికి ఉంది. మీకు పనికివస్తే నేను పెడతాను' అన్నది. ఆమెచేతిలో ఒక భరిణెఉన్నది. తపస్వినమ్మగారు పెట్టమనిరి. తరువాత గురువుగారు ఆ ముత్తైదువ అదృశ్యమైనారు! ఈకల చాలా భీతిని కలిగించింది.మరునాడే గురువుగారిని చూడవలెనను కొన్నారు.వీలుపడలేదు. 20-10-1994 న గురువుగారికి అస్వస్థతగా ఉన్నదని ఫోను వచ్చినది!

# 38.తోడుకుంటున్న పెరుగుతో కాఫీ కలుపుట!

గురుదేవులు పుట్టపర్తిలో ప్రవచనము చెప్పేరోజులలో జరిగిన ఒకసంఘటన. గురువుగారికి ప్రతిరోజు పాలు, పెరుగు బాబాగారి ద్వారా వచ్చేవి. కొందరు శిష్యులు కూడ పంపించేవారు. ఆరోజున తపస్విన్మమ్మగారు పరధ్యాపముగా ఉండి,వచ్చిన పాలు,పెరుగు ఒకేపాత్రలో పోసినారు.అమ్మగారికి కాఫీ కలపడానికి పాలగిన్నె తీసిచూడగా పెరుగు గడ్డలు కనిపించినవి.చాలభయపడిరి.కాని అన్నిటికి గురుదేవులే ఉన్నార. రామచంద్రమూర్తిని నమ్మినవారికి ఏయిబ్బంది కలుగదు అని గురుదేవులు పలుమార్లుచెప్పారు. ఇది తెలిసిన గురుదేవులు ఏమీఅనరు కాని, అమ్మగారు ఏమంటారోనని భయపడిరి. పాలు తెప్పిద్దామంటే ఏడుగంటలు దాటితే దొరకవు.'కాఫీకలపటం ఎట్లా?' అని తర్కించుకొని గురుదేవులకు నమస్కరించి కొంచెము పాలు వేరేగిన్నెలోకి వంచి కాచిరి.ఆపాలు విరగలేదు. కాఫీకలిపి అమ్మగారికి యిచ్చినారు. గురువుగారికి కూడ అలాగేచేసి పాలుయిచ్చినారు. ఆరోజు ద్వాదశి.అమ్మగారు పాయసము చేయమని చెప్పారు.మరల గురుదేవులకు నమస్కరించి పెరుగులో నుండి పాలను తేర్చి క్షీరాన్నముచేసినారు.సాయంకాలము పాలురావు.ఆరోజున కూడ పాలు తేర్చి వెచ్చచేసి యిచ్చారు! తపస్విన్మమ్మగారు చాల సంతోషించి ఇదంతముదైవలీల, గుర్వనుగ్రహము వల్లనే ఇట్లాజరిగింది అని తలచి మిగిలిన పాలను తానే స్వీకరింప దలచినారు.

వీరి వెంట నున్న అత్తోట సీతారామమ్మగారితో 'నేను పాలు తీసుకుంటాను. మీరు మజ్జిగ తీసికోండి,' అని చెప్పి ఆపాలను తానే ప్రసాదముగా తీసికొనే ప్రయత్నంచేశారు.కాని ఆ పాలు విరిగి గడ్డకట్టినవి. గురుదేవులకు పాలు యిచ్చి పదినిముషాలు కూడకాలేదు.నాలో స్వార్థము కలిగినది.కనుకనే పాలువిరిగి గడ్డకట్టింది.

ఉదయము 7గం.ల నుండి పెరుగులో కలిసిన పాలు అంచెలంచలుగా ఏఇబ్బంది కలగకుండా ఉపయోగించు కుంటానికి వీలుగా చేసినవారు.'ఇప్పుడు గడ్డకట్టడమేమిటి?' అని తన తప్పునుతె లుసుకొని,ఆవిరిగిన పాలను సీతారామమ్మగారు,వీరు యిరువురు ప్రసాదముగా స్వీకరించినారు.ఈవిషయమును

తెలుసుకొన్న గురుదేవులు నవ్వి 'ప్రసాదమును భక్తులందరికి పంచి మిగిలిన దానిని మనము తీసుకోవాలి.స్వార్థము పనికిరాదు' అని హితవు చెప్పినారు.

క్లిష్ట సమయములలో గురుదేవులు తమ శిష్యులనేరీతిగా కాపాడుతారో ఈ ఉదంతము నిదర్శనము!

# 39.గురుదేవులు సింహాసనస్థులై దర్శనమిచ్చుట!

ఈమధ్యనే ఒకరోజు రాత్రి గురుదేవులు జ్ఞాపకమునకు వచ్చి 'ఈజన్మకు మీరు దేహముతో కనిపించరుకదా, ఒక్కసారి మిమ్మల్ని చూడాలని ఉన్నది' అని ఆవేదన చెందుతు ఆరుబయట ఆకసము వైపు చూస్తూ తపస్వినమ్మగారు పడుకున్నారు. ఇంతలో ఆకాశములో సింహాసనము నధిష్టించి, పట్టువస్త్రములు ధరించి కూర్చుని దేదీప్యమానముగా వెలిగి పోతూ గురుదేవులు దర్శనమిచ్చారు.గురుదేవులను భక్తితో,మనసారా ఆర్తితో ప్రార్థిస్తే దర్శనమిస్తారను నమ్మకము ఈదర్శనము వలన కలిగినది.

# 40.రామచంద్రమూర్తి గురుదేవులకు తీర్థమిచ్చుట!

ఒకసారి గురుదేవులు తపస్వినమ్మగారింట్లో ఉన్నప్పుడు వారి ఆరోగ్యము బాగాలేదు.కాళ్లువాచి నడవలేని స్థితి లో ఉన్నారు.చాలానీరసముగాఉన్నారు.అన్నీమంచము వద్దనే జరుగుచున్నవి. వారి బాధ చూడలేక ఒకభక్తుడు తీర్థము నిస్తానని కబురు పంపెను. ఆసమయమున తపస్వినమ్మగారు గురుదేవులవద్దనున్నారు. అప్పుడామె, 'గురుదేవులకు తీర్థమీ యగల్గినది సాక్షాత్తు శ్రీరాయచంద్రమూర్తియే గాని యితరులకది సాధ్యము కాని పని' అంటూ 'ఇంతటి గురుదేవులకు తీర్థమిచ్చుట ఎవరి తరము? వెలుగుచున్న సూర్యుని దివిటీతో చూపించిన విధంగా ఉంటుంది. మహానుభావులైన గురు దేవుల మహిమ తెలియక తీర్థమిస్తామన్నారు' అని పలికిరి. గురుదేవులు నవ్వి,'ఎవరైతేనేం?రాముడు వచ్చి తీర్థమిచ్చునా?' అన్నారు. 'మీఅనుగ్రహం ఉంటే తప్పకుండా యిస్తారు' అనినారు తపస్వినమ్మగారు

మరునాడు మంగళవారము.సాయంత్రము ఆరుగంటల సమయములో భజనకు టైమైనది. 'హాలులో చాపలు వేయండి' అని ఒక భక్తురాలికి చెప్పిరి. ఆమె పటములను తుడిచి బొట్టుపెట్టటానికి పటముల వద్దకు వెళ్లెను. శ్రీరామ చంద్రమూర్తి పటము నుండి అమృతము కారుచున్నది!!క్రింద ఉన్నకాగితము తడిసింది.ఆమె తపస్వినమ్మగారిని పిలిచెను. వారు వెంటనే పళ్లెము పెట్టిరి.ఆపళ్లెములో అమృతము

కారింది. 'గురువుగారూ, రాముడు తీర్థమిచ్చినాడు!' అని తీర్థమును ముందుగా గురుదేవులకిచ్చి తరువాత భక్తులందరికి యిచ్చిరి. గురుదేవులు ఆశ్చర్యము ప్రకటించిరి. కొద్దిరోజులకు గురుదేవులకు ఆరోగ్యము కుదుటబడినది!

# 41.పుట్టపర్తి నుండి గుంటూరు వచ్చునప్పటి గురుదేవులలీల!

పుట్టపర్తి నుండి గుటూరు వచ్చేటప్పుడు ధర్మవరము నుండి గుంతకల్లు వెళ్లే రైలు ఎక్కడానికి గురుదేవులు, బెజవాడ రామనారాయణశరణ్ చకచక నడుస్తూ చివరి పెట్టెదగ్గరకు వెడుతున్నారు. వీరితోపాటు వచ్చిన శిష్యులు కూడ రైలు ఎక్కినారు. కాని తపస్వినమ్మగారు మాత్రము రైలు ఎక్కలేకపోయిరి.వీరి చేతియందు లగేజి ఉన్నది.రైలు కదల బోవుచున్నది. 'గురువుగారూ,నేనేమిచేయను?మీరు ముందు వెడుతున్నారు.నేను వడవలేక పోతున్నాను.బండి కదులు తున్నది' అని విచారిస్తూ నిలబడినారు.ఇంతలో వెనుకనుండి గుర్తుతెలియని వ్యక్తి ఒకరు వచ్చి వీరి చేతులలోని లగేజి తీసికొని త్వరగా నడుస్తూ అమ్మగార్ని కూడతొందరగా నడవమని తొందరచేస్తూ లగేజి రైలులో పెట్టి వీరిని రైలు ఎక్కిం చినాడు. రైలుపెట్టెలో కాలుమోపు సందుకూడలేదు. అంతరద్దీగా ఉన్నది. బండి కదలబోవుతున్నది. గురువుగారు బండి ఎక్కలేదని, ఏకారణము చేతనో బయలురేరిన బండి ఆగగానే తపస్వినమ్మగారు,ఇతరశిష్యులు బండి దిగినారు. గురువుగారు దిగవద్దని వారించినా వీరు దిగినారు. మరియొకబండి కోసము ఎదురుచూస్తున్నారు. ఇంతకు పూర్వం తపస్వినమ్మగార్ని రైలు ఎక్కించిన మూగవ్యక్తి మరల వీరి వద్దకు వస్తున్నవానిని చూచి గురువుగారు 'మీరాముడొస్తున్నాడు. ఇప్పుడు వస్తున్న రైలులో మాకు కూడ సీట్లు ఉంచమని చెప్పండి' అని చమత్కరించినారు. వచ్చిన వ్యక్తి రైలు ఎందుకు దిగినావు? అని అమ్మగార్ని సైగలతో ప్రశ్నించినాడు.'మాగురువుగారు ఎక్కలేకపోతే నేను కూడ దిగినాను' అన్నారు.'మీగురువుగారు నిన్ను విడిచి ముందుకు వెళ్లలేదా?నీవు ఎందుకు దిగాలి?' అంటూ గురువుగార్ని చూస్తూ సైగలతో అడిగాడు. 'గురువుగారు వెళ్లకుండా నేను వెళ్లడం ధర్మముకాదు' అన్నారు.'నిన్నువిడిచి ఆయన వెళ్లవచ్చునా? ....బండి రాగానే వచ్చి బండి ఎక్కి స్తానని చెప్పి వెళ్లినాడు.మాఅందరికీ సీట్లుకావాలి అని అడిగినారు.బండి రాగానే వీరినందరినీ ఖళీగా ఉన్న పెట్టెలో ఎక్కించి సామాను బండిలో పెట్టినాడు.తపస్వినమ్మగారు కూలి యివ్వబోగా అతడు తీసికోలేదు. బలవంతముగా వీరే అర్థరూపాయి చేతిలో పెట్టారు.అది తీసికొని మరి కనబడ లేదు.బండి గుంతకల్లు చేరేటప్పటికి సుమారు ఒంటిగంట కావచ్చింది (రాత్రి). ఉదయం 7గంటలకు గుంటూరు వెళ్లేబండి. గురువుగారు ఇతర శిష్యులు నిద్ర బోతుండగా తపస్వినమ్మగారు సామానుకు కాపుదలగా ఉన్నారు.ఒక పోలీసు వచ్చి 'దేనికి మీరు కూర్చున్నారు? వారందరు నిద్రిస్తుంటే మీరు మాత్రమే ఎందుకు కూర్చున్నారు'అని అడిగినాడు.'వారు నిద్రకాయలేక నిద్రపోతున్నారు. రాముని దయవలన నేను మెలకువగా ఉండి సామాను చూస్తున్నాను' అన్నారు.

'మీరు ఎక్కబోవు బండి చాలా రద్దీగా ఉంటుంది.మీరు ఎక్కడము చాలా కష్ట ము.నేను వచ్చి మిమ్మల్ని బండి క్కిస్తాను"అని చెప్పి ఆపోలీసు వెళ్లినాడు. బండి రాగానే ఆవ్యక్తి వచ్చి తపస్వినమ్మగారి లగేజి తీసికొని ఖళీగాఉన్న చిన్నపెట్టెలో వీరందర్నీ ఎక్కించి 'ఈ పెట్టెలో ప్రయాణీకులు ఎవ్వరు ఎక్కరు.మీరందరు పడుకోవచ్చును' అని చెప్పి తలుపులు వేసి వెళ్లిపోయినాడు. నరసరావుపేట చేరేవరకు ప్రయాణీకులెవ్వరు ఆపెట్టెలో ఎక్కలేదు.ప్రతి స్టేషన్‌లో ప్రయాణీకులు వచ్చి'ఇది రిజర్వేషన్ కంపార్టుమెంటు' అనుకుంటూ వెళ్లిపోయినారు!ఆరీతిగా గురుకృప వలన ఏఇబ్బంది లేక గుంటూరు చేరినారు!

# 42.ముంబయి ప్రయాణము – గురుదేవుల లీల!

తపస్వినమ్మగారు ముఖ్యమైన పనిఉండి ముంబయి వెడుతున్నారు.స్టేషను నుండి ఇంటికి తీసుకొని వెళ్లడానికి తమ్ముడిని రావలసినదిగా ఫోనుచేయమని చెప్పివీరు రైలుఎక్కినారు. తమ్ముడికి ఫోను అందలేదు. వీరు కళ్యాణి స్టేషను లో దిగిరి.డోబివిలి వెళ్లాలి.కూడ తమ్ముడి అత్తగారు కూడ ఉన్నారు.స్టేషనుకు ఎవరు రాలేదు. భాషరాదు.ఇంటికి చేరడ మెలా?ఇంటి అడ్రసు తెలియదు.స్టేషనులో తెలుగు వారు ఎవరూకనబడలేదు. ఎవరినైనా అడుగుదామంటే భాషతెలియదు. వీరి వద్దనున్న అడ్రసు కాగాతం శిధిలావస్థలో ఉంది. దైవముపై భారము వేసి ప్లాటుఫారంమీద కూర్చున్నారు.ఒంతలో ఒకాయన వీరి వద్దకు వచ్చి హిందీలో'ఎక్కడికి వెళ్లాలి' అని అడిగినాడు.'డోబివిలి' అని వచ్చీరాని భాషలో చెప్పి టిక్కెట్టుచూపించారు.

అతడు వీరిద్దరిని ఫస్టుక్లాసులో ఎక్కించి తానుకూడ డోబివిలిలో దిగి బ్రిడ్జికి త్రోవ చూప్చిఇ ఆవైపుగా వెళ్లమని చేప్పి వెళ్లినాడు. డోబివిలి నుండి ఇంటికి ఎలావెళ్లాలో తెలియదు.శిధిలావస్థలో ఉన్న అడ్రసు కాగితం కొందరికి చూపించగా తెలియదు అన్నారు. లోగడ వెళ్లినరోడ్డును గుర్తించి ఆలోస్టాండు వరకు ంవచ్చినారు.ట్రాఫిక్ పోలీసు అడ్రసు తెలుసుకోలేక పోయినాడు.ఇంతలో ఒక ఆటోవచ్చింది. డ్రైవరు ఎక్కమన్నాడు కాని వీరు అనుమానించి అందులో ఎక్కలేదు.ట్రాఫిక్ పోలీసు ఆటోనుమాట్లాడి అందులో ఎక్కమని చెప్పి నాలుగురూపాయలు బాడుగయిమ్మని చెప్పినాడు. ఆటోడ్రైవరుకు సుమారు పాతికసంవత్సరములుండవచ్చును. తెల్లగా ఉన్నాడు. చాలనెమ్మదస్తుడు. అడ్రసు చూపించిన చూడక,వీరి తమ్ముడు ఉండే బిల్డింగురోడ్డు దగ్గరేఆపి దిగమనినాడు. ఆరోడ్డుకు సుమారు రెండు ఫర్లాంగులదూరములో నున్నవారి తమ్ముని యింటికి దారి తెలుపుకుంటూ నెమ్మదిగా చేరిరి.

# 43.మంబయిలో గురుదేవుల లీల!

తపస్వినమ్మగారు ముంబయి వెళ్లినది మొదలు జపము చేసేటప్పుడు కలలో కూడ గురుదేవులు కనిపించేవారు. ఇంటికి చేర్చినది గురుదేవులే. వీరి మనస్సుకు బాధకలిగి అక్కడ ఉండలేనని బాధపడినప్పుడు గురుదేవులు వీరికి ఎదురుగా కూర్చుని 'మీమరదలు ఆస్పత్రినుండి ఇంటికి వచ్చాక మీఊరు వెళ్లవచ్చు' అనేవారు. ఇది్రభమా, లేక గురుదేవులే నిజముగా మాట్లాడుచున్నారో తెలిసేదికాదు. అనుక్షణము అంతగా వెన్నంటి తోడుగానిలిచిన గురుదేవులు తెనాలి చేరిన తర్వాత అంతగాదర్శన మివ్వడంలేదు.

# 44.గృహప్రవేశమునకు వెళ్లునప్పుడు గురుదేవులలీల!

తపస్వినమ్మగారు తన అన్నకుమారుని ఇంటి గృహప్రవేశమునకు వెళ్లవలసి వచ్చింది. నగరాలలో దిగవలసి ఉండగా తెలియక గోరంట్లలోనే దిగిరి. కొంతమందికి అడ్రసు చూపినా తెలియదన్నారు. ఇంతలో ఒకవ్యక్తి లూనాపైవచ్చి 'ఎక్కడికి వెళ్లాలి' అని అడిగి 'నేను 15 నిమిషాలలో వచ్చి మిమ్మల్ని తీసికొని వెడతాను' అని చెప్పి ఒక చిన్నకొట్టు ముందర వీరిని కూర్చోబెట్టి వెళ్లినాడు.సుమారు మధ్యాహ్నం ఒంటిగంట కావస్తుండగా ఆ లూనావ్యక్తి మరలా వచ్చి వీరిని తీసికొని వెళ్లి గమ్యస్థానము చేర్చిరి.లోపలికి రమ్మని పిలిచినా రాక అతడు వెళ్లిపోయినాడు.గురుదేవులే ఆవ్యక్తి చేత ఆవిధంగా గమ్యము చేర్పించినారని వీరి గాఢవిశ్వాసము!

# 45. గురుదేవుల అంతిమ ఘడియలు!

జబ్బుతో ఉన్న గురుదేవులను చూచి తిరుగుప్రయాణము అవుచున్న తపస్వినమ్మగాని గురుదేవులు తలఊపి, వద్దని అస్పష్టముగా పలికిరి.తనచేతిని గట్టిగా పట్టుకున్న గురువుగారి చేత తపస్వినమ్మగారు ' శ్రీరామజయరామజయజయరామ'నామము చెప్పించిరి.సోమవారం రాత్రి గురుదేవులు తపస్వినమ్మగారి చెవిలో ఏదోచెప్పగా 'ఇంకనేను ఇక్కడ ఉండ వలసిన పనిలేదు' అని తెనాలి బయలుదేరబోగా మర్నాడు వెళ్లవలసినదిగా అక్కడి వారు సూచించగా, మంగళవారం ఉదయం గురుదేవుల నోట్లో కాశిగంగపోసి వెళ్లివస్తానని చెప్పిరి. గురుదేవులు వెళ్లవద్దని తలూపిరి.అప్పుడామె'గురుదేవా! ఇంటివద్ద సంగతిమీకు తెలుసుగదా, మరలావెంటనే వస్తాను. మీకు స్వస్థత కలగగానే నేను తీసుకొని వెళ్లి మీకు సేవ చేసుకుంటాను' అని చెప్పగా గురుదేవులు చేయిచాపి వీరి శిరస్సుపై ఉంచి ఆశీర్వదించినారు!అవియే గురుదేవుల చివరి ఆశీస్సులు.గురుదేవుల కార్యక్రమము లన్నీ దగ్గర ఉండి జరిపించిన, ఎంతో భక్తిశ్రద్దలు గల బ్రహ్మయ్యగారు గాని, కంచి వరదరాజులుగారుగాని,

తపస్వినమ్మగారు గాని గురుదేవుల చివరిక్షణములలో వారి సన్నిధినలేరు!గురుదేవులే అవసాన దశలో తాము పడుచున్నబాధలను తన శిష్యులు చూసి సహింపలేరని వారిని దూరముగా ఉంచినారని తోచుచున్నది.

# 46. అనుభూతులను బహిర్గతము చేయమని గురుదేవులు అనుజ్ఞ ఇచ్చుట!

గురుదేవులను చూడటానికి తపస్వినమ్మగారు,మరికొందరు శిష్యులు బాపట్ల పంగులూరివారి ఇంటనున్న గురుదేవుల వద్దకు వెళ్లిరి. ఆరోజు ఆదివారము. గురువుగారు కొన్నివిషయాలు మాట్లాడిన తరువాత 'అమ్మాయి!నీకు కల్గిన అనుభూతులు భక్తులు అడుగుతున్నారు. పుస్తకరూపంలో వ్రాస్తే బాగుంటుంది' అన్నారు. అప్పుడామె, 'గురుదేవా, నాకేమీతెలియదు. అనుభూతులేమీలేవు. నన్నుబయటపెట్టవద్దు!' అని నమస్కరించి ప్రాధేయపడ్డారు. వెంటనే,'నేను ఎప్పుడైనా అబద్ధము చెప్పానా?పరిహాసానికైనా లేనివి అనలేదు' అని గురుదేవులు ఉచ్ఛైస్వరముతో అన్నారు. 'మీరు అబద్ధము చెప్పారని కాదు. బహిరంగపరచడం ఇష్టంలేక అన్నాను' అని అన్నారు ఆమె.

గురుదేవులు'నేను చెప్తాను,మీరు వ్రాసుకోండి. నాకంటే తెనాలి వారికి బాగా తెలుసు'అన్నారు. తరువాత పదిరోజులకే గురువుగారు దేహము చాలించినారు. గురుదేవుల దృఢసంకల్పము వద్దనుకున్న తపస్వినమ్మగారి అనుభూతులను బహిర్గతము అయ్యేటట్లు చేసినది!

ఈపైన చెప్పబడిన అనుభూతులు,అనుభవములలో చాలావాటిని తపస్వినమ్మగారు బహిరంగ పరచుటకు మొదట్లో యిష్టపడలేదు. కాని అనేకమంది బహిరంగము చేయమని పదేపదే అభ్యర్థించగా, ఈ అనుభూతులను బయట పెట్టినారు. ఇంకా కొన్నిచెప్పారు గాని వాటిని వ్రాతపూర్వకముగా బహిరంగ పరచుటకు అనుమతి నీయలేదు!

మదిలో ఆర్తితో తలచినవెంటనే గురుదేవులు కనిపించేవారు!ఇప్పటికి గురుదేవులు స్వాప్నికము గానేకాక ప్రత్యక్షముగా కూడవీరికి దర్శనమిచ్చినారు.

తపస్వినమ్మగారు 'శబరి' వంటివారు. శబరి తన గురువుగారిని సేవించినట్లు తపస్వినమ్మగారు గురుదేవులను సేవించిరి. అంతేగాక తన దివ్యఅనుభూతులను వెల్లడి చేయడంవల్ల గురుదేవుల మహిమ లోకానికి తెలియజేసిన వారైనారు!

# 47. నిద్రాదేవతను నేనుగా ఆహ్వానించను

గురువుగారు విశ్రాంతి లేకుండా మాట్లాడుతుంటే వారిని విశ్రాంతి తీసుకోమని చెప్పినాము. అప్పుడు వారు ఈక్రింది విధముగా చెప్పినారు. చేతులు పైకెత్తి,"నాయనా నిద్రాదేవతను నేనుగా ఆహ్వానించను. దాని అంతట అది నామీదకు వస్తే కొంచము సేపు విశ్రాంతి తీసుకుంటాను" అని చెప్పారు. అంత వయస్సుగల గురువుగారు చెప్పిన మాటలు రోజూ జ్ఞాపకము వస్తుంటాయి.

**డా॥ పి.రామాచార్యులు**

**పేర్నిమిట్ట , ఒంగోలు**

# తపస్వినమ్మగారు తెలిపిన ఇతరుల అనుభూతులు

## ఉరిశిక్షను తప్పించిన గురుదేవుల లీల!

### ఈ సంఘటన స్వయముగా గురుదేవులే చెప్పినారు!

ఒక శిష్యురాలి భర్తకు దేవునిమీద,గురువుమీద నమ్మకంలేదు.నాస్తికుడు.ఒకసారి ఒకకేసులో ఇరుక్కున్నాడు. తీర్పులో ఉరిశిక్ష పడుతుందని చూచాయగా తెలిసింది. ఆశిష్యురాలు భయపడి తనపసుపు కుంకుమలను నిలపమని గురుదేవులను దీనముగా ప్రార్థించినది.గురుదేవులు'నీభర్తకు ఏఆపదారాదు. పవనకుమారునికి చెప్పుకొని వెళ్లు' అని ఆమెను దీవించినారు. తీర్పువచ్చేరోజు ఆశిష్యురాలు గురుదేవుల పటము ఎదురుగా కూర్చొని ప్రార్థించింది. ఆమెభర్త కూడ భయపడి గురుదేవులను ప్రార్థించినాడు.

కేసు కొట్టివేసినారు. ఆపదనుండి ఒడ్డున పడ్డారు. భార్యాభర్తలిద్దరు గురుదేవులవద్దకు వెళ్లి వారిఆనందముతెలిపి వారికి ప్రణమిల్లినారు. తర్వాత అతడు కూడ మంత్రోపదేశము పొందినాడు. భార్యాభర్త లిద్దరు గురుదేవులను సాక్షాత్తు దైవముగా భావించారు!

# ఒక భక్తురాలికి గురుదేవులు సాయిబాబావలె దర్శన మిచ్చుట!

మందడములో ఒక సాయిబాబా భక్తురాలు తొలిసారిగా గురుదేవులను దర్శించింది. ఆమెకు గురుదేవులు సత్యసాయిబాబావలె దర్శనమిచ్చినారట!

గురుదేవులు తమకుమారుడు మణించిన పన్నెండవరోజున చంద్రమండలము సమీపమునకు వెళ్లినట్లు చెప్పగా, తపస్వినమ్మగారు 'మీశిష్యురాలుకాదు, మొదటిసారి మీదర్శనమునకు వచ్చిన ఆమెకు మీరుబాబాగారిగా దర్శనమిచ్చారట! ఏమి ఆమెఅదృష్టము!మేము అందులకు అర్హులము కామా!మాలో మీపట్ల అంతటి భక్తిశ్రద్ధలు లేవా?' అని అడిగారు.

గురుదేవులు నవ్వి,' అందరికి సాధ్యమవుతుందా దర్శనంకావడానికి?' ఆమె ఎన్నిజన్మల నుండియో దైవాన్ని కొలుస్తున్నది! మీరు ఆస్థితికి రాలేదు' అని ఖచ్చితముగా పలికిరి.

# మేడూరి రాఘవమ్మగారి అనుభూతులు

మేడూరి రాఘవమ్మగారు హనుమమంత్రము పురశ్చరణము చేయుచున్నారు. ఒకనాడు వేసిఉన్న తలుపులు తెరిచి గురుదేవులు లోపలికి వచ్చి 'తప్పుకో,అటువెళ్లాలి' అని రాఘవమ్మగారిని తొలగమని,వారి పూజామందిరము లోనికి ప్రవేశించారు. జపముచేస్తూ ప్రక్కనే ఉన్న ఆమెభర్తకు కనబడలేదు. రాఘవమ్మగారి పురశ్చరణము పూర్తయి హోమజపము చేయుచుండగా హోమము జరుగుతున్నట్లుగా కనిపించింది. కళ్లుతెరిచి చూడగా ఏమీలేదు. కాని హోమము చేసినట్లు బండ మసకబారి వేడికి పగులిచ్చినట్లు కనపడింది. ఆమెనుదుట తిలకము దిద్దారు. మంచి నేతివాసనతో అక్షింతలు పడినవి! అవి ఇంకి వారి వద్దఉన్నవి. వారు వాటిని భద్రముగా దాచుకున్నారు.

పురశ్చరణ పూర్తయిన తర్వాత గురుదేవులను దర్శించాలని మనసున తలచినారు. ఆరోజుననే గురుదేవులు తపస్వినమ్మగారింటికి వచ్చియున్నారు. 'రాఘవమ్మ, పురశ్చరణ అయినదా?' అని అడిగారు.'ఈరోజే పూర్తి అయిందని' చెప్పారు. వెంటనే గురుదేవులు వారింటికి వెళ్లి ప్రేమగా ఆమెకు పూర్తి అనుగ్రహమును.ఆశీస్సులను అందజేసిరి.

# 2

రాఘవమ్మగారి అమ్మాయి సాయిలక్ష్మికి సంతానము కలుగలేదు. వారు గురుదేవులను ఆశ్రయించినారు. గురుదేవులు ఆపిల్ పండ్లను మంత్రించి పండును కొరికి పండు వంటి కొడుకు పుడతాడని చెప్పి సాయిలక్ష్మికి పండునిచ్చారు. సంవత్సరమునకు మగబిడ్డ కలిగినాడు!

# 3

రాఘవమ్మగారు గుంటూరు బొమ్మిడాల నగరములో ఉంటున్నారు.ఒకనాటి రాత్రి గురువుగారు ఆమెకు కలలో కనిపించి 'అమ్మా స్నానానికి నీళ్లు పెట్టు' అన్నారు.గురువుగారు స్నానము చేసి విశ్వరూప సందర్శనము అనుగ్రహించారు. మరునాడు గురుదేవుల పటమునుండి విభూతి ప్రసాదము వచ్చినది. సుమారు పదిహేను రోజుల వరకు పటమునుండి విభూతి రాలుతూనేఉంది!రాఘవమ్మగారు పూజామందిరం శుభ్రంచేసినప్పుడు పటము తుడిచినారు.

# భాస్కరరావుగారి అనుభూతి

నేను మాతాజీ తపస్విని గారి ద్వారా శ్రీరామశరణ్ గురుదేవులవారి దర్శన పరిచయ భాగ్యము పొందాను.శ్రీ గురువుగారు 1982లో నాకు,నాభార్యకు ఉపదేశభాగ్యమును అనుగ్రహించారు. నేను 1985 నుండి ఆర్థికముగా చాల ఇబ్బందులకు లోనయినాను. కాని నాకు నష్టములేకాని గురుదేవుల అనుగ్రహమువలన కష్టము కలుగలేదు.తిండి,బట్ట, గౌరవములకు లోటులేకుండా ఈనాటికీ అనుగ్రహిస్తున్నారు.

1988లో శ్రీగురుదేవులు నన్ను మండలదీక్షతో లక్ష్మీసహస్రనామస్తోత్రము ఉదయము, సాయంత్రము పారాయణము చేయవలసినదిగా సెలవిచ్చినారు. ఆదీక్ష జరుగుతున్న సమయములో గురువుగారు పలుమార్లు ప్రత్యక్షముగా దర్శన భాగ్యము అనుగ్రహించారు.

ఒకనాటి ఉదయమున పూజాసమయములో ఒకముసలావిడ,చింకిబట్టలతో,దుబ్బుతలతో కట్టుపోటు వేసుకొని వచ్చి పూజామందిరము ఎక్కటానికి ప్రయత్నం చేస్తున్నది.అప్పుడు గురుదేవులు కర్రతోవచ్చి పూజాపీఠము ఎక్కకుండా ఆమెను తరిమివేసినారు. ఆవిధంగా మూడుసార్లు ఆమె ప్రయత్నము చేయడం, గురుదేవులు అడ్డగించడం జరిగింది. ఆమె జ్యేష్టాదేవి అయిఉండవచ్చునని నాభావన.ఆనాటినుండి గురువుగారు మమ్ములను అనుగ్రహించి కాపాడుతున్నారు.

అంతటి దయామూర్తి, ప్రేమమూర్తి మరియొకరులేరు. వారికి వారేసాటి. జన్మజన్మలకు శ్రీగురుదేవులవారి ఆశీర్వనుగ్రహములు వేడుకొనుచున్నాను. 'గురువు' అంటే శ్రీరామశరణ్ గురుదేవులే గురువు. శ్రీగురుదేవులవారికి నా కృతజ్ఞతాంజలులు.

# గుడిపూడి లక్ష్మి అనుభూతి

గుడిపూడిలక్ష్మి గారికి ఒక కలవచ్చింది.ఆకలలో గురుదేవులు చుట్టూకూర్చున్న శిష్యులతో కనిపించారు. శిష్యులకు ఆధ్యాత్మిక విషయాలు బోధిస్తున్నారు.తపస్వినమ్మగారు వచ్చి,'ఇకలేవండి గురువుగారూ, చాలా ప్రొద్దుపోయింది' అన్నారు. గురుదేవులు 'వీరికి చెప్పనివ్వు. చెప్పకపోతే వారికి ఎట్లా తెలుస్తుంది? అన్ని విషయాలు అందరికి తెలియాలి నీకు ఒక్కదానికే కాదు.అందరికి తెలియజెప్పాలి' అన్నారు.

# రైలుబండిలో ప్రవచన శ్రవణానుభూతి

పి.యల్.ప్రసాదు గారు బాపట్లవెడుతున్నారు.ఆయన రైలులో కళ్లుమూసుకొని మాతశివలీల కృష్ణలీలలను చెబితేనే ఇంతబాగుంది.మన గురుదేవులు బృందావనములో రాసలీలలు చూచి కృష్ణ దర్శనం చేసినవారు.వారి అనుభవము చేత కృష్ణలీలలు వారేచెబితే ఎంతబాగుండేది.ఇప్పుడు వారులేరుకదా అని తలచినారు.వెంటనే గురుదేవుల కంఠము వినిపించింది. వారు భాగవతములోని కృష్ణలీలలు చెప్పుతున్నారు.ఆ విధముగా ప్రవచనము చేస్తూనే ఉన్నారు. ఒక్కసారి కళ్లు తెరచి చూడగా ఏమీ వినిపించలేదు!

ప్రసాదుగారికి ఒక ఉదయమున మనస్సులో అనుకోకుండా మహామండలేశ్వర్ అని స్ఫురణకు వచ్చినది.తక్షణమే గురుదేవులు సింహాసనముపై నవ్వుతూ కూర్చుని దర్శన భాగ్యము కలిగించారు .ఆ సమయమున వారు బంగారు రంగుఛాయగల మేనితో పట్టు వస్త్రములు ధరించి ఉన్నారు. కంటి అద్దాలు కొద్దిగా క్రిందికి జారినట్లు ఉన్నవి పట్టపగలు అటువంటి దర్శనమును ప్రత్యక్షముగా పొందిన ప్రసాదు గారు నిజముగా ధన్యజీవి!

# ఒక భక్తురాలి అనుభూతి

ఒకామెకు దయ్యము పట్టి సుమారు పదిమాసాలుగా బాధపడుచున్నది. తన ఆరునెలల పసిబిడ్డను తలక్రిందులుగా చేసి కాళ్లుపట్టుకొని ఊపేది. కిరసనామలులో గుడ్డలు పిండి ఆరేసేది. తనదగ్గరకు వచ్చినవారిని కొడుతుండేది. ఆహారము ఏమీ తీసికొనేదికాదు.ఏవేవో వికృతమైన పనులు చేస్తుండేది. వారు కనిగిరి వాస్తవ్యులు.ఏన్నోమందులువాడినారు.భూత వైద్యం చేయించారు.ఫలితము శూన్యము.వారు ఎంతో దిగులుచెంది తెనాలి తపస్వినమ్మగారికి మొరపెట్టుకున్నారు. గురుదేవులు తెనాలిలోలేరు.తణుకులో ఉన్నారు. వారికి గురువుగారి అడ్రసు యిచ్చినారు.వారు మనిషిని తణుకు పంపి గురుదేవులకు విషయమంతా విన్నవించి వారిని వెంటబెట్టుకొని వచ్చిరి.భగవంతుడు ఆర్తత్రాణ పరాయణుడు గదా! భగవత్స్వరూపులును అంతే!దయ్యము పట్టిన అమ్మాయి వారి బంధువుల యింటిలో ఉన్నకారణమున వారియింటికి గురుదేవులు వెళ్లి ఆమెనుదుట విభూతిని పెట్టిరి.ఆమరుసటిరోజునుండి ఆమెకు తగ్గినది.తీర్థము మంత్రించి పంపినారు. ఆమెకు పూర్తిగా స్వస్థత చేకూరినది.

ఆవిధముగా ఆమెకు పట్టిన దయ్యము హనుమత్స్వరూపులగు గురుదేవులను చూసి పిక్కబలము చూపినది!

# గాయత్రి వివాహమునకు సానుకూలత

గాయత్రిపెండ్లి నిశ్చయమై తాంబూలాలు తీసికొన్నారు.కాని పెండ్లిమాత్రం పదేళ్లుదాటిన తరువాత కాని జరగ లేదు! ఎందువలన అంటే ఆవరునికి చేతబడి జరిగి ఆరోగ్యం పాడయింది. అయినా అతన్నే వివాహమాడాలనుకుంది గాయత్రి.మగపెండ్లివారు అంగీకరించలేదు.గాయత్రి మాత్రము అతనే వరునిగా ఎంచుకుని

ఎందరో దేవతలకు మ్రొక్కుకుని పూజలు చేసింది. వరుడు మామూలుమనిషి అయినాడు.గాయత్రికి వివాహయోగం లేదన్నారు.ఆ పరిస్థితులో గురుదేవులను దర్శించి విషయము విన్నవించింది.'నీకేమీ భయములేదు.అతనితో నీకు వివాహంజరుగుతుంద'ని గురుదేవులు అభయమిచ్చారు. హనుమమంత్రము ఉపదేశించి 'నీవివాహం పవనకుమారుడే చూసుకుంటాడు' అని చెప్పారు. ఆ రోజు

మొదలుకొని ఆమె గురుదేవులు చెప్పిన ప్రకారం నియమనిష్ఠలతో సాధన చేయగా ఒక సంవత్సరానికి ఆ వరునిలో మార్పువచ్చింది.మరి కొన్నాళ్లు గురుదేవుల సూచనప్రకారం సాధన చేసింది.అతడు సంపూర్ణఆరోగ్యవంతుడైనాడు!వారి వివాహంజరిగింది.గుర్వనుగ్రహం వలన వారికి ఒక కుమారుడు జన్మించినాడు. గురుదేవులు ఆపిల్లవానికి 'మారుతీరాం' అని నామకరణం చేసి తరువాత అక్షరాభ్యాసం కూడ చేశారు. ఇప్పుడు ఆ పిల్లవాడు పెరిగి పెద్దవాడై విదేశాలలో ఉద్యోగం చేస్తున్నాడు.

ఎంతటి క్లిష్టసమస్యలైనను గురుదేవుల అనుగ్రహంతో తొలగిపోతవి అనుటకు గాయత్రి ఉదంతం ఒక గొప్ప తార్కాణము!

# కాళ్లజెఱ్ఱి కాటు బాధ మటుమాయం!

గాయత్రి తమ్ముడు కోగంటిపాలెం శ్రీనివాసరావుకు రాత్రిపూట నిద్రలో కాళ్లజెఱ్ఱి వీపు మీద కుట్టింది. మంటలు, పోట్లు నిలవలేక పోతున్నాడు.అది అర్థరాత్రి.ఇంట్లోవారు డాక్టరు వద్దకు తీసికొని పోవాలను కుంటే శ్రీనివాసరావు తపస్వినమ్మగారింట్లో ఉన్న గురువుగారి వద్దకు తీసుకొని వెళ్లమని పట్టుబట్టాడు. వారు గురువుగారి వద్దకు వచ్చేటప్పటికి

గురువుగారు నిద్రలో ఉన్నారు.అలికిడికి లేచారు.విషయం తెలుసుకొని 'అదేపోతుంది. బాధ ఏమీఉండదు' అని జెఱ్ఱి కుట్టినచోట తమ చల్లని కరముతో స్పృశించిరి.శ్రీనివాసుకు ఆస్పర్శ అతి శీతలము గా ఉన్నది!అంతే బాధఅంతా చేత్తో తీసివేసినట్లుగా మాయమై హాయిగా నిద్రపోయినాడు!

# మంత్రి లక్ష్మికి కలిగిన అనుభూతులు

**1.** మంత్రి లక్ష్మీప్రసన్న సావిత్రికి భరింపరాని తలనొప్పి. మందులువాడినా నొప్పి తగ్గలేదు. గురుదేవులను ఆశ్రయియించగా మూడుదినముల మంత్రముతో తలనొప్పి మటు మాయమై పోయింది!

**2.** గురుదేవులు నామప్రచారము చేస్తూ పర్యటించే రోజుల్లో ఒకసారి ఒకరింట్లో బసచేసినారు. ఆరోజు వారింటికి

బంధువులు వచ్చి ఆయజమాని గురుదేవులగదిలో పడుకోవలెననుకున్నాడు. కాని గురుదేవులు ససేమిరాఅంగీకరించలేదు. ఇదంతా గమనించిన లక్ష్మి మర్నాడు గురువుగారిని అడిగింది. గురుదేవులు నవ్వి' నిన్న వైకుంఠ ఏకాదశికదా! నేను నాప్రభువును(రాముని) సేవించిరావాలి. ఇతడేమో వైద్యుడు. మధ్యలో లేచి... . నాదేహమును చూసి పరీక్షచేస్తే ....ఎలా? అందుకని పడుకోవద్దని చెప్పాను' అన్నారు!

ఆయా పర్వములందు(బహుశ:ప్రతి ఏకాదశికికూడ)గురుదేవులు యోగమార్గమున వైకుంఠమువెళ్లి రామనారాయణుని సేవించి వచ్చేవారని దీనిని బట్టి తెలియుచున్నది!!!

**3.** గురుదేవులే లక్ష్మికి స్వయముగా చెప్పిన విషయము – గురుదేవులకు జాతక రీత్యా డెబ్బదిమూడు సంవత్సరముల ఆయుర్దాయము. గురుదేవుల గండకాలములో దేహమునుండి జీవుడులేచి ఎదురుగా ఉన్న చూరుమీద నలచినాడు! కింకరులు వచ్చి వెళ్లిన తర్వాత తిరిగి జీవుని దేహములో ప్రవేశపెట్టారు. ఆవిధంగా నామప్రచారము చేయడానికి తమ ఆయుర్దాయమును పొడిగించుకొన్నారు!

**4.** తెనాలి రామాలయములో గురుదేవులు ఆధ్యాత్మికోపన్యాసములు ఇస్తున్న సమయంలో ఒకరోజు లక్ష్మీకుటుంబ సభ్యులు గురువుగారిని తమయింటికి ఆహ్వానించినారు. ఆరోజు ఆకాశం మేఘావృతమైనది. వానపడితే గురువుగారికి అసౌకర్యముగా ఉంటుందని వానపడకుండా ఉండేటట్లు గురువుగారిని ప్రార్థించారు. సాయంకాలం రామాలయమునకు వచ్చేటప్పుడు, వారియిల్లు చుట్టుప్రక్కలామినహా మిగిలిన ప్రాంతమంతా కుంభవర్షము కురిసినట్లు గమనించారు లక్ష్మి ఆమె కుటుంబ సభ్యులు!

**5.** విజయవాడలో రాఘవేంద్రస్వామి ఉత్సవములకు వెళ్లినప్పుడు,రామకోటిలో ఆంజనేయస్వామికి లక్ష్మి నమస్కరించి నప్పుడు ఆంజనేయస్వామిలో గురుదేవుల అయిదుముఖములు కనిపించినవి! ఒళ్లు జలదరించి,అచట నిలవలేక పోయింది. పంచముఖఆంజనేయస్వామి ఆవేశము కల్గినది. నడవలేక రిక్షాలో యింటికి చేరింది. నోటమాట వచ్చుటలేదు. అన్నముకూడ తినలేకపోయినది. ఈవిషయము విన్న గురుదేవులు 'లక్ష్మీ,ఏమయింది?' అని అడుగగా 'రామకోటి లో ఆంజనేయస్వామిని చూచి నమస్కరించినప్పుడు మీ ముఖములు అయిదుగా కనిపించినవి ! తట్టుకోలేకపోయాను' అన్నది లక్ష్మి. 'నేను అయిదు ముఖాలుగా కనిపించానా!'అని చమత్కరించి ఆమెశిరస్సుపై తమ హస్తమునుంచిరి. కొద్ది నిమిషములలో మామూలుమనిషి అయింది.

గురుదేవులు లక్ష్మితో 'పంచముఖ ఆంజనేయస్వామికి నాకు భేదము లేదు' అని చెప్పినారు!

**6.** లక్ష్మి తమ్ముడు శ్రీనివాసరావు మంగళగిరి నృసింహస్వామి దర్శనము చేసుకొనుటకు గుడిముందు ఆగి ప్రదక్షిణములు, గురుమంత్రము జపిస్తూ చేస్తున్నాడు. ఇంతలో గర్భగుడి నుండి 'నేనే గురువుగారిని ...నేనే గురువుగారిని ...' అని పెద్దగా శబ్దములు వినిపించినవి! ఆరోజు నృసింహజయంతి.

# సుబ్బులమ్మగారికి గురుదేవులు ఆంజనేయస్వామిగా దర్శనమిచ్చుట!

తెనాలిలో 4-2-1993న ఉపాధ్యాయురాలు తులశమ్మగారింట అఖండనామ సప్తాహము ప్రారంభమున గురుదేవులు జ్యోతిప్రజ్వలనం చేశారు. ఆరోజున విశేషముగ వచ్చిన భక్తు సందోహములో ప్రప్రథముగా గురువుగారిని చూసిన సుబ్బులమ్మ అను భక్తురాలికి గురుదేవులు ఆంజనేయస్వామిగా దర్శనమిచ్చిరి. ఆమెపులకిత గాత్రఅయినది! తరువాత గురుదేవులను దర్శించి, తన అనుభూతిని చెప్పి,మంత్రోపదేశము చేయవలసినదిగా వేడిరి.గురుదేవులు మహా శివరాత్రి కి ముందు రోజున ఆమెకు మంత్రదీక్ష నిచ్చిరి.

గురుదేవులు తాము మంత్రోపదేశము చేయదలచినవారికి, వారినేతమ వద్దకు రప్పించుకొని మంత్రదీక్ష యిచ్చెడువారు.

# దొడ్డవరప్పాడు నీటికొరత నివారణ!

దొడ్డవరప్పాడు ఒకచిన్నపల్లెటూరు.ఆఊరిలో వేసవిలో నీటిఎద్దడి చాలా తీవ్రముగా ఉండేది.ఊరిలో ఉన్న చెరువు వేసవిలో ఎండిపోయేది. నీటికోసం ఊరివారు చాలాదూరం వెళ్లాల్సి వచ్చేది. ఈవిషయం గురుదేవులకు తెలిసి ఆ ఊరిలో ఆంజనేయస్వామి విగ్రహమును ప్రతిష్ఠించారు.అది మొదలు ఆంజనేయస్వామివారి విగ్రహము నుండి ఓంకార' నాదము పెద్దగా కొన్నిమైళ్లదూరము వరకు వినిపిస్తున్నది.ఈవి ంత చూడడానికి చుట్టుప్రక్కల గ్రామాలవారు ప్రతిరోజు కొన్ని వందలమంది వచ్చేవారు.ఆయాత్రికుల భోజన ఏరా ్పట్లు గురుదేవుల శిష్యుడైన ఆగ్రామపెద్దపై బడినది

'ఓంకార నాదము' పెద్దగా వినబడుతున్న సంగతి తెలిసి గురుదేవులు ఆ ఊరు వెళ్లి , శబ్దము పెద్దగా వినబడకుండా చేసినారు! ఆంజనేయస్వామివారి విగ్రహము ఆఊరిలో ప్రతిష్ఠ చేసినదాదిగా స్వామివారి అను గ్ర హమువలన ఆ గ్రామవాసులకు నీటికొరత తీరినది!

# మునగపాటి సూర్యనారాయణ గారి బిడ్డపై గురుకృప

మునగపాటి సూర్యనారాయణగారి మూడవబిడ్డకు పిల్లలు వికృతముగా పుట్టి,చనిపోతున్నారు.వారు గురుదే వుల నాశ్రయించగా, ఈసారి గర్భముదాల్చిన మూడవమాసంలో తనవద్దకు రమ్మని గురువుగారు చెప్పినారు.

అలాగే మూడవ మాసంరాగానే గురుదేవులవద్దకు వచ్చిరి.గురుదేవులు ఆమె పొట్టనిమిరి ఒకదారమునిచ్చి దానిని కటిప్రదేశానికి కట్టు కొమ్మని చెప్పి,విభూతి,సాంబ్రాణి,తీర్థమును మంత్రించి యిచ్చిరి.ఆమె నెలలు నిండిన తర్వాత సుఖముగా ప్రసవించి పండంటి బిడ్డను కన్నది.పుట్టిన బిడ్డ దృఢముగాను,ఆరోగ్యముగాను, ఎట్టివంక లేకుండా కలిగినాడు!తదుపరి సంతానం కూడా బాగుగానే ఉంది.

పరీక్షిత్తును రక్షించిన శ్రీకృష్ణుని వలె గురుదేవులు గర్భస్థ శిశువును కాచి రక్షించారు!

# గురుదేవులు విభూతి సృష్టించుట!

గురువుగారు దొడ్డవరప్పాడులో ఉన్నప్పుడు ఒకావిడ అశాంతితో భూత,గ్రహ, బాధలతో ఉండి వీరిని విభూతి అడిగింది.'అమ్మా,నావద్దలేదు, నీవు తెచ్చుకుంటే మంత్రించి యిస్తాను' అని అన్నారు. గురుదేవులు.ఆమెతిరిగి మరల వట్టి చేతులతో వచ్చి 'విభూతి దొరకలేదు' అన్నది.వారు 'అలాగా' అని వెల్లకిలా వాలుమీదకాలు వేసుకొని పరుండి, కళ్లు మూసుకొని చూపుడువ్రేలు,బొటనవ్రేలు నలుపుచూ,'అమ్మా, చెయ్యిపట్టు,' అని విభూతిని సృష్టించి ఆమెచేతిలో వేసి ఆమె నుదుట బెట్టినారు!ఆవిభూతి ధరించడం వల్ల ఆమెకు శాంతి చేకూరి,ఆరోగ్యము కుదుటపడినది!

# వేదపండితునిపై గురుకృప!

ఈసంఘటన గురుదేవులు స్వయముగా చెప్పినది!

గోదావరి మండలమున ఒక వేదబ్రాహ్మణుడు గొప్పపండితుడు.ఆయన గొప్పఉపాసకుడు. తన కొబ్బరి తోటను కౌలు కుయివ్వగా ఆరైతు సరిగా కౌలుయివ్వక,పొలము స్వాధీనము చేయక పోగా ఆబ్రాహ్మణుని చెదిరించుచుండెను.

ఆబ్రాహ్మణుడు చివరకు గురువుగారిని ఆశ్రయించెను. గురుదేవులు 'మీకు తెలియనిదేముంది?' అన్నారు. కాని ఆయన గురుదేవులను శరణువేడెను. అప్పుడు గురుదేవులు'మండనదీక్ష వహించి సుందరకాండ పారాయణము చేయమ' నిరి.ఆబ్రాహ్మణుడట్లే చేసెను.

ఒకరోజు ఆబ్రాహ్మణుడు పొలములోకి వెళ్లి కొబ్బరికాయలు కోయబోగా రైతులు కోపముతో ఆయనను కొట్టబోయిరి. ఇంతలో ఒక అద్భుతము జరిగినది.ఒక్కొక్కకొబ్బరి చెట్టుపై ఒక్కొక్క కోతి నిలిచినది!కోతులను చూచి ఆ రైతులు భయపడి ఆ బ్రాహ్మణుని పాదములపై బడి శరణువేడిరి. ఆయన పొలము స్వాధీనమైనది!

# ఒకశిష్యురాలిపై గురుకృప!

ఒక శిష్యురాలి భర్త ఊరిలోలేని సమయమున ఒకనాటి రాత్రి దొంగలు తలుపులు కొడుతూ,తలుపులు తీయమంటే బెదిరిస్తున్నారు.ఈఇల్లు మిగిలిన యిండ్లకంటే కొంచము దూరము గాఉంటుంది.కేకలు వేసినా ఎవ్వరికీ వినిపించదు. ఆమె పిల్లలతో ఒక్కతే ఉన్నది. తలుపులు బద్దలు కొట్టిలోపలికి వస్తారేమోనని భయపడి గురువుగారి పటము ముందు పెట్టుకొని,'గురుదేవా,మీరే దిక్కునాకు,మమ్మల్ని మీరే కాపాడాలి' అని ప్రార్థించింది.

గురుదేవులు పటములోనుండి బయటకు వెళ్లడం ఆమెకు కనిపించింది!దొంగలు వెళ్ళి పోయారు.గురుదేవుల మహిమ వల్ల వారు రక్షింపబడినారు!

# ఇతరశిష్యులు , భక్తుల అనుభూతులు

## వాత్సల్యమూర్తులు గురుదేవులు

– శ్రీ M.B.రామచంద్రమూర్తి

1971 వసం॥ లో శ్రీగురుదేవులతో నా మొదటి పరిచయంలోనే నేను అనిర్వచనీయమైన ఆనందాన్ని, అనుభూతిని పొందాను.నా ఆనందాన్నిచూసి గురుదేవులు మాకుటుంబవిషయాలన్నీ అడిగా తెలుసుకొని నన్ను రామనామ జపం చేయమన్నారు. కొద్దిరోజుల తర్వాత లక్ష్మీవారం ఏకాదశినాడు రామ,సీతా మంత్రములు ఉపదేశించినారు. నిజంగా ఆ మంత్రాలు తీసికొనేటప్పుడు నా శరీరమంతా పులకించినది.కొద్దిక్షణములు నాకు బాహ్యస్మృతి లేదు.ఆ రోజు మొదలు వారిని తలవనిదే నా దినచర్య జరుపుకోను.

ఒకసారి ఒక వింత సంఘటన జరిగింది.ఆరోజుఆదివారం.సాయంత్రం నాలుగు గంటలకు నేను ఏదో వ్రాసు కుంటుండగా మాఆవిడ నావద్దకు వచ్చి,'మన గురువుగారు వస్తునట్లుగా ఉంది' అంది.

'వారి వదద్దనుండి ఉత్తరంలేదు. ఉత్తరం వ్రాయకుండా రరు. ఒక్కరూరాలేరు.మంచి వర్షం పడుతోంది–కనుక గురువుగారు ఏంవస్తారులే ' అని ఊరుకున్నాను. సాయంత్రం ఆరు గంటలకు రిక్షాలో దిగుతున్న గురువుగారిని చూచి ఒకప్రక్క ఆనందం మరొక ప్రక్క బాధ కలిగింది.వారిని సాదరంగా ఆహ్వానించి,

క్తో విశ్రమించిన తర్వాత 'ఏమిటి గురువుగారూ, ఇలా చేశారురుఝ' అని అంటే 'అమ్మాయి చెప్పలేదా?' అన్నప్పుడు సిగ్గుతో తలదించుకోవాల్సి వచ్చింది.

'అమ్మాయిని,పిల్లలను చూడాలనిపించింది. అమ్మాయి కూడరమ్మంది. ఆలస్యంఎందుకు, అని వచ్చాను' అన్నారు గురువుగారు.మేము అనుకోవడం తడవుగా మాయింటికి వచ్చి మమ్మల్ని దీవించేవారు.వారు మాపై చూపిన ప్రేమ, ఆదరణ మరచిపోలేనిది.

# మహామంత్రశక్తి అనంతం

**– శ్రీ S.S ప్రకాశరావు**

మంత్రాలకు ఉన్నశక్తి అనంతం.దానిని భక్తి,శ్రద్ధ,విశ్వాసము తోచేసిన వారికి సత్ఫలితాలు అనతి కాలంలో లభిస్తాయి.'మంత్రాలకు చింతకాయలు రాల్తాయా' అని లోకంలో మంత్రశక్తి తెలియని అజ్ఞులు హేళన చేస్తుంటారు. విజ్ఞులు,జ్ఞానులు ఆ అవహేళనను పట్టించుకోక పోగా వారిని మూర్ఖులుగాను, మతిభ్రమించిన వారుగా భావిస్తారు. మహా మంత్రశక్తి చేత ఎన్నో.....మరెన్నో దుష్టశక్తులు,క్షుద్రశక్తులు పలాయనం చిత్తగించిన సంఘటనలు ఉన్నాయి.

మా కుటుంబాన్ని అల్లకల్లోలం చేసి,మా హృదయాలలో ఆవేదనను మిగిల్చి ఇంటిలో తినడానికి కూడ ఏమి మిగల్చక,మమ్మల్ని నానాయిక్కట్లకు గురిచేసిన క్షుద్రశక్తుల పన్నాగంనుండి మేమెట్లా బయట పడిందీ,ప్రస్తుతం ఎంతటి ప్రశాంత జీవితాన్ని గడుపుతున్నదీ వివరిస్తాను.ఆక్షుద్రశక్తులను పారద్రోలడానికి మాకు మహెూపకారంచేసిన, మేము జీవితంలో మరువలేని మహావ్యక్తి, భడవంతుడు, శ్రీరామపరతత్వమహా ప్రపంచ విహారులు,తాత్వికులు, నిస్వార్ధ, నిరాడంబరులైన శ్రీశ్రీశ్రీ శ్రీరామశరణ్ గురుదేవుల వారి మంత్రోపదేశంతో మేము కష్టాలకడలి నుండి ఒడ్డుకు చేరుకున్నాం. మంత్రాన్ని భక్తి,శ్రద్ధ,విశ్వాసంతో నిత్యంపారాయణ చేసుకుంటూ ఆక్షుద్రశక్తు బారినుండి మేము బైటపడ్డాం. భక్తి,శ్రద్ధ, విశ్వాసం లేకుండా ఎన్నివేలసార్లు జపమాల త్రిప్పినా ప్రయోజనం శూన్యమని ఈ సంఘటన ఋజువు చేస్తున్నది.

నేను ప్రమోషన్‌పై ఎంత సంతోషం,ఆనందంతో హైదరాబాద్ వెళ్లానో,అనతికాలంలో ఆరెండు ఆవిరి ఆయ్యాయి.

ప్రతికూల ఆఫీసు పరిస్థితులు, ఆర్ధికస్థితి నన్ను క్రుంగదీశాయి. ప్రశాంతత కోసం నాసహెూద్యోగి వెడుతున్న ఆధ్యాత్మిక ఉపన్యాసాలకు వెళ్లాను. ఆప్రసంగాలు నన్ను ఉతేజితుణ్ణి చేశాయి. నాలో నిద్రాణమై ఉన్న ఆధ్మాత్మిక తత్వం తిరిగి పునర్వికాసం చెందింది.

కొంతకాలానికి ప్రసంగాలు ఆధ్యాత్మికత నుండి భగవంతుని సేవల గురించి, భగవంతుని ఆభరణాలమీదా విమర్శలపైకి మళ్లాయి.ఆత్మలేదని,భగవదారాధనవద్దని,దీపారాధన కూడదని కట్టడి చేశారు.ఇది నచ్చని నా సహోద్యోగి తో పాటు చాలామంది మానేశారు. నేను మాత్రం వీలుచిక్కినప్పుడల్లా వెళ్లేవాడిని.నా పద్ధతి నచ్చక కుటుంబంలో కలతలు ప్రారభమయ్యాయి. ఇంటి విషయాలు పట్టించుకోవడం మానేశాను. కుటుంభంలో విభేదాలు తారాస్థాయికి చేరాయి. అప్పుడే నాకు విజయవాడ బదాలీ అయ్యింది. ఇక్కడకు వచ్చానేగాని పూర్వపు వాసనలు నన్ను వదలలేదు.

విచిత్రం ఏమంటే కొంతకాలానికి నాలో తెలియకుండా పెద్దమార్పు వచ్చింది. నామిత్రుడు భద్రాచలమూలవిరాట్ సీతారామలక్ష్మణుల ఫొటో నాకు యిచ్చాడు.దానిని ఫ్రేమ్ కట్టించి రోజూదానికి నమస్కరించేవాడిని.అత్యవసర పనిమీద హైదరాబాద్ వెళ్లినప్పుడు లోగడ ప్రసంగాలు చేసే వ్యక్తిని కలిసి వచ్చాను. నేను విజయవాడ వచ్చిన సుమారు పది రోజులకు నాపెట్టెలో డబ్బులు మాయమవడం,నెమ్మదిగా ఇంట్లోఉన్న బంగారు ఆభరణాలతో సహావిలెవైన వస్తువులన్నీ మాయమయ్యాయి. ఎందుకిలా జరుగుతుందో నాకు అర్ధంకాలేదు. నాభార్యకు హైదరాబాద్‌మీద అనుమానం కల్గింది. తినే పదార్ధాలు పనికిరాకుండా పోవడం, డ్రమ్ములోనొ బియ్యం ఉపయేగించుకోవడానికి వీలులేనట్లుగా చేయడం, ఇంట్లో భయానక వాతావరణం ఏర్పడి మాకందరికి దిక్కుతోచని అయోమయ స్థితి కలిగింది.

ఇటువంటి స్థితిలో మాకళ్లకు కాంతిరేఖ కనిపించింది.శ్రీశ్రీశ్రీ శ్రీరామశరణ్ గారు రాఘవేంద్రస్వామి ఉత్సవాలకు

వస్తునట్లు తెలిసింది. మేము వారిని కలిసి, మాదీనస్థితిని వివరించి, మాకు మంత్రోపదేశం చేయమని అర్ధించాం. మీకు మంత్రం ఇస్తాను.గురువుపట్ల,మంత్రాధిష్ఠాన దేవత పట్ల విశ్వాసం పెంచుకొని రోజూ 'సహస్రం' చేయమని సలహా ఇచ్చారు.గురువుగారి ఆదేశం ప్రకారం చేశాం.అక్షుద్రశక్తులు ఎప్పుడు పలాయనం చిత్తగించాయో మాకు తెలియదు. గురువుగారి అనుగ్రహం,ఆశీస్సులతో మా అబ్బాయికి ఉపనయనం,మాఇద్దరు ఆడపిల్లలకు వివాహాలు అయ్యాయి.

మేము అనేక జన్మలలో చేసిన పుణ్యఫలవిశేషంచేతనే గురుదేవులు మాకు లభించారన్న ఆత్మానందం మాకు మిగిలింది. గురుదేవులు మాకు చేసిన మహోపకారానికి మేమెంతో ఋణపడి ఉన్నాం. అటువంటి మహామనిషి రామ, శివ,ఆంజనేయస్వామి సాక్షాత్కారం పొందిన శ్రీగురుదేవుల వారికి మాకుటుంబం అశ్రుతర్పణాలర్పిస్తున్నది.

## ఆణిముత్యాలు:-

**1.**గురువుగారు వ్రాసే ప్రతి ఉత్తరంలోను సావిత్రి ఆరోగ్యం జాగ్రత్త.మందులు,టానిక్కులు ఇప్పించండి.మీ అమ్మ గారిలాగే తయారవ్వాలి.అని హెచ్చరించేవారు.వాస్తవానికి మాఆవిడ ఆరోగ్యం దెబ్బతింది.ఆరోగ్యం మెరుగయ్యేందుకు మందులు వాడుతూనే ఉంది.గురువుగారు ప్రతి ఉత్తరంలోను ఆవిడ ఆరోగ్య స్థితిని గురించి ఎందుకు ఇంత శ్రద్ధ గా హెచ్చరిస్తున్నారో మాకు అంతుపట్టలేదు.ఇప్పుడు గురువుగారి మాటల్లోని ఆంతర్యం అర్ధమైంది.గురువుగారు భవిష్య వాణిని ఎంత చక్కగా వినిపించారో మాకు ఈనాటికీ ఆశ్చర్యంగానే ఉంటుంది.

**2.** మా పెద్దమ్మాయి వివాహముహూర్తం నిర్ణయించాక విజయవాడలో విడిదిచేసియున్న గురువుగారికి తెలియజేశాను. గురువుగారు యాపిల్ పండు మంత్రించి నాకిచ్చి,ఎవ్వరికీ పెట్టకుండా అమ్మాయి ఒక్కదాన్నే తినమని అన్నారు.కొంతకాలానికి ఆమెకి ఇద్దరు మగపిల్లలు కలిగినారు.

**3.** మా రెండో అమ్మాయికి కూడ ముహూర్తం నిర్ణయంకాగానే గురువుగారి ఆశీస్సులకు వెళ్లింది.దానికి కూడ గురువుగారు మంత్రించిన యాపిల్ పండును ఇచ్చి దాని నొక్కదానినే తినమని చెప్పారు. దానికి కూడ ఇద్దరు కుమారులు కలిగారు. గురువుగారి జన్మదినోత్సవం, వారి నక్షత్రం నాడు పుట్టిన పెద్దకొడుకుకి 'శరణ్' అని పేరు పెట్టింది. నేను రామ నామం చేసేటప్పుడు నామనమలు నలుగురూ నృత్యంచేస్తూ నామం చేస్తారు. గురువుగారు వారిలో రామనామాన్ని గర్భంలో ఉండగానే ఉపదేశించారేమో నని మాకు అనిపిస్తుంటుంది.

**4.** కరీంనగర్జిల్లా సిరిసిల్లా తాలూకా ఎల్లారెడ్డి పేటలో సత్సంగసదనం వార్షికోత్సవాలలో ఉపన్యసించడానికి వెళ్లిన గురువుగారిని ఒకయువజంట దర్శించి తమకు నాలుగేళ్లక్రితం వివాహమైందని,సంతానం కల్గలేదని విచారంతో చెప్పారు. గురువుగారు ఒక యాపిల్పండు మంత్రించి ఆమెకిచ్చి, ఆయువతి భర్తను కూడపిలిచి, వారిద్దరికి ఏకాంతంగా ఏదోచెప్పారు. కొన్నినియమాలుకూడ చెప్పారట. మరుసటి సంవత్సరం గురువుగారు మరల ఆఊరికి వెళ్లినప్పుడు ఆమె బాబును ఎత్తుకొనివచ్చి, గురువుగారి చేతులలో ఉంచి ,మాబాబు అని ఎంతో వినయ, వినమ్రతలతో చెప్పింది. గురువుగారు చిన్నబాబును తీసుకొని,కొద్దిసేపు ముద్దాడి,తిరిగి ఇచ్చేశారు. ఇదేవిధంగా మరోయువతి కూడ తనకు సంతాన ప్రాప్తి కలిగేటట్లు అనుగ్రహించమని గురువుగార్ని వేడుకుంది. గురువుగారు మొదటి యువతికి ఇచ్చిన మాదిరిగానే ఇచ్చారు. నియమాలు కూడ చెప్పారు.కాని ఆమె నియమాలు పాటించనందున ఆమెకు సంతానంకల్గలేదని కొందరు గురువుగారికి చెప్పారు.

**గురువుగారి మహత్తులు,విభూతులు అందరికీ అంతుపట్టవు.ఎంత సాన్నిహిత్యం, అనుబంధం ఉన్నప్పటికి పరమాత్మను సామాన్య జీవుడు అర్థం చేసుకోవడం ఎంతో కష్టం.**

# రాజేశ్వరి శిశువుకు గురుదేవుల ఆశీస్సు!

రాజేశ్వరి పురిటికి పుట్టింటికి లక్నోవెళ్లి అచట మగబిడ్డను ప్రసవించింది.పుట్టిన పిల్లవాడు ఎటువంటి ఘడియలలో పుట్టాడో, శాంతి ఏమైనా ఉందేమోనని ఆలోచిస్తూ పడుకుంది.కలలో గురువుగారు బిడ్డఉయ్యాల దగ్గరకు వచ్చి బిడ్డను చూసి'ఈబిడ్డ గొప్పజాతకుడు.ఎటువంటి దోషం లేదు.చాల మంచిఘడియలలో పుట్టాడు' అని చెప్పి అదృశ్యమైరి.

గురువుగారు భౌతికముగా మనమధ్య లేకున్నా,మనమంచి చెడ్డలను చూస్తూనే ఉంటారు!

# ఘండికోట సంగయ్యగారి అనుభూతి

నాకు జ్వరము తగులుతున్నప్పటికీ మాబంధువులతో తలిసి కాశీయాత్రకు వెళ్లాను. అనారోగ్యానికి ఎన్నో మందులు వాడాను.కాని అది తాత్కాలికమే.కాశీలో ఒళ్లు తెలియని స్థితిలో ఎక్కిళ్లు కూడ పుట్టినవి. గుర్వనుగ్రహంతో ఎంతో కష్టంతో తిరుగు ప్రయాణమైవచ్చాను. గురుదేవుల ఆశీస్సులకొరకు బుద్దాం వెళ్లాము.నాఆరోగ్యపరిస్థితిని వారికి విన్నవించుకొన్నాను.కొద్దిసేపు పడుకొని విశ్రాంతి తీసుకొమ్మనినారు. నేను నిద్రలేచేసరికి నాజ్వరం తగ్గిపోయింది! గురుదేవులు తీర్థము, విభూతి మంత్రించి ఇచ్చారు. వాటిని స్వీకరించేసరికి నా ఆరోగ్యము పూర్తిగా కుదుటపడింది! ఇది గురుదేవుల అనుగ్రహమునకు ప్రబల తార్కాణము.

# సీతామహాలక్ష్మి అనుభూతి

ఒకసారి నేను,నామరదలు మాస్వగ్రామానికి వెళ్లాలని బయలుదేరాము. మాగ్రామంచేరుకోవడానికి కొంచెం దూరం నడవాలి దారి తప్పి సుబాబుల్ తోటలవైపు వెళ్లాము.వెళ్లేదారి తెలియక

అక్కడే కూర్చుని గురువుగారినే తదేకముగా స్మరించాము. నరసంచారములేని ఆప్రదేశములో ఎవరో దంపతులు వచ్చి 'మేము సంగల్లపాలెం వెడుతున్నాము,మీరూ రండి',అని మాకు దారి చూపించారు. అక్కడ బోరింగు పంపువద్ద మంచినీరుత్రాగి మరల చూస్తే వారిద్దరు కన్పించలేదు! అంతకు ముందు మేము కృతజ్ఞతాభావంతో వారిని సీతారాములుగా భావించి మావద్దనున్న మామిడి పండ్లను వారికి సమర్పించుకొనగా ఎంతో ప్రీతితో వారు స్వీకరించినారు. ఇదంతా గురుదేవుల అనుగ్రహఫలితమే!

# లక్ష్మీ సౌజన్య అనుభూతి

నాకు మెడిసిన్‌లో సీటు వచ్చాక మేము బుద్దాం వెళ్లాము. నాకు బస్సుప్ర యాణం సరిపడదు. ఎప్పుడైనా తప్పని సరై చేయాల్సివస్తే వాంతులయ్యేవి. మేము గురువుగారిని దర్శించి తిరిగి బయలుదేరేటప్పుడు, వారు తమ సహజ వాత్సల్యంతో 'భోజనం చేసి వెళ్లండి' అన్నారు. నా సమస్యను వారికి విన్నవించగా, 'వాంతులురావు. "నేను చెబుతున్నాను భోజనంచేసి వెళ్లు ", అని ఆదేశించగా అట్లాగే చేశాను. తదాది నేటివరకు కప్పుడు బస్సుప్రయాణం చేసినా నాకు వాంతులు కాలేదు!

శ్రీవారి కృపకు ఇది ఒక తార్కాణము!